ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-8-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 200 పేజీలు: 12 వెల: 6.50

6 వేల విద్యార్థి వీసాలు రద్దు!

మరో 15 యేళ్లలో చంద్రునిపైకి భారత్ వ్యోమగామి

9లో

## విపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి
# జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి



**ప్రకటించిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే**

**న్యాయవేత్తగా సుదర్శన్ రెడ్డి ప్రఖ్యాతి**

**ఎన్డీయే అభ్యర్థి ఏకగ్రీవ యత్నాలకు గండికొడుతూ బరిలోకి దిగిన విపక్షం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి జాతీయ స్థాయిలో విపక్ష కూటమి కీలక నిర్ణయం తీసుకుంది. తమ అభ్యర్థిగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటన చేశారు. ఇందుకు విపక్ష పార్టీలన్నీ మద్దతు తెలిపాయన్నారు. ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగ ఎన్నుకోవాలని అధికార పక్షం విజ్ఞప్తి చేసిన సమయంలోనే విపక్ష పార్టీలు తమ అభ్యర్థిని ప్రకటించాయి. 'దేశంలోని ప్రఖ్యాత న్యాయనిపుణుల్లో బి.సుదర్శన్‌రెడ్డి ఒకరు. ఆంధ్రప్రదేశ్, గువాహటి హైకోర్టులతోపాటు సుప్రీంకోర్టులో సేవలందించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయంపై స్పష్టమైన అవగాహన కలిగిన వ్యక్తి. ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలని ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ఓ అభిప్రాయానికి వచ్చి ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాయి' అని ఖర్గే పేర్కొన్నారు. ప్రతిపక్షాలన్నీ ఒకే పేరును అంగీకరించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయమన్నారు.

**ఉస్మానియా వర్సిటీ నుంచి..**

జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకులమైలారం. 1946 జూలైలో జన్మించిన ఆయన 1971లో ఉస్మానియా యూనివర్సిటీలో లా పూర్తి చేశారు. >>2

## సంపన్నుల చేయూత
# పేదలకు అందాలి



మంగళవారం కుప్పం బంగారు కుటుంబాలకు అడాప్ట్ ట్రీని అందించిన సిఎం చంద్రబాబు

**పి-4 పథకాన్ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు**

**ప్రజారోగ్య పరిరక్షణకు 'సంజీవని' కొత్త పథకం**

**విదేశాలలో ఉన్న మార్గదర్శులతో జూమ్‌లో మాట్లాడిన సిఎం**

**విజయవాడ, ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్థిక సంస్కరణలవల్ల సంపద సృష్టించడం చాలా సులభమైన ప్పటికి, సమాజంలో పేదలు ఇంకా అలానే ఉన్నారని సిఎం చంద్రబాబు అన్నారు. అలాంటి వారిని ఆర్థికంగా అందరితో సమానంగా పైకి తీసుకొచ్చేందుకే పి4 కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు సంజీవని పేరిట కొత్త పథకం తీసుకొస్తున్నట్లు సిఎం స్పష్టం చేశారు. ఉత్తమ ఆరోగ్య విధానంగా సంజీవిని అమలవుతుందని అన్నారు. బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రజారోగ్య పరిరక్షణ చేపడతామని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే సంజీవనిలానే ఈ పథకం అమలవుతుందని వెల్లడించారు. మంగళగిరిలో నిర్వహించిన పి4 ప్రారంభ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో తొలుత బంగారు కుటుంబాలు, వారిని దత్తత తీసుకున్న మార్గదర్శులతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. మానవత్వంతో మంచి సమాజం కోసం పని చేయాలని కోరుతున్నానని అన్నారు. మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోని అభివృద్ధి చెందాలని సిఎం ఆకాంక్షించారు.

సమాజం ఇచ్చిన సహకారంతో ఎదిగిన వారు సమాజానికి తిరిగివ్వాలని మార్గదర్శులు కూడా ఆలోచించాలని తెలిపారు. విదేశాల్లో ఉన్న వారితో జూమ్ ద్వారా ముఖాముఖి నిర్వహించారు. బంగారు కుటుంబాల దత్తతకు సౌదీ అరేబియాకు చెందిన పలువురు తెలుగువాళ్లు ముందుకొచ్చారు. అలాగే కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను చంద్రబాబు దత్తత తీసుకున్నారు. దత్తత సంకేతంగా అడాప్ట్ ట్రీని బంగారు కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ మార్గదర్శులు డబ్బులివ్వడమే కాదు, ఇబ్బందులు తొలగించేలా భరోసా ఇవ్వగలగాలని స్పష్టంచేశారు. ఓ అజ్ఞాత భక్తుడు తాను పెట్టిన కంపెనీ ద్వారా వచ్చిన సంపాదన నుంచి రూ.140 కోట్ల విలువైన 121 కేజీల బంగారాన్ని వెంకన్నకు ఇస్తున్నారని గుర్తుచేశారు. భూమి మీద ఎవరూ శాశ్వతం కాదని వెళ్లేటప్పుడు ఏం తీసుకెళ్లలేరు ఉన్నప్పుడు మనుషులుగా బతకాలి చనిపోయిన తర్వాత కూడా మనల్ని గుర్తు పెట్టుకునే పనులు చేయాలని అభిప్రాయపడ్డారు. మానవత్వంతో మంచి సమాజం కోసం పని చేయాలని కోరుతున్నానని అన్నారు.

మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోని అభివృద్ధి చెందాలని సిఎం ఆకాంక్షించారు. మార్గదర్శులు ఇచ్చిన చేయూతను బంగారు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థిక సంస్కరణలతో సంపద వచ్చిందని, ఇప్పుడు సమాజంలో >>2

## అధికారంలోకి రాగానే సిఇసిపై చర్యలు

**గయ సభలో రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు**

**ఓట్ల చోరీ కోసమే బీహార్ ప్యాకేజి**



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఓట్ల చోరీ వ్యవహారంలో సిఇసి జ్ఞానేశ్ కుమార్‌తో పాటు, మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లపై కూడా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బిహార్‌లో చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా గయాలో నిర్వహించిన సభలో రాహుల్ ప్రసంగిస్తూ ఇసిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో ఓట్ల అవకతవకల వ్యవహారం వెలుగుచూసినప్పటికీ, ఎలక్షన్ కమిషన్ తనను అఫిడవిట్ దాఖలు చేయాలని కోరుతోందని రాహుల్ విమర్శించారు. కొద్ది సమయమిస్తే, ప్రతి అసెంబ్లీ, లోక్‌సభ స్థానంలో ఇసి లోపాలను ప్రజల ముందు ఉంచుతామని, అప్పుడు వారే ఎన్నికల సంఘాన్ని అఫిడవిట్ ఇవ్వాలని అడుగుతారని రాహుల్ అన్నారు.

**ఎస్ఐఆర్ ఓట్ల చోరీకి ఒక కొత్త రూపం!**

'ప్రధాని మోడీ స్పెషల్ ప్యాకేజీ గురించి మాట్లాడినట్లే, ఇసి కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరిట బిహార్ కోసం ప్రత్యేక ప్యాకేజీ తీసుకొచ్చింది. ఓట్ల దొంగతనానికి ఇదొక కొత్త రూపం. అయితే, బిహార్ ప్రజలు ఈ మోసాన్ని జరగనివ్వరు. అయితే ఒక్క విషయం కచ్చితంగా గుర్తుంచుకోండి. కేంద్రంలో, బిహార్‌లో కచ్చితంగా ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడే రోజు వస్తుంది. అప్పుడు సిఇసితో సహా ఎలక్షన్ కమిషనర్లపై చర్యలు తీసుకుంటాం'అని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. ఆ సమయంలో భోరున వర్షం పడుతున్నప్పటికీ రాహుల్ తన >>2

## డి.సిఎంపై సిబిఐ విచారణకు డిమాండ్

**విజయవాడ,ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి:** హరిహర వీరమల్లు సినిమా,వాణిజ్య కార్యక్రమాలను ప్రమోట్ చేసుకునేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రభుత్వ నిధులు,అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని,ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ మాజీ ఐఎఎస్,లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ వేసిన పిటీషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. విచారణను వారంరోజులకు వాయిదావేసింది. సిబిఐ, ఎసిబి తరపు న్యాయవాదుల పేర్లను కేసుల విచారణ జాబితాలో (కాజ్‌లిస్ట్‌లో) చేర్చాలని రిజిష్ట్రీనిఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు ఇవ్వాలని పిటీషనర్ తరపు న్యాయవాది బాల చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ దశలో ఎలాంటి నోటీసులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. వ్యాజ్యంపై ప్రాథమిక విచారణ అనంతరం తగిన ఉత్తర్వులు ఇస్తామని తెలిపింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.





**సిద్ధమవుతున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే**

**ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా**

**తెలంగాణ ఫోర్త్ సిటీకి ఈ ప్రాజెక్టు అనుసంధానం**

## విజయవాడ నుంచి హైదరాబాద్
# రెండు, మూడు గంటలే

**విజయవాడ.ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** రెండు తెలంగాణా రాష్ట్రాలను అనుసంధానం చేసే అత్యంత కీలకమైన విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారి ఆధునీకంగా తీర్చిదిద్దుతున్నారు. అమరావతి- హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మిస్తున్నారు.ఆంధ్రా-తెలంగాణ అనుసంధానంలో సరికొత్త గేమ్‌ఛేంజర్ అవుతుందంటున్నారు.ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే రెండు రాష్ట్రాల రాజధానుల నడుమ రెండు నుంచి మూడు గంటల్లోనే వెళ్లే అవకాశం ఉంది. ప్రతిపాదనలే కాదు ప్రభుత్వాల ప్రముఖులు కూడా తరచూ ఈ ప్రాజెక్టు గురించి ప్రస్తావిస్తున్నారు. 2 రాష్ట్రాల ముఖ్యమంత్రులు సుముఖంగా ఉండటంతో కేంద్రం కూడా ప్రాజెక్టు నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. అందులో భాగంగానే సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనకు రోడ్లు, ఉపరితల రవాణా సత్వర చర్యలు ప్రారంభించాలని కేంద్రం ఆదేశించింది.

ఇరు రాష్ట్రాలు అమరావతి-హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాయి. తెలంగాణ సర్కారు ప్రతిష్టాత్మకంగా నిర్మించే ఫోర్త్‌సిటీకి ఈ ప్రాజెక్టులు అనుసంధానం చేయాలని భావిస్తోంది. హైదరాబాద్ శివారులో డ్రైపోర్టు నిర్మించి అక్కడి నుంచి మచిలీపట్నం పోర్టు వరకు కొత్త రైలు మార్గానికి ప్రణాళికలు చేస్తోంది. ఇదే విషయం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎపి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎపి సిఎస్, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్‌లతో చర్చలూ జరిపారు. ఇక ఈ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరిగితే ఇరు రాష్ట్రాల ప్రజలు, ప్రభుత్వాలకు లబ్ధి చేకూరనుందని రవాణారంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా హైదరాబాద్ నుంచి విజయవాడకు చేరుకోవడానికి 5 గంటలకు పైగా సమయం పడుతుంది. అలాగే, ఇరు రాష్ట్రాలకు ఎగుమతులు, దిగుమతులు సులభం అవుతాయి. కారిడార్ సమీపంలోని గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయి. రహదారి వెంబడి వాణిజ్య, వ్యాపారాలు పెరిగి ఆర్థికవృద్ధి జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఈ రహదారి అందుబాటులోకి వస్తే ఇరు రాష్ట్రాలకు ఊహించిన దానికంటే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అభివృద్ధితో పాటు ప్రాంతీయ సమైక్యత బలపడి రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలు బలోపేతం కావాడానికి ఆస్కారం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఇరు రాష్ట్రాలకు లబ్ధి చేకూర్చే అంశాలపై తెలంగాణ, ఎపి ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటోంది. అందులో భాగంగానే అమరావతిహైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం హైదరాబాద్‌విజయవాడ మధ్య 65వ నంబరు నేషనల్ హైవే ఉంది. ప్రస్తుతం >>2

## వివేకా కుమార్తె అల్లునిపై కేసులు క్వాష్ చేసిన 'సుప్రీం'

**విజయవాడ,ఆగస్టు 19,ప్రభాతవార్త ప్రతినిధి:** వివేకా హత్య కేసుపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ ఎంఎం సుందరేష్,జస్టిస్ ఎన్‌కె సింగ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. వివేకా కుమార్తె సునీతతోపాటు అల్లుడి నర్రెడ్డి రాజశేఖర రెడ్డి, అప్పటి సిబిఐ విచారణాధికారి రాంసింగ్‌పై పెట్టిన కేసులను క్వాష్ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. వివేకాకుమార్తె సునీత తరపున న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. అవినాష్ సహా ప్రధాన నిందితుల బెయిలును రద్దు చేయాలనికోరారు. సుప్రీంకోర్టుగడువువల్లే దర్యాప్తు ముగించినటుల సిబిఐ చెబుతోందని లూథ్రా వివరించారు. వివేకా హత్యకేసులో మరింత లోతుగా దర్యాప్తు అవసరం ఉందని పేర్కొన్నారు. అసలు సూత్రధారులు, పాత్రధారులు ఎవరో బయటకు రావాల్సి ఉందన్నారు. సాక్షులను బెదిరించడం, సాక్ష్యాలను నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నారని లూథ్రా కోర్టుకు వెల్లడించారు. సునీత దంపతులతో పాటు రాంసింగ్ పైనా కుట్ర పూరితంగా కేసులు నమోదు చేశారని వివరించారు. దీంతో ఆ కేసులను సుప్రీం కోర్టు >>2



మంగళవారం ప్రకాశం బ్యారేజి నుంచి భారీగా దిగువకు వదులుతున్న వరద నీరు

## ప్రకాశం బ్యారేజ్‌కి
# భారీగా వరద

**మొదటి ప్రమాద హెచ్చరిక జారీ**

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా నదికి వరద పోటెత్తుతోంది..దాంతో అధికారులు విజయవాడ ప్రకాశం బ్యారేజీవద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బ్యారేజీకి ప్రస్తుతం 3.91లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగు తోంది. మంగళవారం సాయంత్రం లేదా బుధవారం నాటికి ఇన్‌ఫ్లో 6 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉంది. బ్యారేజీ 69 గేట్లు ఎత్తి పూర్తి స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పైనుండి చేరుతోన్న వరద నీటి కారణంగా ప్రకాశం బ్యారేజ్‌వద్ద కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ప్రస్తుత ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 3.25 లక్షల >>2

# 'ఉచిత బస్సు'కు భారీ స్పందన

**• ఒక్కరోజే 18 లక్షల మంది ఉచిత ప్రయాణాలు • మహిళలకు రూ. 7 కోట్లు పైగా ఆదా**

**విజయవాడ,ఆగస్టు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకం స్త్రీశక్తికి అద్భుతమైన స్పందన కనిపిస్తోంది. రోజు రోజుకీ మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. నిన్న ఒక్క రోజులోనే 18 లక్షల మందికి పైగా మహిళలు జీరో ఫేర్ టికెట్ తో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. దీంతో వారికి రూ.7 కోట్లకు పైగా ఆదా అయ్యింది. పథకం ప్రవేశపెట్టిన నాలుగు రోజుల్లో 47 లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోగా.. దాదాపు రూ.19కోట్ల మేర వారికి ఆదా అయ్యింది.రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం అమలు తీరుపై ఆర్టీసీ ఉన్నతాధికారులతో సచివాలయంలో సిఎం సమీక్షించారు. ఘాట్ రూట్‌లలోని ఆర్టీసీ సర్వీసుల్లో స్త్రీ శక్తి పథకం అమలుకు సిఎం అంగీకారాన్ని తెలిపారు. ఈమేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్టీసీ ఉచితబస్సు ప్రయాణ పథకం కింద ప్రయాణించే మహిళల గుర్తింపు ధృవీకరణ కోసం ఆధార్ జిరాక్సుతో పాటు మొబైల్ డిజిటల్ లాకర్లోని సాఫ్ట్ కాపీని కూడా అనుమతించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మరోవైపు రోజువారీ ప్రయాణంలో తమకు ఎంతమేర ఆదా అవుతుందన్న అంశాలను మహిళలు తమతో సంతోషంగా పంచుకుంటున్నట్టు అధికారులు సిఎంకు తెలిపారు. స్త్రీశక్తి పథకం వర్తించే సర్వీసులను మహిళలు సులభంగా గుర్తించేలా బస్సులోపలా బయటా బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న స్త్రీశక్తి పథకం ప్రభుత్వానికి భారం కాదు, బాధ్యతన్నారు. ప్రజలు ఆనందించే ప్రతీ పథకాన్ని అవహేళన చేయటమే వైఎస్సార్సీ పనిగా పెట్టుకుందన్నారు. దిగ్విజయంగా అమలవుతున్న స్త్రీ శక్తి పథకాన్ని చూసి కడుపుమంటతో వైఎస్సార్సీ ఓర్వలేకపోతోందన్నారు. ఆధార్, పాన్, ఓటర్ కార్డుల లాంటివి జిరాక్సులు, సాఫ్ట్ కాపీలు కూడా అనుమతిస్తున్నామన్నారు.స్త్రీ శక్తి పథకం దిగ్విజయంగా



అమలు కావడం వైఎస్సార్సీ వారికి నచ్చడం లేదన్నారు.లక్షలాది మంది అక్క, చెల్లెమ్మలకు ఈ పథకంద్వారా నేరుగా లబ్ధి చేకూరుతుంది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలులో వైఎస్సార్సీ నాయకులు సలహాలు, సూచనలు ఇవ్వాలి కానీ, అక్కసుతో ప్రవర్తించడం పట్ల ప్రజలు తీవ్ర ఆక్షేపణ చేస్తున్నారన్నారు.

# గోదావరి-శబరికి వరదపోటు

**• నాలుగు రోజులుగా కుండ పోత • భద్రాచలం వద్ద 36.2 అడుగులు దాటిన గోదావరి • చింతూరు వద్ద 33 అడుగులు దాటిన శబరి • నీటమునిగిన ఎన్‌హెచ్ 326 ఎపి- ఒడిశా మధ్య రాకపోకలు బంద్**

**చింతూరు/కూనవరం ఆగస్టు 19 ప్రభాతవార్త :** గోదావరి-శబరి ఎగువ ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా కుంభ వృష్టి కురుస్తుంది.దాంతో మంగళవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నది నీటి మట్టం 36.2 అడుగులు దాటింది.చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 33 అడుగులు దాటడంతో ఎపి నుంచి చింతూరు మీదుగా ఒరిస్సాను కలిపే జాతీయ రహదారి ఎన్‌హెచ్ 326 చింతూరు మండలం నిమ్మలగూడెం-కుయుగూరు గ్రామాల మధ్య నీటమునిగింది. కుయుగూరు వాగుపై ఉన్న వంతెన సైతం మునిగిపోవటంతో ఇరువైపుల వందలాది భారీ వాహనాలు బారులుదీరాయి. శబరి నదికి ఉపనదులు అయిన చంద్రవంక, సోకిలేరు, చీకటివాగు, అన్నవరంవాగు, రామవరంకాలువ, అత్తకోడళ్లవాగు పొంగిప్రవహిస్తున్నాయి. చింతూరు నుంచి విఆర్ పురం మండలాన్ని కలిపే 33కిలోమీటర్ల రహదారి అనేక చోట్ల నీటిమునిగిపోయి రవాణా వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోయింది. బంగాళా ఖాతంలో వరుస వాయుగుండాల కారణంగా గోదావరి,శబరి ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు దంచికొడుతున్నాయి.ఎడతెరపి లేని వర్షాల కారణంగా జనజీవనం స్థంభించింది.నాలుగు రోజులుగా ఇండ్ల నుండి ప్రజలు బయటకువచ్చే పరిస్థితికనిపించటం లేదు.వందలాది >>2



అన్నవరం వాగు వంతెన వద్ద వరద ఉధృతి

## తీరం దాటిన వాయుగుండం

**24న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం**

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** వాయవ్య పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పాడిన వాయుగుండం తీరం దాటినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఒడిశాలోని గోపాల్‌పూర్‌కి సమీపంలో తీరం దాటినట్లు విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గడిచిన 6 గంటల్లో 7కి.మీ వేగంతో వాయుగుండం కదిలినట్లు అధికారులు పేర్కొన్నారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసేఅవకాశం ఉందన్నారు. గంటకు 35 నుంచి 45 కి.మీ >>2

20-8pg2exHMNWJQE 2nd_20-8pg2exHMNWJQE.qxd 8/20/2025 12:27 AM Page 1





మంగళవారం ఢిల్లీలో వరదలకు గురయిన ప్రాంతాలను సందర్శించిన సిఎం రేఖాగుప్తా

# సౌర కుటుంబంలో మరో అద్భుతం

## భూమికి సూర్యుడికి మధ్య పెరగనున్న దూరం

## నాలుగు రోజుల పాటు చల్లబడనున్న భూమి

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** సౌర కుటుంబంలో మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. రాబోయే నాలుగు రోజుల పాటు భూమికి సూర్యుడికి మధ్య దూరం ఒక్కసారిగా పెరిగిపోనుంది. దీని కారణంగా భూమిపై వాతావరణం చల్లబడనుందని నాసా, అంతరిక్ష శాస్త్రవేతలు చెబుతునా ్నరు. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో వాతావరణంలో మార్పులు సంభవించి చల్లగా మారుతుందని వారంటున్నారు. సౌర కుటుంబంలో నాలుగైదు రోజుల పాటు ఏర్పడనున్న ఈ మార్పులను అఫెలియన్‌గా పిలుస్తారు. సాధారణంగా భూమికి, సూర్యుడికి మధ్య దూరం తొమ్మిది కోట్ల కిలో మీటర్ల వరకు వుంటుంది. కానీ అఫెలియన్ సమయంలో ఈ దూరం 15 కోట్ల 20 లక్షల కిలోమీటర్ల దూరం వరకు పెరుగుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. భూమికి, సూర్యుడికి మధ్య దూరం 66 శాతం పెరగడంవల్ల భూమికి సూర్యుడినుంచి వచ్చే వేడి చాలా వరకు తగ్గుతుం దని వారంటున్నారు. ఈ కారణంగా భూమి చల్లబడుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. అయితే ఇదే సమయంలో అనారోగ్య సమస్యలు వున్నవారికి కొన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదం కూడా వుందని వారంటున్నారు. అస్తమా, జలుబు, గొంతునొప్పి, జ్వరం, దగ్గు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడే వారు జాగ్రత్తగా వుండాలని వారంటున్నారు. ఈ క్రమంలో విద్యుత్ వినియోగం కూడా భారీగా తగ్గే వీలుంది.

# భారత్-చైనా సరిహద్దులు ప్రశాంతం

## జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** భారత్ – చైనా దేశాల మధ్య సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయని, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అన్నారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సానుకూల దిశగా పయనిస్తున్నాయని చెప్పారు. గత ఏడాది అక్టోబర్‌లో సరిహద్దుల్లో సైనిక ప్రతిష్టంభన తొలగినప్పటి నుంచి రెండు దేశాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొందని, దీనివల్ల రెండు దేశాలూ ప్రయోజనం పొందాయని దోవల్ పేర్కొన్నారు. సరిహద్దు వివాదంపై చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో మంగళవారం అజిత్ దోవల్ భేటీ అయ్యారు. ఇద్దరూ ప్రత్యేక ప్రతినిధుల స్థాయిలో 24వ విడత చర్చలు జరిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చైనా పర్యటనకు కొన్ని రోజుల ముందు ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. చైనాలోని టియాన్జిన్‌లో ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఆ సదస్సుకు ప్రధాని మోదీ హాజరుకానున్నారని దోవల్ ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ప్రతి నిధుల స్థాయి చర్చలు చాలా కీలకమైనవని ఆయన పేర్కొన్నారు. గత తొమ్మిది నెలలుగా భారత్‌చైనా సంబంధాలు మెరుగుపడుతున్నాయని అజిత్ దోవల్ తెలిపారు. 'సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయి. శాంతి, సామరస్యం నెలకొన్నాయి. మన ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడ్డాయి. గత ఏడాది అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ భేటీ తర్వాత ఈ కొత్త వాతావరణం ఏర్పడింది. అప్పటి నుంచి ఇరు దేశాలు ఎంతో లబ్ధిపొందాయి' అని దోవల్ చెప్పారు.
చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీమాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా రెండు దేశాల సంబంధాల్లో ఎదురైన ఆటుపోట్లు ఎవరికీ మంచివి కావని అన్నారు. గత యేడాది మోడీ, జిన్‌పింగ్ భేటీ ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి సరైన దిశానిర్దేశం చేసిందని, సరిహద్దు సమస్య పరిష్కారానికి ఊతమిచ్చిందని తెలిపారు. 'సరిహద్దుల్లో ఇప్పుడు నెలకొన్న స్థిరత్వం మాకు సంతోషాన్ని కలిగిస్తోంది. ప్రధాని మోదీ మా ఆహ్వానం మేరకు ఎస్‌సిఒసదస్సు కోసం చైనాకు రానుండటాన్ని మేం ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నాం' అని పేర్కొన్నారు.కాగా 2020 ఏప్రిల్ –మే నెలల్లో లద్ధక్‌లోని వాస్తవాధీన రేఖ వద్ద మొదలైన సైనిక ప్రతిష్టంభన, ఆ తర్వాత గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల కారణంగా ఇరు దేశాల సంబంధాలు ఆరు దశాబ్దాల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. 2024 అక్టోబర్ 21న ప్రతిష్టంభనకు తెరపడటంతో ఆ తర్వాత రెండు రోజులకే మోదీజిన్‌పింగ్ కజాన్‌లో సమావేశమై సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావాలని నిర్ణయించారు.

# పేదలకు అందాలి

>> అసమానతలు తగ్గించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గివ్ బ్యాక్ అనేది మన సమాజ నినాదం కావాలని దిశానిర్దేశం చేశారు. సమాజం వల్ల పైకి వచ్చిన వారు తిరిగి సమాజానికి ఎంతో కొంత తిరిగి చేయాలని కోరారు.ఉగాది రోజు పి4 కార్యక్రమం గురించి మొదటిసారిగా చెప్పానని.. నేడు ప్రారంభించానని గుర్తుచేశారు. 13,40,600 బంగారు కుటుంబాలను ఇప్పుడు మార్గదర్శులు దత్తతు తీసుకొంటున్నారని తెలిపారు. పి4లో 15 లక్షలు కుటుంబాలను టార్గెట్‌గా పెట్టుకున్నామని... ఇది మానవతా దృక్పథంతో చేసే స్వచ్ఛంద కార్యక్రమమని ఉద్ఘాటించారు. పి4లో చేరాలని ఎవరినీ ఎలాంటి బలవంతం చేయడం లేదని... మీరు ఈ కార్యక్రమంలో పాల్గొంటే మీకు గొప్ప సంతృప్తి కలుగుతుందన్నారు.250 కుటుంబాలను తానే దత్తతు తీసుకొని వారిని స్వయంగా మానిటర్ చేస్తున్నానని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో మూడో స్థానానికి రానుంది.
ఐర్లాండ్ నుంచి వచ్చిన కార్తికేయను అంబేద్కర్ విదేశీ విద్యా దీవెన నుంచి చదివిస్తే ఇప్పుడు గుర్తుపెట్టుకుని వచ్చి భాగస్వామి అవుతామంటున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రెండు శాతం వరకూ తీసుకువచ్చారు. దేశంలో సంపద సృష్టించడం చాలా కష్టంగా ఉండేది. ఆర్థిక సంస్కరణల వల్ల సంపద సృష్టించడం సులభమైంది.మంచి రోడ్లు, విమానాశ్రయాలు, టెలికమ్యూనికేషన్‌లు బాగా పనిచేస్తున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. త్వరలోనే అమెరికా, చైనా తర్వాత భారత్ త్వరలోనే మూడో స్థానానికి చేరుతుంది. రూ. 33వేలకోట్లు పెన్షన్‌ల రూపంలో పేదలకు కూటమి ప్రభుత్వం ఇస్తుంది. పేదల సేవ పేరుతో ఇంటికే వచ్చి అధికారులు వీటిని అందిస్తున్నారు. ఆగస్టు 1వ తేదీన పెన్షన్‌లు, ఆగస్టు 4వ తేదీన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం కింద పిల్లలకు ఫీజులు ఇచ్చాం ఏడుమంది పిల్లలు ఉన్నా వారికి తల్లికి వందనం ఇచ్చాం. ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం ఆగస్టు 15వ తేదీన అమలు చేశాం.. వారికి ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చామన్నారు.ఆడపిల్లలు స్కూలుకు, వ్యాపారాలకోసం వెళ్లడం, దేవాలయాలకు వెళ్లడం, తదితర కార్యక్రమాలకు ఫ్రీ బస్సు ఉపయోగపడుతుంది. నేను ఇచ్చే పథకాలు వినియోగించగలిగితే మీ ఆదాయమే ఎక్కువగా వచ్చే పరిస్థితి ఉంటుంది ఐటీ రంగంలో భార్యభర్తలు ఉంటే వారిలో 80 శాతం మందికి భార్యలకే ఎక్కువ జీతం ఉంటుందని తేలింది. ఏపీలో జనాభా తగ్గిపోతుంది.గతంలో జనాభా పెరుగుతుందని 1995 తర్వాత చెప్పాం.. ఇప్పుడు రివర్స్ ప్రమోట్ చేస్తున్నాం. ఖర్చులు పెరగడంతో చాలామంది పిల్లలను కనడం కూడా మానేస్తున్నారు. యూరప్ , చైనా, జపాన్లు మన మీద ఆధారపడుతున్నారు... వారికి మిషన్లు ఉన్నాయి. వాటి ఆపరేషన్‌కు మనుషులు మనవద్ద నుంచి వెళ్తున్నారు.అందుకే పాపులేషన్ మేనేజ్‌మెంట్‌పై శ్రద్ధ పెట్టామని సీఎం చంద్రబాబు తెలిపారు.

# రెండు, మూడు గంటలే

>> ఉన్న రోడ్ల అభివృద్ధి, వరసల పెంపుతో ఆ ఫలితాలు ఇప్పటికే చూస్తున్నాం. వాటికి కొనసాగింపుగా ఇప్పుడు మరో మెగా ప్రాజెక్టు రానుంది. అదే అమరావతిహైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే. కేంద్ర ప్రభుత్వం కూడా దీని నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మరి, ఈ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్ట్‌కు అయ్యే ఖర్చెం? ఇది అందుబాటులోకి వస్తే ఇరురాష్ట్రాలకు కలిగే లాభాలేంటి? అనే అంశాలు తెలుసుకుందాం. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే హైదరాబాద్ నుంచి కాకుండా ఫోర్త్ సిటీ నుంచి ఉంటే బాగుంటుందని తెలంగాణ ప్రభుత్వం, ఏపీ సర్కారు తెలిపినట్లు సమాచారం. అమరావతిఫోర్త్‌సిటీని కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే వస్తే విజయవాడహైదరాబాద్ ప్రస్తుత జాతీయ రహదారికి అది సమాంతర రోడ్డు అవుతుంది. ఇప్పుడున్న జాతీయ రహదారికి అటూఇటుగా 10 కి.మీ. దూరంలో దీన్ని నిర్మిస్తే ప్రత్యేక బెల్ట్‌లా తయారు అవుతుంది. దీనిపై ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల చర్చల్లో ఎక్స్‌ప్రెస్ హైవే ఎలైన్‌మెంట్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలైన్‌మెంట్ ఇచ్చిన తర్వాత కూడా ఏవైనా మార్పులుంటే వాటినీ పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే రెండు రాష్ట్రాల సిఎంలు ఈ రహదారిపై చర్చించి ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్ విజయవాడ వరకు ఉన్న పాతరహదారితో పోల్చితే కొత్తగా రాబోతున్న గ్రీన్ ఫీల్డ్ హైవేతో సుమారు 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. పోర్టుల ద్వారానే విదేశాలకు సరకు రవాణా జరుగుతుంది. ఐతే, తెలంగాణకు సముద్రతీరం లేకపోవడంతో పోర్టులు ఏర్పాటు చేయడానికి అవకాశం లేదు. దీంతో సముద్రమార్గంద్వారా ఎగుమతులు, దిగుమతులు చేయడానికి ఏపీపై ఎక్కువ ఆధారపడుతోంది. అమరావతిహైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే అందుబాటులోకి వస్తే ఎగుమతులు, దిగుమతులకు వ్యయప్రయాసలు తగ్గనున్నాయి. ఇందుకోసం తెలంగాణప్రభుత్వం రాజధాని నగర శివారులో డ్రైపోర్టు నిర్మించాలని భావిస్తోంది. ఇందుకోసం అమరావతిహైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను మచిలీపట్నం పోర్టు వరకు పొడగించాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరినట్లు సమాచారం.

# క్వాష్ చేసిన 'సుప్రీం'

>> క్వాష్ చేసింది. సిబిఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. 'నిందితులను కాలపరిమితి లేకుండా జైలులో ఉంచడం మంచిది కాదు.కానీ...హత్య తీరు చూస్తే నిందితులకు 2,5 ఏళ్లు చాలా తక్కువే అనిపిస్తోంది. ఆధారాలు చెరిపేయడం,సాక్షాధారాలు లేకుండా చేయడం నిరూపితమైంది.
ముందు గుండెపోటు అని..తర్వాత రక్తపు వాంతులని ప్రచారం చేశారు. హత్య అని తెలియకుండా అన్ని విధాలా ప్రయత్నం చేశారు. అన్ని వివరాలు దర్యాప్తులో పూర్తిగా బయటపడ్డాయి'అని ఎస్వీ రాజు కోర్టుకు వివరించారు. ఎపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మదీ వాదనలు వినిపిస్తూ 'నిందితుడు శివశంకర్‌రెడ్డి కొడుకు చైతన్య రెడ్డి మెడికల్ క్యాంప్ పేరుతో కడప జైలుకు వెళ్లారు. ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలు ఫొటోలతో సహా ఉన్నాయి.జైలు కెళ్లి అప్రూవర్ దస్తగిరిని బెదిరించినట్లు సాక్ష్యాలున్నాయి'అని పేర్కొన్నారు. ఇక ఈ కేసులో కోర్టు మరణ శిక్ష విధించే అవకాశం కూడ ఉందని సిబిఐ తరపు న్యాయవాది పేర్కొన్నారు.



చింతూరు-విఆర్ పురం మధ్య నీటమునిగిన రహదారి

# గోదావరి-శబరికి వరదపోటు

>> గ్రామాలకు రహదారులు నీటమునగటంతో బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా పోయింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సాలో భారీ వర్షాలతో గోదావరి–శబరి నదులు ఉప్పొంగుతు న్నాయి. భద్రాచలం వద్ద మంగళవారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 36.2 అడుగులకు చేరింది. మహారాష్ట్రలో భారీవర్షాలతో గోదావరి నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.ఇప్పటికే మహారాష్ట్ర లోని బాబ్లి,జయక్వాడి ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు చేరింది. అక్కడి నుండి తెలంగాణాలోని శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి,కాళేశ్వరం ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. గోదావరి నది నీటి మట్టం భద్రాచలంవద్ద 36.2 అడుగులు దాటగా, కూనవరం వద్ద గోదావరి నది నీటి మట్టం 37 అడుగులు దాటింది. గోదావరి,శబరి నదులకు వరద ముప్పు పొంచి ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కూనవరం మండలం టేకులబోరు–కొనరాజుపేట కావేజ్ మునిగిపోయింది. అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా పోయింది.చింతూరు నుంచి చూటూరు,ముకునూరు,ఎజికొడేరు,ఉలమూరు,మల్లెతోట గ్రామాలతో పాటు వి.ఆర్.పురం మండలంలోని అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు.ఈ రెండు మండలాలను కలిపే రహదారి నీట మునిగితె వారంరోజుల క్రితం వి.ఆర్.పురం మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోఉన్న అన్నవరం వాగుపై ఉన్న తాత్కలిక వంతెన కూలిపోయింది. ఇప్పటికే వేలాది ఎకరాల్లో వేసిన పంటలు నీటమునిగాయి. ప్రస్తుతం ఉన్న వరద తగ్గు ముఖం పడుతుందా? లేదా వాయిగుండాలు,వరుస తుఫానులతో 2022 పునఃరావృతం అవుతుందా? అనే ఆందోళనతో ముంపు మండలాల ప్రజలు బిక్కు బిక్కు మంటున్నారు.

# ప్రకాశం బ్యారేజ్‌కి భారీగా వరద

>> క్యూసెక్కులుగా ఉంది. ఇది 5 లక్షల క్యూసెక్కులు వరకు చేరవచ్చని అధికారులు భావిస్తున్నారు కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చే అవకాశం ఉండడంతో.. ప్రభావిత జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కృష్ణానది పరీవాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని. లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వాగులు.. కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దు " అని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో ప్రజలను హెచ్చరించారు. వాయుగుండం ప్రభావంతో గడచిన 24 గంటల్లో.. పాడేరులో 16 సెంమీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రమంతటా ఇవాళ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు, అలాగే కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. తీరం వెంబడి ఈదురు గాలులు కొనసాగుతాయని పేర్కొంది. వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం మంగళవారం మధ్యాహ్నానికి దక్షిణ ఒడిశా వద్ద తీరం దాటనుంది. ఈ క్రమంలో.. గడిచిన 24 గంటల్లో ఎపిలో కుండపోత వానలు కురిశాయి. నిన్న రాత్రి నుంచి వానలు తగ్గుముఖం పట్టినప్పటికీ.. ఈరోజు అక్కడక్కడ భారీ వానలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది.

# జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి

>> తర్వాత అదే యేడాది డిసెంబరు 27న బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. 1995 మే 2న ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005లో గువాహటి హైకోర్టు సిజెగా పనిచేశారు. 2007–11 మధ్య సుప్రీంకోర్టు జడ్జిగాను సేవలందించిన ఆయన.. 2013 మార్చిలో గోవా తొలి లోకాయుక్తగా బాధ్యతలు స్వీకరించారు. వ్యక్తిగత కారణాలతో ఏడు నెలల్లోనే ఆ పదవికి రాజీనామా చేశారు. మరోవైపు ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్‌ను ప్రకటించిన ఎన్డీయే.. ఆ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని ప్రయత్నాలుచేసింది. ఇందులో భాగంగాకాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫోన్‌చేసి మద్దతుఇవ్వాలని కోరినట్లు సమాచారం. అంతకుముందు బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా కూడా రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. తాజాగా విపక్షాలు కూడా అభ్యర్థిని ప్రకటించడంతో రాధాకృష్ణన్, జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి మధ్య పోటీ అనివార్యమైంది.

# వరద ముంపులో ముంబయి

## భారీ వర్షాలకు 8 మంది మృతి

## 14 లక్షల ఎకరాల్లోని పంటలు ధ్వంసం



మంగళవారం ముంబయిలో కురిసిన భారీ వర్షానికి చెరువుల్లా మారిన రోడ్లు

**ముంబై, ఆగస్టు 19:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మంగళవారం కూడా భారీ వర్షం కొనసాగుతోంది. కుండపోత వర్షానికి నగరం మొత్తం స్తంభించిపోయింది. రోడ్లన్నీ నదులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా ఎనిమిది మంది మృత్యువాత పడగా, 14 లక్షల ఎకరాల్లోని పంటలు ధ్వంసమయ్యాయి. 350 మిల్లీమీటర్ల వర్షం నమోదు కాగా, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రంగంలో 350 మందిని కాపాడి సురక్షితంగా ప్రాంతాలకు తరించాయి. వర్షం కారణంగా పాఠశాలలు, కళాశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలకు కూడా సెలవు ఇచ్చారు. కొనసాగుతున్న భారీ వర్షం నేపథ్యంలో ప్రైవేటు సంస్థలు కూడా తమ ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. ఆర్థిక రాజధానిలో నిరంతరాయంగా కొనసాగుతున్న కుండపోత వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. విమాన రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ రాడార్ డేటా ప్రకారం.. దాదాపు 250 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముంబై ఎయిర్‌పోర్ట్‌నుంచి బయల్దేరే దాదాపు 155 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముంబైకి వచ్చే విమానాలు కూడా ఆలస్యం అవుతున్నాయి. దీంతో పలు ఎయిర్‌లైన్స్ తమ ప్రయాణికులకు ట్రావెల్ అడ్వైజరీలు జారీ చేశాయి. మరోవైపు రైల్వే ట్రాక్‌లపై పెద్ద ఎత్తున నీరు చేరటంతో సెంట్రల్ రైల్వే మార్గంలో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇదిలా ఉండగా.. ముంబై నగరం, శివారు ప్రాంతాల్లో ఈరోజు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖహెచ్చరించింది. ఈ మేరకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

# సిఎం కార్యక్రమాల సమన్వయకర్తగా మంతెన సత్యనారాయణ రాజు

**విజయవాడ.ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** టిడిపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్తగా నియమితులయ్యారు. ఆయనకు సహాయ మంత్రి హోదా కల్పించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని జీఏడీ, ప్రోటోకాల్ డైరెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా టిడిపిలో క్రియాశీలకంగా పని చేసిన సత్యనారాయణ రాజు 2017–2023 మధ్య కాలంలో ఎమ్మెల్సీగా పని చేశారు. పార్టీలో వివిధ పదవులు నిర్వహించారు. 2007–2013 మధ్య కాలంలో తెలుగు యువత కార్యదర్శిగా, ఆ తర్వాత 2013లో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరించి పార్టీ అధినేత చంద్రబాబు అప్పజెప్పిన పనులను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సమయంలో చంద్రబాబు నిర్వహించిన 'మీ కోసం' పాదయాత్రలో రాజు వాలంటీర్ల సమన్వయకర్తగా పని చేశారు. శాసనమండలిలో ప్రజా సమస్యలను, పార్టీ గళాన్ని గట్టిగా వినిపించారు. గత వైఎస్సార్సీ హయాంలో శాసనమండలిలో నారా లోకేశ్ నేతృత్వంలో మూడు రాజధానుల బిల్లు పాస్ కాకుండా అడ్డుకోవడంలో సత్యనారాయణ రాజు తన వంతు పాత్ర పోషించారు. అంతే కాకుండా శాసన మండలిలో నారా లోకేశ్ మీదకు నాటి అధికార పార్టీ నేతలు దూసుకొచ్చిన సమయంలో ఆయనపై దాడి జరగకుండా ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర యాదవ్‌తో కలిసి అడ్డుకున్నారు. ఇక 2022 నుంచి పార్టీ కార్యక్రమాల సమన్వయకర్తగా వ్యవహరిస్తూ వచ్చారు.

# అధికారంలోకి రాగానే సిఇసిపై చర్యలు

>> ప్రసంగాన్ని కొనసాగించారు. మరోవైపు 'ఎన్నికల కమిషనర్లు బిజెపి సభ్యత్వం తీసుకున్నారని, ఆ పార్టీ కోసం పనిచేస్తున్నారు' అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు.అంతకుముందు, ఔరంగాబాద్ జిల్లాలో ఓట్లు కోల్పోయామని చెప్పిన పౌరులతో రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. 'గత 4 5 ఎన్నికల్లో ఓటు వేసిన వారి ఓట్లను కూడా చోరీ చేశారు. ఇదేమని ఎన్నికల సిబ్బందిని ప్రశ్నిస్తే, పైనుంచి ఆదేశాలు వచ్చాయని చెబుతున్నారు. మేము పేదల హక్కుల కోసం పోరాడుతున్నాం. కచ్చితంగా ఓట్ల చోరీకి అడ్డుకట్ట వేస్తాం' అని రాహుల్ పేర్కొన్నారు. అయితే ఈ వ్యవహారంపై బీహార్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కూడా స్పందించారు. ఓట్లు కోల్పోయామని చెబుతున్న వ్యక్తులు, తమ వివరాలు అందజేయాలని, అప్పుడు వారి సమస్యను పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**నిరాధార ఆరోపణలు**

అంతకుముందు, ఎస్ఐఆర్ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఖండించారు. ఇసికి అధికార, విపక్ష పార్టీలు అనే భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తుందని స్పష్టం చేశారు. ఓటు చోరీ పేరుతో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇసి లాంటి రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదన్నారు. 'ఓట్ల చోరీ' ఆరోపణలు చేస్తున్న రాహుల్ గాంధీ వారం రోజుల్లోపు అఫిడవిట్ సమర్పించాలని కోరారు. లేనిపక్షంలో వాటిని నిరాధారమైన ఆరోపణలుగా పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**16 రోజులపాటు కొనసాగనున్న యాత్ర**

ఆగస్టు 17న ససారంలో ప్రారంభమైన 'ఓట్ అధికార్ యాత్ర' సెప్టెంబరు 1న పాట్నాలో ముగుస్తుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బిహార్‌లో ఇదే అతి పెద్ద యాత్ర. ఈ ఓట్ అధికార్ యాత్ర 24 జిల్లాలు, 60 అసెంబ్లీ స్థానాలను కవర్ చేస్తుంది. ఓటర్ల హక్కులను పరిరక్షించడం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత గురించి అవగాహన కల్పించడం ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా ఉంది. అందుకే ఈ యాత్రలో రాహుల్‌తో పాటు ఇండియా కూటమిలో భాగస్వాములైన ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్, ఇతర పార్టీల నాయకులు పాల్గొంటారు.

# తీరం దాటిన వాయుగుండం

>> వేగంతో గాలులు వీచే అవకాశమున్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. మన్యం, అల్లూరి, ఏలూరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.బుధవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు. వాయుగుండం తీరం దాటే సమ యంలో సముద్రం అలజడి దృష్ట్యా గురువారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు సూచించారు. కృష్ణపట్నం, వాడరేవు, నిజాంపట్నం, మచిలీపట్నం, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టుల్లో 3వ నంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగు తోంది. ఈ నెల 24 ఆదివారం వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 3.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజీకి 6 లక్షల క్యూసెక్కులపైగా వరద వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద చేరుతోంది. శ్రీశైలం నుంచి ఐదున్నర లక్షల క్యూసెక్కులకు పైగా దిగువకు విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో మెదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. వరద పెరుగుతున్నందున లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వాగులు, కాలువలు దాటేందుకు ప్రజలు యత్నించవద్దని చెబుతున్నారు.

**పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద వరద ప్రవాహం:**

గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం సాయంత్రానికి అడుగు మేర నీటిమట్టం పెరగడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. పోశమ్మగండి నుంచి డి.రావిలంక వరకు రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. సీతపల్లి వాగుకు వరద ప్రవాహం పెరగడంతో పోలీసులు రాకపోకలను నిషేధించారు. వర్షాలకు తోడు మధ్యలో కుంట వద్ద శబరి వచ్చి కలవడంతో గోదావరికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద పెరిగే అవకాశం ఉందని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద సోమవారం రాత్రికి నీటిమట్టం 31.15 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 6.89 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నాయి. ధవళేశ్వరం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

**పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద వరద ప్రవాహం:**

గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం సాయంత్రానికి అడుగు మేర నీటిమట్టం పెరగడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. పోశమ్మగండి నుంచి డి.రావిలంక వరకు రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. సీతపల్లి వాగుకు వరద ప్రవాహం పెరగడంతో పోలీసులు రాకపోకలను నిషేధించారు. వర్షాలకు తోడు మధ్యలో కుంట వద్ద శబరి వచ్చి కలవడంతో గోదావరికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద పెరిగే అవకాశం ఉందని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద సోమవారం రాత్రికి నీటిమట్టం 31.15 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 6.89 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నాయి. ధవళేశ్వరం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

## వారం - వర్జ్యం

20-08-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
ద్వాదశి మ.2.01
పునర్వసు రా.12.29
వర్జ్యం : ఉ.8.23-9.57
దు.ఉ.11.46-12.36
రాహుకాలం - మ.12.00-1.30

## వారఫలం

**మేషం:** కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. మొండి బాకీలు వసూలవుతాయి.

**వృషభం :** ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. బంధువుల నుండి వస్తులాభం.

**మిథునం:** నూతన వ్యక్తులు పరిచయమై చేయూతనందిస్తారు. ఆకస్మిక ధనలాభం.

**కర్కాటకం :** సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వివాహ యత్నాలుఫలిస్తాయి.

**సింహం:** ఉద్యోగంలో అనుకోని చిక్కులు ఎదురవుతాయి. ఆర్థికపరిస్థితి అనుకూలం.

**కన్య :** రాజకీయ, కళారంగాలలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. వాహన యోగం.

**తుల :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. సోదరుల కలయిక.

**వృశ్చికం:** కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఋణబాధల నుండి విముక్తిని పొందుతారు.

**ధనుస్సు:** దూరప్రాంతాలనుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. పెట్టుబడులకు అనుకూలం.

**మకరం:** భాగస్వామ్యవ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది.

**కుంభం:** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ప్రయాణాలు.

**మీనం:** కొన్ని కీలక వ్యవహారాలలో సన్నిహితుల సహాయం అందుకుంటారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

20-08Pg3 GNT aa_20-08Pg3 GNT.qxd 8/20/2025 12:31 AM Page 1



## విజయవాడలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక దాడులు

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు ఆకస్మిక దాడులను నిర్వహించారు.లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ జాయింట్ ఆపరేషన్‌తో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఈ దాడులు నిర్వహించారు.నగరంలోని గుర్తింపు పొందిన హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో కాలం చెల్లిన ఆహార పదార్థాలను అధికారులు గుర్తించారు.నిల్వ ఉంచిన మటన్.ఇతర మాంసాలను అధికారులు గుర్తించారు.ఆహార భద్రతా నియమాలను ఉల్లఘించి.నిర్దేశిత వ్యవధిని దాటినప్పటికి నిల్వ ఉంచిన ఆహార పద్దార్ధాలను శాంపిల్స్‌ను వారు సేకరించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హోటల్స్ గుర్తించారు.వాటికి నోటీసులు జారీ చేసారు.ఈ దాడులకు సంబంధించి పూర్తి వివరాలు రావాల్సి ఉంది.

## గుంతల్లోకి నీరు వస్తే అమరావతి మునిగిపోయినట్లేనా?

### : వైసిపి నాయకులపై మంత్రి నారాయణ ఆగ్రహం

**విజయవాడ.ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి మునిగిపోయిందంటూ పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తోన్న వైసీపీ నాయకులపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు...అమరావతిలో కొండవీటి వాగు నీటి ప్రవాహానికి ఆటంకం కలగడంతో వరద నీరు నిలిచిపోయిన ప్రాంతాలను మంత్రి నారాయణ పరిశీలించారు...అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీ పార్ధసారధి తో కలిసి ఆయా ప్రాంతాల్లో మంత్రి పర్యటించారు. విజయవాడ పశ్చిమ బైపాస్ పై ఈ 11 రోడ్డు వద్ద కొండవీటి వాగుపై నేషనల్ హైవేస్ అధికారులు ఓ వంతెన నిర్మించారు...ఈ వంతెన నిర్మాణ సమయంలో అక్కడ మట్టిని అలాగే వదిలేయడంతో అక్కడే కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది...దీంతో వంతెన దిగువ నుంచి నీరు వెళ్లే మార్గం లేక నీరుకొండ పరిసర ప్రాంతాల్లో పొలాల్లో వరద నీరు నిలిచిపోయింది....వాస్తవపరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన మంత్రి నారాయణ అక్కడికక్కడే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసారు...ప్రొక్లెయిన్ లు ఏర్పాటు చేసి మట్టి తొలగించడం తో పాటు జాతీయ రహదారి పై కూడా స్వల్పంగా గండి కొట్టి నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు...ఆ తర్వాత అక్కడి కొచ్చిన మీడియాతో మంత్రి నారాయణ మాట్లడుతూ వైసీపీపై తీవ్రంగా మండిపడ్డారు. అమరావతిపై ఇకనైనా మీ ఏడుపులు ఆపాలంటూ వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసారు.లేదంటే ఈసారి ఆ 11 సీట్లు కూడా ప్రజలు మీకివ్వరన్నారు...ఎక్కడైనా నిర్మాణాలు జరిగేటప్పుడు వర్షం వస్తే గుంతల్లోకి నీళ్లు రావా...?గుంతల్లోకి నీరు వస్తె ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లేనా?అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు..అమరావతిపై దుష్ప్రచారం చేస్తే ప్రజలు సహించరని అన్నారు...


అమరావతిలో కొండవీటి వాగు ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

పశ్చిమ బైపాస్ పై బ్రిడ్జి నిర్మించిన దగ్గర మట్టి అడ్డుగా ఉండటంతో నీరు నిలిచిపోయిందన్న మంత్రి...అది కూడా కేవలం రెండు గ్రామాల పరిధిలో మాత్రమే పొలాల్లో నీరు నిలిచిందన్నారు.మిగతా గ్రామాల్లో వర్షం పడిన కొన్ని గంటల్లోనే నీరు బయటికి వెళ్లిపోయిందన్నారు...ప్రస్తుతం కొండవీటి వాగు ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టిని వేగంగా తొలగించే పనులు వేగంగా జరుగుతున్నా యన్నారు మంత్రి..ఎవరెన్ని అనుకున్నా అమరావతి పనులు జరిగిపోతూనే ఉంటా యన్నారు.. వచ్చే మార్చి నాటికి అధికారులు, ఉద్యోగుల క్వార్టర్లు కూడా సిద్దం చేస్తున్నా మన్నారు... రాజధాని మునిగిపోయిందని ప్రచారం చేస్తున్న వారు వచ్చి చూడాలి.

# తిరుమల సమాచారం

## బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తుల దర్శనాలకే ప్రాధాన్యత !

### - అన్ని రకాల ప్రత్యేక దర్శనాలు, విఐపి బ్రేక్ రద్దు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగవైకుంఠం తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామికి రానున్న సెప్టెంబర్ 24నుండిమొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తుల దర్శనాలకే అధిక ప్రాధాన్యతనిచ్చేలా టిటిడి ప్రణాళికలు సిద్దం చేస్తోంది. దేవుని బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు విఐపి బ్రేక్ దర్శనాలు,వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలుతోబాటు 300 రూపాయలు ఆన్‌లైన్ దర్శనాలు, ఆర్జితసేవలు కూడా రద్దుచేశారు. తొమ్మిదిరోజులు 14 వాహనాలపై ఆలయ మాఢవీధుల్లో ఊరేగే మలయప్పస్వామి వాహనసేవలను ఉదయం 8గంటలకు ప్రారంభించి 10గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగిస్తారు. రాత్రి వాహనసేవలు 7గంటలకుమొదలవుతాయి.భక్తుల మధ్య భగవంతుని వాహనసేవలు జరగనున్నందున పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉంది. బ్రహ్మోత్సవాల్లో పూర్తిగా సర్వదర్శనం మాత్రమే అమలుచేస్తారు. భక్తుల రద్దీకి తగ్గట్లు లడ్డూలు నిల్వ ఉంచుతారు. భద్రత పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వాహనాల పార్కింగ్‌కు అసౌకర్యం కలగకుండా పోలీసులతో టిటిడి విజిలెన్స్ విభాగం సమన్వయంతో వ్యవహరించనుంది.తిరుమలలో పూర్తిగా శ్రీవారి ఆలయం, తిరుమలలోని పలు ముఖ్యకూడళ్లను సర్వాంగసుందరంగా అలంకరించే పనులు మొదలయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 24వతేదీ రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహనం, సెప్టెంబర్ 28 గరుడసేవ, 31న స్వర్ణరథం, 1వతేదీ రథోత్సవం, 2న చక్రస్నానం ముఖ్యమైన ప్రధాన ఘట్టాలు. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటుచేసి ,భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తారు.

## టిటిడిలో విఅండ్ఇ దర్యాప్తు అంతా గప్‌చుప్!

### - ధార్మికసంస్థలో విచ్చలవిడి అనుమతులపై నో యాక్షన్



**ప్రభాతవార్త ప్రతినిధి- తిరుపతి:** ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానమ్‌లో గత ఐదేళ్ళలో వైసిపి ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. ఈ విచారణ ఎంతవరకు సాగిందనేది అంతా గప్‌చుప్‌గా మారింది. ఆరునెలల క్రిందట రెండు దఫాలుగా టిటిడిలో పలు విభాగాలపై సోదాలు చేసిన విజిలెన్స్ అధికారులకు కీలక అంశాలు వెలుగు చూడటంతో ప్రకంపనలు మొదలయ్యాయి. భక్తులు తమ మొక్కుబడుల రూపంలో దేవుని హుండీకి సమర్పించుకుంటున్న నగలు,నగదు కానుకలతో భక్తుల సంక్షేమానికి ,సౌకర్యాలకు వెచ్చించాల్సిన నిధులను పక్కదారి పట్టించి భారీగా ముడుపులు దండుకున్నారనే ఆరోపణలపై విజిలెన్స్ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేపట్టింది. అప్పటికే శ్రీవాణి ట్రస్ట్ విరాళాలు, బ్రేక్ దర్శనాలు, పలు రకాల ఇంజనీరింగ్ పనులు, కీలక టెండర్లు, ప్రముఖుల సిఫార్సులేఖలపై తిరుమలేశుని విఐపి బ్రేక్ దర్శనాలు, ఆర్జితసేవలకేటాయింపు వంటి అంశాలపై దృష్టి పెట్టిన ప్రభుత్వ విజిలెన్స్ అధికారులు కొన్ని కీలక రికార్డులు, ఆధారాలను కూడా సేకరించారనేది కీలక సమాచారం. ఇదే అంశంపై తిరుపతికి చెందిన బిజెపి నాయకుడు పి.నవీన్‌కుమార్‌రెడ్డి విజిలెన్స్ఎన్‌ఫోర్స్‌మెంట్ సీనియర్ ఎస్పీ కరీముల్లాషరీఫ్‌ను కలసి ఆధారాలతో ఫిర్యాదు కూడా చేయడం అప్పట్లో సంచలనం కలిగించింది. చేశారు. ఇప్పుడు ఈ అంశం పూర్తిగా పక్కదారిపట్టిందనేది టిటిడి వర్గాల్లో చర్చమొదలైంది. నవీన్ అందించిన సమాచారంతో టిటిడిలో ఇంజనీరింగ్ పనులకు టెండర్ల ఆమోదం, నిధులు విడుదల, శ్రీవాణి ట్రస్ట్ దర్శనాలు, విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించిన అక్రమాలపై ఆధారాలతో నివేదిక సమర్పించడం విజిలెన్స్‌కు మరింత మార్గం సుగమమైందని అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. అప్పుడే తిరుమలలోని అదనపు ఇఒ కార్యాలయంలో విధులు నిర్వహించిన ఇద్దరు కీలక అధికారులను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పలు ప్రశ్నలు సంధించి ఆధారాలు సేకరించారు. ఈ ఆధారాలతో దర్శనాల అక్రమాలపై కీలక అధికారిపై కేసు నమోదు చేసే అవకాశం ఉందని చర్చ జరిగింది. 14 అంశాలకు సంబంధించి టిటిడిలో అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై కూపీ లాగింది. విజిలెన్స్ అధికారులు తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో అన్నప్రసాదం, ఇంజనీరింగ్ విభాగం, సేవాటిక్కెట్ల అక్రమాలు, నిధులు ప్రైవేటు బ్యాంకులకు మళ్లింపు,లడ్డూ తయారీకి వినియోగించే ముడిసరుకుల కొనుగోళ్ళలో అక్రమాలు, నాణ్యతా ప్రమాణాలు వంటివాటికి సంబంధించి సేకరించిన ఆధారాలతో సాక్ష్యాలను సేకరించారనేది అప్పట్లో వినిపించిన వార్తలు. మరీ ఈ దర్యాప్తు నివేదికలు ప్రభుత్వానికి చేరితే ఇంతకాలం ఎందుకు గప్‌చుప్‌గా ఉన్నారనేది టిటిడిలో ఇప్పుడు పెద్ద చర్చమొదలైంది.

## పాడనా తెలుగు పాట - కరోకే గాయనీ గాయకులకు ఆహ్వానం

### - డా.గజల్ శ్రీనివాస్

**విజయవాడ, ఆగస్టు 19, ప్రభాతవార్త ప్రతినిధి** :తెలుగు చలన చిత్ర అపూర్వ గీతాలను వెలికితీయడం, వాటిని యువతకు చేరవేయడం లక్షనంగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో, రానున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం "పాడనా తెలుగు పాట" నిర్వహిస్తున్నారు.ఆ పరిషత్ పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ ఈ విషయాన్ని తెలిపారు ఈ కార్యక్రమంలో డా. ఘంటసాల– ఎస్.పి.బాలు వేదికపై – తెలుగు పాటకు నీరాజనంగా ప్రతిభా వంతులైన కరోకే గాయనీ గాయకులకు గానం చేసే అవకాశాన్ని అందిస్తోందనీ మంచి సాహిత్యం కలిగిన రెండు తెలుగు చలన చిత్ర గీతాలను కరోకే ద్వారా ఫోన్‌లో ఆడియో రూపంలో రికార్డు చేసి ఇమెయిల్ ద్వారా పంపాలి. మీ ఎంట్రీలు 10 సెప్టెంబర్ 2025 లోపున మాకు ఈమెయిల్ ద్వారా చేరాలి. అర్హత పొందిన గాయకులను ఎంపిక చేసి, ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై గానం చేసేందుకు అధికారిక ఆహ్వానం పంపబడుతుంది. పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రం,తెలుగు మహాసభల పతకము అందజేయబడతాయి. మీ ఎంట్రీలు అమ్మపండు ఈ మెయిల్ కు పూర్తి వివరాలతో పాటు, మీ ఫోటో, రెండు కరోకే పాటల ఆడియోలు పంపాలి. తెలుగు చలన చిత్ర అపూర్వ గీతాల సౌందర్యాన్ని ఆవిష్కరించడానికి, ప్రతిభావంతులైన గాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర సారస్వత పరిషత్తు విజ్ఞప్తి చేస్తోందని పరిషత్తు కార్యదర్శి రెడ్డప్ప ధవేజి, మహాసభల సమన్వయకర్త పి.రామచంద్ర రాజు తెలిపారు.

## తిరుమలలో పెళ్లికి ఆన్‌లైన్‌లోనే బుకింగ్!

### - కల్యాణవేదికలో సకల సౌకర్యాలతో ఉచిత వివాహాలు



**తిరుమల,ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఆయన చెంత పేద,మధ్యతరగతి వర్గాల యువతీయువకులు ఉచితంగా కల్యాణాలు చేసుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణవేదిక ఉంది. పాపవినాశనమ్ మార్గంలో అత్యాధునిక సౌకర్యాలతో కల్యాణవేదికను నిర్మించి అందులో అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ఇందుకు తెలుగురాష్ట్రాలనుండేగాక దేశం నలుమూలల నుండి కూడా యువతీయువకుల కుటుంబాలు ఆన్‌లైన్‌లోనే వారివారికి ఇష్టమైన తేదీల్లో బుక్‌చేసుకునేలా అవకాశం ఉంది. తిరుమలలో టిటిడి నిర్వహిస్తున్న ఉచిత వివాహాలకు నూతన వధూవరుల నుండి విశేష స్పందన లభిస్తోంది. 2016 ఏప్రిల్ 25నుండి 2025 తాజా సమాచారం మేరకు 35వేలకుపైగా జంటలకు వివాహాలు అయ్యాయి. ఇందులో పురోహితుడు,మంగళవాయిద్యంతోబాటు పెళ్ళిసమయంలో పసుపు,కుంకుమ,కంకణంను టిటిడి ఉచితంగా అందిస్తుంది. వివాహానికి అవసరమైన సామాగ్రిని వధూవరులే తీసుకురావాల్సి ఉంటుంది. వివాహానికి వధూవరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. పెళ్ళికి రాలేని సందర్భంలో అందుకు సంబంధించి ఆధార పత్రాలను సమర్పించాలి. వివాహానంతరం పెళ్ళికుమారుడు, పెళ్లికుమార్తెబాటు ఇరువురు తల్లిదండ్రులను 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాల ద్వారా ఆరుమందికి సుపథం క్యూలైన్ ద్వారా ఉచితంగా శ్రీవారి దర్శనం కల్పిస్తారు. దర్శనానంతరం ఆరుమందికి 6ఉచిత లడ్డూలు కౌంటర్లలో అందుకోవచ్చు. తిరుమలలోని కల్యాణవేదికలో పెళ్లిచేసుకోవాలనే యువతీయువకులు ఉచిత వివాహాలు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లోనే కల్యాణవేదిక స్లాట్స్ బుక్‌చేసుకునే సదుపాయం ఉంది. 2016 మేనెల నుండి నూతన వధూవరులకు టిటిడి కల్పించింది. ఆయా ప్రాంతాల్లోని నెట్‌సెంటర్‌లలో టిటిడి హెచ్‌టిటిపిఎస్://టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ ద్వారా బుక్‌చేసుకోవాలి. కరెంట్ బుకింగ్, ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకునే జంటలు తప్పనిసరిగా హిందూ మతస్థులై ఉండాలి. వధువుకు 18 సంవత్సరాలు, వరునికి 21 సంవత్సరాలు నిండి ఉండాలి. ద్వితీయ వివాహాలు ,ప్రేమ వివాహాలు జరుపబడవు. ఇతర విరాలకు 0877-2263433నంబర్‌కు సంప్రదించాలి.

## న్యాయస్థానం నోటీసు సెలవుపై వెళ్లిన లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ హైకోర్టు అసహనం

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** కోర్టు నోటీసు తీసుకోకుండా ఉండేందుకు వారం రోజులు సెలవుపై వెళ్లిన కడప జిల్లా, లక్కిరెడ్డిపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌పై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది.

సెలవులో ఉన్నట్లు పోస్టుమెన్ చేత రాయించారని వ్యాఖ్యానించింది ఎస్ఐ చెప్పకుంటే హైకోర్టు నోటీసుపై ఒక పోస్టుమెన్ ఎలా రాస్తారని ప్రశ్నించింది. ఈసారి నోటీసుకు స్పందించకపోతే ఎస్ఐ కౌంటర్ చేసినా, చేయకపోయినా తామే విచారణ పూర్తి చేస్తామని తేల్చి చెప్పింది. విచారణను సెప్టెంబర్ 2కి వాయిదా వేస్తూ జస్టిస్ రావు రఘు నందన్‌రావు, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ డివిజన్ బెంచ్ ప్రకటించింది.

## కృష్ణా, కర్నూలు జిల్లాల్లో వీఎఎల బదలీలు రద్దు

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** నిబంధనలతో సంబంధం లేకుండా ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకే గ్రామ సచివాలయాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల (వీఏఏ)లను బదిలీ చేయడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. ఉమ్మడి కర్నూలు, కృష్ణా జిల్లాల్లో జరిగిన బదిలీలను రద్దు చేసింది. గత మే, జూన్ నెలల్లో వెలువడిన జీవోలు 23, 5లకు అనుగుణంగా తిరిగి కౌన్సెలింగ్/ బదిలీలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పై రెండు జిల్లాల్లో అత్యధికంగా ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకే బదిలీలు జరిగాయని గుర్తించింది. పారదర్శకత, వ్యక్తిగతాభిమానం, ఆశ్రిత పక్షపాతం అడుకోవాలని పేర్కొంది. సిఫార్సులను యాంత్రికంగా జిల్లా కలెక్టర్లు ఆమోదించారని తప్పుపట్టింది. రూల్స్ ప్రకారమే బదిలీలు జరిగాయన్న ప్రభుత్వ వాదనను కొట్టివేసింది. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు అనుగుణంగా బదిలీలు జరిగాయని, ఈ విషయాన్ని ప్రభుత్వం ఖండించలేదని చెప్పింది. బాధ్యత నుంచి అధికారులు తప్పుకున్నట్లు ఉన్నారని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ న్యాపతి విజరు ఇటీవల ఆదేశాలిచ్చారు. బదిలీ జరిగిన తీరును సవాలు చేస్తూ కడప, అన్నమయ్య, అనంతపురం, ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి కర్నూలు జిల్లాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులు పెద్ద సంఖ్యలో పిటిషన్లు వేశారు. ఆ రెండు జిల్లాల్లోనే 217 మంది బదిలీకి ఎంపీ, ఎమ్మెల్యేలు సిఫారసు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 115 మంది, ఉమ్మడి కృష్ణా జిల్లాలో 102 మందిని బదిలీ చేయాలని ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేశారు. ఈ రెండు జిల్లాల్లో జరిగిన బదిలీలను రద్దు చేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. మిగిలిన జిల్లాల్లో ప్రజాప్రతినిధుల సిఫార్సులు పెద్దగా లేవని, ఆ బదిలీల్లో జోక్యం చేసుకోబోమని ప్రకటించింది.

## కష్టమొస్తే గోవిందా అంటే అంతా శుభాలు

### - శ్రీవారిసేవలో క్రీడాకారిణి సైనాజైస్వాల్



**తిరుమల,ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే మనసు ఎంతో అనుభూతి కలుగుతుందని, అంతేగాక ఎవరికైనా కష్టమొస్తే,ఆపద ఉంటే గోవిందా అంటే ఆ కష్టం తీరిపోతుందని,కో.. అంటే కొండలరాయుడు పలికే దైవమని టేబుల్ టెన్నీస్ క్రీడాకారిణి సైనాజైస్వాల్ దేవునిపట్ల అత్యంత విశ్వాసం వ్యక్తం చేశారు. కొండల్లో నెలకొన్న తిరుమల క్షేత్రం తనకు ఎంతో ఇష్టమని, ఇక్కడ ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడుతుందన్నారు. భక్తులు ప్రశాంతమనస్సుతో దేవుని దర్శనం చేసుకుని మనసులో ఏది తలచుకున్నా అంతా శుభం జరుగుతుందని ఆమె అన్నారు. తనకు శ్రీవారి ఆశీస్సులతోనే అంతా మంచిజరుగుతుందని తెలిపారు. అథ్లెటిక్‌కు కూడా శిక్షణ పొందుతున్నట్లు సైనా చెప్పారు. భక్తులు కూడా దేవునిపట్ల భక్తితో విశ్వాసం కలిగి ఉండాలన్నారు. మంగళవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి తిరుమలకు వచ్చిన సైనాజైస్వాల్ ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి ఆశీస్సులందజేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కాణిపాకం బ్రహోత్సవాలకు పలువురు మంత్రులకు ఆహ్వానం


దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని బ్రహ్మోత్సవాలకు ఆహానిస్తూ ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీ, ఆలయ అధికారులు తదితరులు

**కాణిపాకం, ఆగస్టు 19 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయ ఎక సా ్వమివారి దేవస్థానంలో జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రముఖులను ఆహ్వానిస్తూ మంగళవారం దేవస్థానం తరపున ఆహ్వానపత్రికలను అందజేశారు. దేవస్థానంలో ఈనెల 27 నుండి సెప్టెంబర్ 16 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 21 రోజుల పాటు జరుగనున్నాయి. ఈమేరకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ రామచంద్రమోహన్‌లను అమరావతిలోని సచివాలయంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, కాణిపాకం ఆలయ ఏఈఓ ధనుంజయ, స్థానిక టీడీపీ నాయకులతో కలసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను అందజేశారు. అనంతరం దేవస్థానం తరపున అర్చకులు, వేపదండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, టీడీపీ ఐరాల మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, జడ్పీటీసీ సుచిత్ర, నాయకులు గిరధర్‌బాబు, నాయకులు హేమాద్రినాయుడు, నరసింహులునాయుడులతో అర్చకులు, వేదపండితులుపాల్గొన్నారు.

## ఆంజనేయపురం చెక్‌పోస్ట్ వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీలు

### పట్టుబడ్డ ఎర్రచందనం స్మగ్లర్




**రేణిగుంట ఆగస్టు 19 ప్రభాతవార్త** తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఆంజనేయపురం చెక్‌పోస్ట్ వద్ద టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ సూచనలతో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా మామండూరు వైపు నుండి రేణిగుంట వైపుకు రెండు కార్లు వేగంగా రావడాన్ని గుర్తించారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు రెండు కార్లను అడ్డుపడి ఆపారు. ఒక కారు డ్రైవర్ పారిపోగా, మరో కారు డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. వాహనాలు తనిఖీ చేయగా దాదాపు 20 ఎర్రచందనం దుంగలు దొరికాయి. పట్టుబడిన డ్రైవర్ కర్ణాటక వ్యక్తిగా గుర్తించారు. వాహనాలు తనిఖీ చేసిన వారిలో ఆర్ఐ సాయి గిరిధర్, ఆర్ఎస్సైఐ వినోద్ కుమార్ బృందం ఉన్నారు. పట్టుబడిన వ్యక్తిని, ఎర్రచందనం దుంగలను, కార్లను తిరుపతి టాస్క్ ఫోర్స్ స్టేషన్ కు తీసుకెళ్లారు.

## సంక్షేమపథకాల అమలులో సిఎం రేవంత్‌రెడ్డికి శక్తినివ్వమని వేడుకున్నా

### - పుట్టినరోజున శ్రీవారి దర్శనంతో ఆనందం - తెలంగాణమంత్రి కొండా సురేఖ



**తిరుమల,ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్‌పాలనలో పేదప్రజల కుటుంబాల్లో ఆనందం చూడాలనేది ఆశయమని, అందుకనుగుణంగా సిఎం రేవంత్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని తెలంగాణమంత్రి కొండా సురేఖ తెలిపారు. సంక్షేమపథకాలు అమలులో ,మరిన్ని మంచి పనులు చేసేందుకు అవసరమైన శక్తిని రేవంత్‌రెడ్డికి ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నట్లు చెప్పారు. పుట్టినరోజు సందర్భంగా కుటుంబసభ్యులతో కలసి ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణా సస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలంతా సంతోషంగా జీవనం సాగించేలా చూడాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆమె కుటుంబసభ్యులతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి ఆమెకు దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆదరణ 3లో మత్స్యకారులకు ప్రాధాన్యం

### :బిసి సంక్షేమ మంత్రి సవిత

**విజయవాడ.ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మత్స్యకారులను అన్ని విధాలా అభివృద్ధే చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మత్స్యకారులకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. ఆదరణ 3.0 పథకం అమలులో కూడా మత్స్యకారులకు ప్రాధాన్యమిస్తామని, ఆధునిక పరికరాలు అందజేస్తామని వెల్లడించారు. మంత్రి సవితను తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఛైర్మన్ గా అవకాశమిచ్చినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి సవితకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, మత్స్యకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చుతున్నారన్నారు. ఇప్పటికే వేట విరామ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి అందజేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు రూ.10వేల చొప్పున అందజేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ కూటమి ప్రభుత్వం రూ.20 వేలు అందజేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.29 లక్షలకు పైగా మత్స్యకారులకు రూ.259 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 217 ను రద్దు చేసిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదేనన్నారు. చేపల వేట నిషేధకాలంలో మత్స్యకారులకు భృతి ఇవ్వాలని నిర్ణయించిన ఘనత కూడా సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే ఫించన్లు అందజేసిన ఘనత కూడా టీడీపీదేనన్నారు. 2014లో తొలిసారిగా వేట నిషేధ సమయంలో భృతి అందజేశారన్నారు.


మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజుతో మాట్లాడుతున్న మంత్రి సవిత

## ఆగస్టు 31న సండేస్ ఆన్ సైకిల్ పేరుతో ర్యాలీలు

### - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**విజయువాడ ఆగస్టు,19,ప్రభాతవారప్రతినిధి:** ఆగస్టు 29 నుండి 31 వరకు దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవం–2025ను నిర్వహించేందుకు క్రీడాశాఖ విస్తృత ప్రణాళికలు రూపొందించింది.ఈ సందర్భంగా కేంద్ర క్రీడాశాఖ మంత్రి మనసుఖ్ మాండవీయ అధ్యక్ష తన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించబడింది. ఈ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సచివాలయ ఛాంబర్ నుండి పాల్గొన్నారు.

## ఇరుముడితో శబరిమలైకి మాజీమంత్రి పెద్దిరెడ్డి

**తిరుపతి,ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:** మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన అనుచరులతో కలసి అయ్యప్పదీక్షలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం ఇరుముడులతో శబరిమలైకు బయలుదేరి వెళ్ళారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోబాటు ఆయన సోదరుడు తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పలువురు వైసిపి నాయకులు బయలుదేరారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నిట్ నెం.09/2025-26, తేది: 18.08.2025
కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, గుంటూరు వారి కార్యాలయ పరిధిలో పెదకాకాని మండలంలో మండల ప్రజాపరిషద్ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా ఒక పనికిగాను అంచనా విలువ రూ.10.00 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరడమైనది. టెండరు డాక్యుమెంట్లను ఇ-సైటు నందు తేది: 21.08.2025 నుండి www.apeprocurement.gov.in లో చూడగలరు.
సం/-. కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, గుంటూరు.
DIPR.NO. 17295/CL/ADVT/1/1/2022-23 తేది: 19.08.2025


అందరికీ మంచిగా ఉండాలనుకోవడం
అవకాశవాదమే తప్ప ఆచరణీయం కాదు.

-రామకృష్ణ పరమహంస

# సయోధ్య కుదిరేనా?

రష్యా ఉక్రెయిన్ యుద్ధం ఆగాలంటే పుతిన్ మడతపేచీ పెడ్తున్నాడని నిన్న మొన్నటివరకు అన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పుతిన్‌తోభేటీ అయ్యాక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ దిగిరాక తప్పదని హెచ్చరిస్తున్నారు. ట్రంప్‌యూటర్న్ తీసుకున్నట్లుంది. అంతకుముందు 'పుతిన్ తన మాట వినడం లేదని అక్కసు కొద్దీ జెలెన్‌స్కీని ఉదరగొట్టి పుతిన్ మీద యుద్ధానికి ఆయుధాలు సమకూరిస్తే యుద్ధానికి వెళ్లగలవా? అనే ధోరణిలో మాట్లాడారు. అప్పుడు రెచ్చగొట్టి ఇప్పుడు సముదాయించే మాటలు మాట్లాడడం ట్రంప్‌కే చెల్లింది. ఆయన చేష్టలకు అర్థాలుండవు. కానీ ఆయన ఎప్పుడూ ఒక మాట మీద నిలబడే మనిషి కాదన్నది అర్థమవుతుంది. అలస్కాలో ట్రంప్, పుతిన్‌ల మధ్య భేటీ శాంతి ఒప్పందాలపై ఎలాంటి కీలక నిర్ణయాలు లేకుండానే ముగిసింది. ఉక్రెయిన్, రష్యాలు నేరుగా శాంతి ఒప్పందం చేసుకోవడమే యుద్ధాన్ని ముగించేందుకు మేలైన మార్గాలని తన సొంత 'ట్రూత్' సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు సారాంశం. ఒకరినొకరు స్తుతించుకునే వ్యాఖ్యానాలు ఈ భేటీ ప్రధాన ఆకర్షణ. 2022లో అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ ఉంటే ఉక్రెయిన్ యుద్ధమే జరిగి ఉండేదికాదని పుతిన్ ట్రంప్‌ను కీర్తించారు. వారిద్దరి తాజా భేటీ ఉక్రెయిన్, రష్యా యుద్ధానికి తెరపడుతుందని, ఆశించిన ఉక్రెయిన్ ప్రజలకు రాజకీయనేతలకు నిరుత్సాహమే మిగిలింది. రష్యా విషయంలో ట్రంప్ జోక్యానికి ఏమాత్రం అవకాశమివ్వని పుతిన్ చాణక్యం బాగా బోధపడింది. కాగా మరోసారి చర్చలకు అవకాశముందని పుతిన్ ప్రకటన ఆశాజనకంగానే ఉంది. దీనిని బట్టి ఉక్రెయిన్, రష్యాలు ఏదో ఓ రోజు శాంతి ఒప్పందానికి సిద్ధమవుతాయని అనుకోవచ్చు. రష్యా ఆక్రమించుకున్న తమ భూభాగాల నుంచి వైదొలగాలని అనడంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎంతో తెలివిగా చాకచక్యంగా చూసారు. రష్యా 12ఏళ్ల నాడు క్రిమియాను ఉక్రెయిన్ నుంచి స్వాధీనం చేసుకుందన్న విషయం అందరికీ తెలిసిందే. ఇదో జీడిపాకం వ్యవహారం. అయితే తాజాగా జెలెన్‌స్కీతో ట్రంప్‌ను కలిసివెళ్లాకఅన్ని అభయాలూ ఇచ్చి కూడా క్రిమియా గురించి నోరెత్తరాదని సూచించినట్లు తెలిసింది. ఇలాంటి అంశాల్లో జెలెన్‌స్కీ వైపు నుంచి సకారాత్మక అంగీకార ధోరణి ప్రకటిస్తేనే ముందుకు కదిలే అవకాశం ఉండొచ్చు. ఉక్రెయిన్ తన డిమాండ్లను వదులుకోవల్సిందేనని హితవు చెప్పిన ట్రంప్ రష్యా ఉక్రెయిన్‌ను అడుగుతున్న మరికొన్ని భూభాగాల విషయంలో ఎలా వ్యవహరించాలో ప్రస్తావించలేదు. మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న యుద్ధానికి రేపోమాపో ముగింపు పలికే సమయం ఆసన్నమైందనే భావన అందరిలోనూ ఉంది. కానీ ఫలితం నిష్క్రియ. గతంలో ఫిబ్రవరిలో ట్రంప్, జెలెన్‌స్కీల భేటీలో వాగ్వాదం తప్ప జెలెన్‌స్కీ వద్దట్రంప్ ప్రతిపాదనలేవీ చెల్లలేదు. తర్వాత ఇన్నాళ్లకు భేటీ జరిగింది. గత భేటీలో ట్రంప్,జెలెన్‌స్కీ మధ్య పొత్తు పొసగకపోవడంతో ఈసారి ఐరోపా దేశాల అగ్రనేతలు కూడా భాగస్వాములైనారు. అయితే ఉక్రెయిన్‌కు అమెరికా దళాలు, ఐరోపా దేశాలు బాసటగా వెన్నంటి ఉంటాయని ముక్తకంఠంతో జెలెన్‌స్కీకి భరోసా ఇచ్చారు. ఆఇరుదేశాల మధ్య శాంతి కోసం తమవంతు సాయం ఉంటుందని సంకేతాలు ఇచ్చారు. బలమైన సైన్యం ఆయుధాలు, శిక్షణ, నిఘా వ్యవస్థలు, తనకు తోడుగా నిలిస్తే చాలునని జెలెన్‌స్కీ సంతోషించాలి. ఇన్ని ప్రయోజనాలు జరుగుతున్నా పుతిన్ కేవలం కాల్పుల విరమణకు సిద్ధంగా లేరు. ఈ భేటీ జరుగుతున్న సమయంలోనే ఉక్రెయిన్‌పై రష్యా దాడులు జరిపి ఏడుగురిని పొట్టనపెట్టుకొంది. దానినే ఆసరాగా చేసుకొని ఉక్రెయిన్ అధ్యక్షుడు రష్యా దుశ్చర్యలను ట్రంప్ తదితర నేతల దృష్టికి తెచ్చారు. ఈ ఇరు దేశాల మధ్య శాంతి కోసం ఎన్నోదేశాల అధ్యక్షులు హాజరవడం అరుదైన విషయం. ట్రంప్‌తో భేటీ జరిగాకరష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం భారత ప్రధాని మోడీతో ఫోన్‌లో మాట్లాడారు. దౌత్యం, శాంతి మార్గాల ద్వారా దేశాల శ్రేయస్సు కోసం ఒప్పందాలు చేసుకోవాలని పుతిన్‌కు మోడీ సూచించారు. ఎన్ని భరోసాలున్నా, ఎన్ని ప్రతిపాదనలున్నా పూచిక పుల్లంత భూభాగాన్ని కూడా వదులుకునేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సిద్ధంగా లేరు. అయినా తాను ట్రంప్‌తో కలిసి పుతిన్‌తో త్రైపాక్షిక సమావేశం ద్వారానే యుద్ధ శాంతి జరుగగలదని జెలెన్‌స్కీ ఆశాభావం వ్యక్తం చేయడం కొసమెరుపు. భేటీ సవ్యంగా జరిగితే యుద్ధాన్ని ముగించేందుకు సహేతుకమైన అవకాశాలుంటాయని ట్రంప్ ఆశాభావం. పుతిన్‌కు కూడా దౌత్య, శాంతి మార్గాల ద్వారా శాంతి ఒప్పందాలు చేసుకోవడం మేలని భారత ప్రధాని నరేంద్రమోడీ హితబోధలు పనిచేయగలవు. వారి భేటీ సుగమం కావాలి. మూడున్నరేళ్లుగా యుద్ధంలో మునిగిన రష్యా ఉక్రెయిన్‌ల మధ్య శాంతి సమకూరాలని ఆకాంక్షలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. యుద్ధకాంక్ష ఉన్న చోట శాంతికి ఎన్ని దారులున్నా వారి ఆకాంక్షలు తీరే వరకు యుద్ధం ఆపేందుకు ఏఅవకాశాలు సానుకూలంగా కనిపించవన్నసూత్రం రష్యా, ఉక్రెయిన్‌ల యుద్ధానికి వర్తిస్తుంది. ఉక్రెయిన్‌కు నాటో కూటమి తరహాలో అమెరికా ఐరోపా దేశాలు రక్షణ భరోసా ఇచ్చినా తనకేమీ అభ్యంతరం లేదంటూ పుతిన్ ఫ్రీ హ్యాండ్ ఇవ్వడమే అమెరికా ఐరోపా సమాఖ్య చేయజూస్తున్న సయోధ్యకు మార్గమయ్యేందుకు కీలకం కానుంది. నాటోలో ఉక్రెయిన్ చేరకూడదన్న షరతును పుతిన్‌దాదాపు వదులుకున్నందున రష్యా,ఉక్రెయిన్‌లమధ్య శాంతి కుదిరేందుకు ఏ ఇతర అభ్యంతరాలు అడ్డుకావు.

మన ప్రవర్తనలో ముందుగా మార్పువస్తే, సహజంగానే ప్రపంచంలోనూ మార్పు వస్తుంది.



షేక్ స్పియర్

మిత భోజనం వల్ల ఆరోగ్యం, ఆయుష్షు, బలం, సుఖం, మంచితనం అనే ఆరు గుణాలు లభిస్తాయి.



అరిస్టాటిల్

# ప్రజావాక్కు



## నీతి లేని చదువు జీతాల చేటు

రక్తి లేని యాట రాత్రి నిద్దుర చేటు, భక్తి లేని పూజ పత్రి చేటు, నీతిలేని చదువు జీతాల చేటురా అని తెలుగుబాల శతకంలో కరుణశ్రీ చెప్పినట్లు నీతి లేని చదువులే ఎక్కువౌతున్నాయి. సార్వత్రిక విద్యలు, ఒకే సంవత్సరంలో రెండు సంవత్సరాల ఇంటర్, ఒకే ఏడాదిలో మూడు సంవత్సరాల డిగ్రీ,రెండు సంవత్సరాల పి.జి.కోర్స్ చదవకుండానే సర్టిఫికేట్,డబ్బులకుడాక్టరేట్ పట్టాలతో? ప్రమోషన్ల కోసంపరపతిని, ధనాన్ని వినియోగించి మీది మీదికి ఉన్నతోద్యోగులుగా కీలకమైన స్థానాల్లో స్థిరపడి, మాతృ సంస్థలకు చేయవలసిన పనుల నైపుణ్యం కొరవడి, దానిని కప్పిపుచ్చుకోవడానికి, వారి ఉన్నతోద్యోగ ఆధిక్యాన్ని ప్రదర్శించుకోవడానికి సంస్థలోని ఇతర నిజాయితీగా పని చేసిన ఉద్యోగుల చెడ్డచేస్తూ గొప్పవారిగా చెలామణీ అవుతుంటారు. వీరు వచ్చిన మార్గం అక్రమం కావున ఫ్రాడ్ పాలకులుగా మారుతారు.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

## మోసపోతున్న భక్తులు

ప్రపంచంలో అతి పెద్ద వైభవ ప్రాచుర్యం కల్గిన దేవుడు తిరుపతి నారాయణుడు. దాని పరిపాలన పరిధి కూడా అంతే.ధనంతో ప్రమేయం లేకుండా ఏ ఏర్పాట్లు అయినా సులువుగా చేయొచ్చు. గానీ భక్తులదర్శనానికి దేవస్థానం వసతిగానీ ప్రత్యేకదర్శన టిక్కెట్లు గానీఆన్లైన్‌లో భక్తులకు మోసగించి నకిలీ ఫేస్బుక్ లేక ఇంటర్నెట్‌లో చదువుకున్న వారినిసైతందగా చేస్తున్నారు.ఇక్కడ భక్తుల అతితొందర, అజ్ఞానం ఉండొచ్చు.గానీ వారికి ఆవెబ్సైట్లు, వగైరా ఎలా పొందుచున్నారు ఆశ్చర్యం తప్పదు.ఎన్ని సూచనలు ఇచ్చినా, దేవస్థానం నిఘా వ్యవస్థ తగిన చర్యలు చేయాలి. ఏ సడలింపు లేకుండా వారి ఆగడాలను అరికట్టాలి.

- బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

## విపత్తులను ముందే గుర్తించాలి

ప్రపంచంలో వచ్చేసమస్యలను విపత్తులనుగుర్తించి ప్రభుత్వాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటేఆస్తి, ప్రాణనష్టాలు జరిగే అవకాశంఉంది.ముఖ్యంగా తుఫానులు, భూకంపాలు, సునామీలు,ప్రకృతి ప్రళయాలు, కాలుష్యం,కార్చిచ్చులు,లావాలు,తదితర విపత్తులనుండి బయటపడేందుకు ప్రజలను అప్రమత్తం చేయాలి.ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకోవాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

## సమస్యకు పరిష్కారం చూపాలి

ఆగస్టు 15వ తారీకున ట్రంప్‌కు పుతిన్‌కు మధ్య అమెరికాలోని అలాస్కా రాష్ట్రంలో ఉక్రెయిన్ రష్యాల మధ్య యుద్ధ పరిసమాప్తికోసం జరిగినచర్చలు ఫలప్రదమయ్యాయని ఇద్దరు మహానేతలు చెప్పుకున్నారు. కాని యుద్ధం ఆపడానికి రష్యా అధినేత పూర్తిగా సమ్మతించినట్టు లేదు. ఉక్రెయిన్ అధినేత జలెన్ స్కీ లేకుండాసంధి ఏలాసాధ్యం? యుద్ధాలు చేసుకుంటున్న దేశాలు స్వయంగా ఒప్పందాలు చేసుకుంటేనే కదా సమస్యలు సమసిపోయేది.ఉక్రెయిన్‌లోఆపారంగా లభించే భూగర్భసంపద అమెరికాకు కావాలి. అందుకోసం యుద్ధం ఆపాలి. ఈ యుద్ధంలో ఇరు దేశాలకు చెందిన వేలాది మంది సైనికులు, అమాయక పౌరులు ప్రాణాలు పోతున్నాయి. ఆస్తులు, ఆయుధాలు, ఆర్థిక వ్యవస్థ నాశనమోతున్నాయి. జలెన్ స్కీ కోరుతున్నట్లు భారత ప్రధాని నరేంద్ర మోడీ కూడా చర్చల్లో పాల్గొంటేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందేమోననిపిస్తోంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## సవాలు విసురుతున్న ప్రకృతి విపత్తు

మేఘ విస్ఫోటనం అనేది వాతావరణశాస్త్రంలో అత్యంత విధ్వంసకరమైన ప్రకృతి విలయ ఘటనల్లో ఒకటి. ఇది తక్కువ కాలవ్యవధిలో, స్వల్పవిస్తీర్ణంలో అసాధారణ వర్షపాతం కురిసే పరిస్థితి. శాస్త్రీయంగా,1015చ.కి.మీ.పరిధిలో గంట వ్యవధిలో 10 సెం.మీ. కంటే ఎక్కువ వర్షం పడితే దానిని మేఘ విస్ఫోటనంగా నిర్వచిస్తారు. సాధారణ వర్షం క్రమంగా కురుస్తుంది. అయితే మేఘ విస్ఫోటనంలో నీరు ఒక్కసారిగా కురవడం వల్ల నాశనం విపరీతమవుతుంది. పర్వత ప్రాంతాలు, లోయలు, పర్యావరణ సున్నిత భూభాగాల్లో ఇవిఎక్కువగా చోటుచేసుకునే ప్రాంతాలు. ఒరోగ్రాఫిక్ లిఫ్టింగ్, కాన్వెక్టివ్ అస్థిరత్వం, మాన్సూన్ ప్రభావం, గ్లోబల్ వార్మింగ్, వాతావరణ సంఘర్షణ వంటి కారకాలు దీనికి ప్రాథమిక శక్తులుగా నిలుస్తాయి.

- వెంకట రమణ గిలకత్తుల, హైదరాబాద్

## ఓట్ల చోరీ

నిత్య జీవితంలో ప్రజాస్వామికరణ ప్రజాస్వామ్యం అనే మాటను విరివిగా వాడుతుంటాము. ఆ ప్రజాస్వామికరణ నిలబడడానికి పౌరులకు అధికారణ 324 ద్వారా రాజ్యాంగ రూపకర్తలు ఇచ్చారుకదా. మరి ఎందుకు పౌరులు బ్రతికుండగానే చంపివేస్తున్నారు అనేది ఒక అంశం. ఇకపోతే కర్ణాటకలోని ఒక నియోజక వర్గంలోనే ఒక లక్ష ఓట్ల దాకా ఓట్ల చోరీ జరిగింది.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

**చట్టంలో ఉన్న లొసుగులు, లోపాలు, మినహా యింపులతో పార్టీలు మారుతున్న శాసనసభ్యులు తప్పించు కోగలుగుతున్నారు కానీ నైతికత ఒకటి ఉంటుంది ఆ నైతిక ప్రమాణాలను పాటిస్తే ఒక పార్టీ బీఫామ్‌పై గెలిచి మరొక పార్టీలోకి ఫిరాయించిన శాసనసభ్యుడు రాజీనామా చేయాలి. అలాగే సభాపతులు కేవలం చట్టం ప్రమాణికంగానే కాకుం డా కళ్లముందే పార్టీ మారిన వాస్తవాలు కనపడుతున్నాయి కాబట్టి పార్టీ మారిన శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలి. పార్టీలో నాయకులు సిద్ధాంతాల ప్రతిపదికను కాకుం డా అవకాశాలు అధికారం ప్రాతిపదికన పనిచేస్తున్నంతకాలం వలసలు ఫిరాయింపులు కొనసాగుతూనే ఉంటాయి. ఎలాంటి మినహాయింపులు లేకుండా పిరాయింపుల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేసినప్పుడే ఫిరాయింపులను నిరోధిం చగలుగుతారు. ప్రజాస్వామిక విలువలను కాపాడటానికి పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం మరింత పదును తేలాల్సిన అవసరం ఉంది.**



డాక్టర్ తిరునహరి శేషు

తెలంగాణ రాష్ట్రంలో 2023 శాసనసభ ఎన్నికల తరువాత పార్టీ మారిన 10మంది శాసన సభ్యుల అనర్హత పిటిషన్‌లపైమూడు నెలల లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచనల నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులు, ఫిరాయింపుదారులపై అనర్హత వేటు మరొక మారు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిపోయింది.ఒకనాడు సిద్ధాంతాలు, భావజాల ప్రాతిపదికన పార్టీలు నాయకులు రాజకీయాలు చేస్తే నేడు మాత్రం అధికారం, అవకాశాల కోసమే నాయకులు రాజకీయాలుచేస్తున్నట్లుగా కనిపిస్తుంది. రాత్రికి రాత్రే కండువాలు మారుస్తూ పార్టీలు ఫిరాయిస్తున్న నాయకులతో రాజకీయ విలువలు మరింత దిగజారిపోతున్నాయి.ఒకనాడు హర్యానా, పంజాబ్ ఈశాన్య రాష్ట్రాలకి పరిమితమైన ఆయారాం, గయారామ్‌ల సంస్కృతి నేడు దేశవ్యాప్తంగా ఫిరాయింపు రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయి. రాష్ట్ర విభజన తరువాతతెలుగు రాష్ట్రాలలో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం అవకాశవాద అధికారదాహ రాజకీయాలకు ఫిరాయింపులకి కేంద్రంగా మారిపోయిందనే చెప్పాలి. 2014 తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల తరువాత కాంగ్రెస్, తెలుగుదేశం, బహుజన సమాజ్ పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, సిపిఐ పార్టీలకు చెందిన 29 మంది శాసనసభ్యులు పార్టీ మారితే 2018 శాసనసభ ఎన్నికల తరువాత కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకి చెందిన 14 మంది శాసనసభ్యులు అలాగే 2023 శాసనసభ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీకి చెందిన పది మంది శాసన సభ్యులు అంటే మొత్తం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయిన తర్వాత 53 మంది శాసనసభ్యులు పార్టీ ఫిరాయింపులకు పాల్పడినారు. కానీ విచిత్రం ఏంటంటే ఇప్పటివరకు పార్టీ ఫిరాయించిన ఏ ఒక్క శాసనసభ్యుడు పై అనర్హత వేటు పడలేదు. ఈ దశాబ్ద కాలంలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన పార్టీ ఫిరాయింపులు రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేయనే చెప్పాలి. నాటి అధికార బిఆర్ఎస్ నేటి అధికార కాంగ్రెస్ పార్టీలు రెండూ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాయనే అపఖ్యాతిని మూటగట్టుకున్నాయి. నాటి ప్రభుత్వంలో కీలకమైన ఉపముఖ్యమంత్రిగా వ్యవహరించిన వ్యక్తి పార్టీ ఫిరాయించటం నాటి శాసనసభ స్పీకర్ నేటి పార్టీ ఫిరాయింపుదారుడుగా ఉండటం కూడా తెలంగాణ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులు పరాకాష్టకు చేరాయనే భావన వ్యక్తం అవుతుంది. వివాదాస్పదమవుతున్న స్పీకర్లు చట్టపరంగా పార్టీ ఫిరాయించిన శాసనసభ్యులపై చర్యలు తీసుకునే విషయంలో స్పీకర్లు కాలయాపన చేస్తున్నారనే అభిప్రాయాలు కలుగుతున్నాయి. అనేక రాష్ట్రాలలో స్పీకర్లు వ్యవహరిస్తున్న తీరు పై వాదానికి బలం చేకూర్చుతుంది. నిర్ణయాలు తీసుకోవటంలో స్పీకర్లు ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధానాన్ని అనుసరిస్తున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి.2023లో హిమాచల్‌ప్రదేశ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ నుండి ఆరుగురు శాసనసభ్యులు బిజెపిలోకి ఫిరాయిస్తే ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారంగా పార్టీఫిరాయించిన ఆరుగురు శాసనసభ్యులను అర్హులుగా ప్రకటించారు. కానీ అదే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నుండి అధికార కాంగ్రెస్ పార్టీలోకి 10 మంది శాసన సభ్యులు ఫిరాయిస్తే ఇప్పటివరకు వారిపై చర్యలు తీసుకోకపోవడం వివాదాస్పదమవుతున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 శాసనసభ ఎన్నికల తరువాత టిఆర్ఎస్ పార్టీకి చెందిన పదిమంది శాసనసభ్యులు నాటి అధికార కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయిస్తే అనర్హత వేటు వేయకుండా తీవ్ర



జాప్యం చేసి శాసనసభ కాల పరిమితి ముగియటానికి కొద్ది నెలల ముందు పార్టీఫిరాయించిన వారిపై వేటువేసిన ఉదంతంతో పాటు ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో కూడా పార్టీ ఫిరాయించిన ఎనిమిది మంది శాసనసభ్యులపై కూడా అదే విధంగా వేటు వేసినారు. అనేక రాష్ట్రాలలో శాసనసభ స్పీకర్లు చట్ట నిబంధనల మేరకు ఫిరాయించిన శాసనసభ్యులపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలతో పాటు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. చట్టం వచ్చినా ఆగని ఫిరాయింపులు పార్టీ ఫిరాయింపులకి అడ్డుకట్ట వేయాలనే తలంపుతో 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం చేసి పదో షెడ్యూల్‌లో చేర్చినారు. ప్రారంభంలో చట్టం బలంగా పని చేసిందని చెప్పాలి. చట్టాన్ని మరింత బలోపేతం చేయటం కోసం 2003లో 91 వ రాజ్యాంగ సవరణ ద్వారా పదో షెడ్యూల్‌కి సవరణలు చేశారు కానీ చట్టంలో ఉన్న మినహాయింపులను అడ్డంపెట్టుకొని ఫిరాయింపులను కొనసాగిస్తూనే ఉన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం వచ్చినతర్వాత ఫిరాయింపులు వ్యక్తిగత ఫిరాయింపుల స్థాయినుండి సామూహిక ఫిరాయింపుల స్థాయికి దారితీసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సభ్యుని ఫిరాయింపుపై నిర్ణయం తీసుకునే అధికారం కేవలం సభాపతి స్పీకర్‌కి ఇవ్వటం ప్రధాన లోపంగా కనిపిస్తుంది. 2/3 వ వంతు సభ్యులు పార్టీ మారినప్పుడు చట్టంవర్తించకుండా మినహాయించటం కూడా సామూహిక ఫిరాయింపులను ప్రోత్సహించే నిబంధనగా మారిపోయింది. చట్టం వచ్చిన తర్వాత ఫిరాయింపులు ఆగలేదు కానీ ఫిరాయింపులరూపం మారిందనే చెప్పాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన ఈదశాబ్ద కాలంలో పార్టీలు ఫిరాయించిన ఏ ఒక్క శాసనసభ్యుడి పైనైనా వేటుపడిన దాఖలాలు లేవు. గతంలో పార్టీ మారిన శాసనసభ్యులు ఫిరాయింపుల నిరోధక చట్టానికి దొరకకుండా ముక్కుమడిగా పార్టీలు మారి అనర్హత వేటు నుండి తప్పించుకున్నారు. గత రెండు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ లెజిస్లేటివ్ పార్టీ బిఆర్ఎస్‌లో విలీనం కావడంతో ఫిరాయింపుల నిరోధక చట్ట పరిధిలోకి రాకుండా అనర్హత వేటునుండి తప్పించుకున్నారు కానీ ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీ నుండి ఫిరాయించిన పదిమంది శాసనసభ్యులు ఫిరాయింపుల నిరోధక చట్ట పరిధిలోకి వస్తారు. 2023శాసనసభ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ నుండి 39 మంది శాసనసభ్యులు విజయం సాధించారు. చట్టం ప్రకారంగా బిఆర్ఎస్ పార్టీ నుండి 26 మంది శాసనసభ్యులు పార్టీ ఫిరాయిస్తేనే వేటుపడకుండా తప్పించుకోగలుగుతారు కానీ పదిమంది శాసనసభ్యులుపార్టీ మారటం వలన వారిపై చట్ట ప్రకారంగా వేటుపడాలి. కానీ నిర్ణయాలు తీసుకునే అధికారం సభాపతిగా స్పీకర్‌కి ఉండటం వలన పార్టీ మారిన శాసనసభ్యులు ఇంతకాలం వేటు నుండి తప్పించుకోగలిగారు. పార్టీ మారిన పదిమంది శాసన సభ్యుల పైన వేటువేయాలని బిఆర్ఎస్ పార్టీ చట్టసభలను న్యాయస్థానాలలో పోరాటం చేస్తుంది. రాజ్యాంగం ప్రకారంగా కోర్టులకి ఉన్న పరిధి దృష్ట్యా స్పీకర్ తీసుకునే నిర్ణయాలలో కోర్టులు జోక్యం చేసుకోలేవు కాబట్టి సుప్రీంకోర్టు తెలంగాణ శాసనసభ స్పీకర్‌కి పార్టీ ఫిరాయించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది శాసనసభ్యులపైమూడు నెలల లోపు నిర్ణయం తీసుకోవాలని ఒక సూచన మాత్రమే చేసినది. కాబట్టి ఆ పది మంది శాసనసభ్యుల వివరణ మరొకసారి స్పీకర్ కోరి ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. పార్టీ మారిన శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించే అధికారం చట్ట ప్రకారంగా కోర్టులకు లేదు కాబట్టి తుది నిర్ణయం స్పీకర్ మాత్రమే తీసుకోగలుగుతారు. పార్టీ ఫిరాయించిన శాసనసభ్యులపై వేటు పడటానికి ఒక్క అవకాశమే ఉంటే వేటునుండి తప్పించుకోవటానికి అనేక మార్గాలున్నాయి. చట్టంలో ఉన్న లొసుగులు, లోపాలు, మినహాయింపులతో పార్టీలు మారుతున్న శాసనసభ్యులు తప్పించుకోగలుగుతున్నారు కానీ నైతికత ఒకటి ఉంటుంది ఆ నైతిక ప్రమాణాలను పాటిస్తే ఒక పార్టీ బీఫామ్‌పై గెలిచి మరొక పార్టీలోకి ఫిరాయించిన శాసనసభ్యుడు రాజీనామాచేయాలి. అలాగే సభాపతులు కేవలం చట్టం ప్రమాణికంగానే కాకుండా కళ్లముందే పార్టీ మారిన వాస్తవాలు కనపడుతున్నాయి కాబట్టి పార్టీ మారిన శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలి. పార్టీలో నాయకులు సిద్ధాంతాల ప్రతిపదికను కాకుండా అవకాశాలు అధికారం ప్రాతిపదికన పనిచేస్తున్నంతకాలం వలసలు ఫిరాయింపులు కొనసాగుతూనే ఉంటాయి.ఎలాంటి మినహాయింపులు లేకుండా పిరాయింపుల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేసినప్పుడే ఫిరాయింపులను నిరోధించగలుగుతారు. ప్రజాస్వామిక విలువలను కాపాడటానికి పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం మరింత పదును తేలాల్సిన అవసరం ఉంది. ●

# పునరుత్పాదక ఇంధనాలే రేపటి శక్తికి నిధులు!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జన్మదినం రోజున భారత ప్రభుత్వ పునరుత్పాదక శక్తి మంత్రిత్వశాఖ 2004 నుంచి ప్రతి ఏటా నిర్వహిస్తున్న జాతీయ పునరుత్పాదక శక్తి దినోత్సవం లేదా నేషనల్ రెన్యువబుల్ ఎనర్జీ డే పాటించడం జరుగుతున్నది. పునరుత్పాదక లేదా తరగని శక్తి వనరులను విరివిగా వాడుకోవడం,అవగాహన కలిపించడం, ప్రయోజనాలను వివరించడం, తరిగే శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమంగా తగ్గించడం, పునరుత్పాదక శక్తిని సులభంగా ఉత్పత్తి చేయడం, పునరుత్పాదక శక్తి అభివృద్ధికి తగిన సాంకేతిక పరిజ్ఞానాలను మెరుగుపరచడం లాంటి అంశాలను సామాన్య జనాలకు వివరించడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. 2025 జాతీయ పునరుత్పాదక శక్తి దినోత్సవం సందర్భంగా పోటీతత్వంతో తరగని ఇంధనాలను ఉత్పత్తి చేయడం, సమిష్టిగా శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడంతో పాటు వాతావరణ సమతుల్యతకు కృషి చేయడానికి నేటి ప్రభుత్వమే కాకుండా పౌర సమాజం కూడా నిరంతర కృషిని కొనసాగించాలి. సహజ వనరుల నుండి ఎంత కాలం వాడినా, ఎంత పరిమాణం ఉత్పత్తి చేసినా తరగని ఇంధన వనరుల ద్వారా ఉత్పత్తి చేసే శక్తిని పునరుత్పాదక లేదా తరగని శక్తి అని అంటాం. సూర్యరశ్మి (సౌర శక్తి), గాలి (పవన శక్తి), సముద్రం (అలల శక్తి), నదులు లేదా జలాశయాలు (జల విద్యుత్తు శక్తి), నీటి బుగ్గలు (భూ ఉష్ణశక్తి), బయోమాస్ (జీవ ఇంధనాలు) వంటి సహజ తరగని శక్తి వనరుల నుంచి ఉత్పన్నం చేస్తున్న శక్తిని పునరుత్పాదక లేదా తరగని శక్తి లేదా సాంప్రదాయేతర శక్తి" అని అర్థం చేసుకోవాలి. అనాదిగా మనం వాడుతున్న సాంప్రదాయ వనరులైన బొగ్గు, డిజిల్, పెట్రోల్, కిరోసిన్, వంట గ్యాస్ లాంటి వనరులను శిలాజ ఇంధనాలు లేదా సాంప్రదాయ తరిగే ఇంధనాలుగా పిలుస్తున్నాం. ఇవి ప్రకృతిలో పరిమితంగా ఉంటాయి.వీటిని వాడిన కొద్దీ క్రమంగా తగ్గుతాయి. కొంత కాలం తర్వాత ఈ వనరులు పూర్తిగా అయిపోవచ్చు. ఇలాంటి భూమి నుంచి లభించే శిలాజ ఇంధనాలను వాడినపుడు కార్బన్ ఉద్గారాలు విడుదల అవడం వల్ల భూతాపంతో పాటు పర్యావరణ కాలుష్య సమస్య కూడా ఉత్పన్నం అవుతున్నది. పునరుత్పాదక శక్తి వినియోగం ఫలితంగా వాతావరణ కాలుష్యం తగ్గడం, కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో భూతాపం అదుపులో ఉండడం, నిరంతరం అందుబాటు ఉంటూ సుస్థిరాభివృద్ధికి దోహదపడడం, ఉద్యోగ ఉపాధులు కల్పించడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి. నేటివరకుభారత దేశంలో ఉత్పత్తి అవుతున్న 452 గీగా వాట్ల విద్యుచ్ఛక్తిలో దాదాపు 46 శాతం (191 గీగా వాట్లు) పునరుత్పాదక శక్తి వినియోగపడుతున్నది. నేడు దేశవ్యాప్తంగా 203 గీగావాట్ల విద్యుత్తు తరగని ఇంధన వనరుల నుంచి ఉత్పత్తి అవుతుండగా, 2030 నాటికి 500 గీగా వాట్ల సామర్థ్యానికి పెంచాలని ప్రభుత్వం ప్రణాళికలు వేస్తున్నది. ప్రపంచ దేశాల్లో అధికంగా పునరుత్పాదక శక్తి ఉత్పత్తి చేస్తున్న దేశాల జాబితాలో (అమెరికా, చైనా, బ్రెజిల్ తర్వాత) భారత్‌కు 4వ స్థానం లభించడం హర్షదాయకం. ●

# కొత్త చరిత్ర లిఖించే సామర్థ్యం యువతకే

డి జె మోహన రావు

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. తాజా నివేదికల ప్రకారం, మన దేశం మొత్తం జనాభాలో 15 నుండి 29ఏళ్ల వయస్సు గల యువ జనాభా 42కోట్ల మంది ఉన్నారు. వీరు మొత్తం జనాభాలో సుమారు 29శాతం ఉన్నారు. భారతదేశ భవిష్యత్తుకు యువతే మూల స్తంభాలు. వారి కలలు, ఆశయాలు, శక్తి దేశాభివృద్ధికి చోదక శక్తులు. నేటి యువత కేవలం రేపటి నాయకులు మాత్రమే కాదు, నేటి మార్పులకూ నాయకులు. సాంకేతికతను, సృజనాత్మకతను ఉపయోగించి దేశాన్ని సరికొత్త శిఖరాలకు చేరుస్తున్నారు. కష్టాలకు వెరవని ధైర్యం, సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగే పట్టుదల, సమాజంలో మార్పు తీసుకురావాలన్న తపన ఇవే భారత యువతకు ఉన్న ముఖ్య లక్షణాలు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ, సవాళ్లను ఎదుర్కొంటూ, భారత యువత కొత్త చరిత్రను లిఖిస్తోంది. వారి శక్తి, సామర్థ్యం దేశ ప్రగతికి కొత్త దిశానిర్దేశం చేస్తాయి. ప్రస్తుత యువత వివిధ దేశాల యువతతో కలిసి వాతావరణ మార్పు, టెర్రరిజం, ఆర్థిక అసమానతలు వంటి అంతర్జాతీయ సమస్యలపై పని చేస్తున్నారు. ఐక్యరాజ్యసమితి యూత్ ఫోరం వంటి అంతర్జాతీయ వేదికలపై మాతృదేశ గళాన్నివినిపిస్తున్నారు. సాంకేతికతను ఉపయోగించి యువ పారిశ్రామికవేత్తలు కొత్త స్టార్టప్‌లను స్థాపించి, సామాజిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను అందిస్తున్నారు. ఈ సానుకూల అంశాలతో పాటు, తమ కలలు, ఆకాంక్షలను నెరవేర్చుకోవడానికి యువత కొన్ని సవాళ్లను కూడా ఎదుర్కొంటున్నారు. ఈ సవాళ్లు కేవలం వ్యక్తిగత సమస్యలు కాదు. భారతీయ విద్యా వ్యవస్థ సిద్ధాంతపరమైన జ్ఞానానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. కానీ పరిశ్రమలకు అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలను అందించడంలోవిఫలమవుతోంది. దీని ఫలితంగా, ఉన్నత విద్య పూర్తి చేసిన యువతలో కూడా నిరుద్యోగ రేటు ఎక్కువగా ఉంది. పట్టభద్రులలో నిరుద్యోగ రేటు 29.1 గా ఉందని అంతర్జాతీయ కార్మిక సంస్థ భారతదేశ ఉపాధి నివేదిక 2024 తెలిపింది. ఇది వారి నైపుణ్యాలకు, ఉద్యోగ మార్కెట్ అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని స్పష్టంగా సూచిస్తోంది. ఉద్యోగ లేమి, ఆర్థిక అనిశ్చితి, సామాజిక ఒత్తిళ్లు, పోటీ వాతావరణం వంటివి యువతపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. జాతీయ నేర గణాంక సంస్థ గణాంకాల ప్రకారం, దేశంలో రోజుకు సుమారు 30మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇది యువతలో పెరుగుతున్న మానసిక ఆరోగ్య సమస్యలకు, తగిన మద్దతు వ్యవస్థ లేకపోవడానికి స్పష్టమైన నిదర్శనం. భారతదేశం డిజిటల్ విప్లవంలో దూసుకుపోతున్నప్పటికీ, గ్రామీణ, పట్టణ యువత మధ్య డిజిటల్ విభజన ఇంకా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ, స్మార్ట్‌ఫోన్ల లభ్యత తక్కువగా ఉన్నాయి. ఇది వారికి ఆన్‌లైన్ విద్య, ఉద్యోగ అవకాశాలు, సమా



చారం అందుబాటులోకి రాకుండా అడ్డుకుంటోంది. 2023లో సెంటర్ ఫర్ డిజిటల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, గ్రామీణ యువతలో కేవలం 35 మందికి మాత్రమే ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉంది. యువత జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, రాజకీయ నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో వారి భాగస్వామ్యం తక్కువగా ఉంది. రాజకీయ రంగంలో మార్పులు తీసుకురావాలన్న ఆసక్తి ఉన్నప్పటికీ, అందుకు తగిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం లభించడం లేదు. దీనివల్ల విధానాల రూపకల్పన, అమలులో తమ గళాన్ని వినిపించలేకపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రాజెక్టుల వంటి వాటిలో అవినీతి కారణంగా యువత నిరాశకు గురవుతున్నారు.మెరిట్ ఉన్నప్పటికీ, సరైన అవకాశాలు లభించకపోవడం వారిలో అసంతృప్తిని పెంచుతోంది.పారదర్శకత లోపించడంవల్ల ప్రభుత్వ వ్యవస్థలపై వారికి నమ్మకం సన్నగిల్లుతోంది. మహిళా యువత ఇంకా అనేక రంగాల్లో అసమానతలను ఎదుర్కొంటున్నారు. విద్య, ఉద్యోగ అవకాశాలు, సమాజంలో గుర్తింపు వంటి విషయాల్లో వారికి పురుషులతో సమాన అవకాశాలు లభించడం లేదు. ఇది దేశ అభివృద్ధికి ఒకపెద్ద అడ్డంకిగా ఉంది. నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడానికి, పాఠ్య ప్రణాళికలో మార్పులు తీసుకురావాలి. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా విద్యా వ్యవస్థను సంస్కరించాలి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆచరణాత్మక శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లను తప్పనిసరి చేయాలి. స్కిల్ ఇండియా మిషన్ వంటి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. విద్యా సంస్థలు, కార్యాలయాల్లో మానసిక ఆరోగ్య కౌన్సిలింగ్, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. యువతకు సహాయం అందించే హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేసి, వాటి గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాన్ని విస్తరించాలి. డిజిటల్ అక్షరాస్యతను పెంచేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో కార్యక్రమాలను చేపట్టాలి. ఉపాధి అవకాశాలను కల్పించడానికి స్టార్టప్‌లను, చిన్న మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి. వీటికి అవసరమైన ఆర్థిక వనరులు, సరళమైన రుణ విధానాలను అందుబాటులోకి తీసుకురావాలి. పాఠశాలలు, కళాశాలల్లో రాజకీయ వ్యవస్థ, పౌర బాధ్యతలపై అవగాహన కల్పించాలి. యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించడానికి యువ పార్లమెంట్‌లు, డిబేట్‌ల వంటి కార్యక్రమాలను నిర్వహించాలి. రాజకీయ నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో యువత భాగస్వామ్యాన్ని పెంచాలి. పంచాయతీల నుండి పార్లమెంట్ వరకు యువతకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలి. ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకతను పెంచడానికి డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించాలి. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, ప్రాజెక్టుల కేటాయింపుల్లో పారదర్శకతను కచ్చితంగా పాటించాలి. అవినీతికి వ్యతిరేకంగా పోరాడే యువ సంస్థలకు మద్దతు ఇవ్వాలి. పాఠశాలల నుంచే లింగ సమానత్వం గురించి బోధించాలి.మహిళా యువతకు విద్య,ఉపాధిలో సమాన అవకాశాలు కల్పించాలి. ఉద్యోగాల్లో లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించే చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి.రేపటి భారతదేశానికి పునాదులు వేయగల యువత భవిష్యత్తుకు సంబంధించిన సవాళ్ళను పరిష్కరించడం ద్వారా, మన దేశంలోని యువత శక్తిని పూర్తిగా వినియోగించుకోవచ్చు. ఇది దేశాన్ని సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా వేగంగా నడిపిస్తుంది. ●

# విశాఖ ఉక్కు ..ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ జరగదు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 19:** విశాఖ ఉక్కు ప్లాంట్ ప్రైవేటీకరణపై దుష్ప్రచారానికి తెరదించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "విశాఖ ఉక్కు ప్లాంట్ ప్రైవేటైజ్ అవుతుందంటూ వైసీపీకి అనుబంధంగా ఉన్న కొంతమంది నాయకులు, కార్మిక సంఘాల నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా నిరాధారం. ఉక్కు ఆంధ్రలోకమనే నినాదాన్ని నమ్మి పోరాడిన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, విశాఖ ఉక్కు ప్లాంట్ ఎప్పటికీ ప్రైవేటీకరణ కాదు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు స్టీల్ ప్లాంట్ పరిరక్షణలో కీలకపాత్ర పోషించార్ను అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.11,440 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2,600 కోట్లు సమకూర్చి మొత్తం రూ.14,000 కోట్లకు పైగా నిధులు తెచ్చి ప్లాంట్‌కి ఆర్థిక



**రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

ఊపిరి ఇచ్చిన విషయాన్ని పేర్కొన్నారు. ఈ నిధులతో ముడిసరుకు, విద్యుత్, నీటి అవసరాలు తీర్చేలా భరోసా కల్పించారని స్పష్టం చేశారు. 1998లో అటల్ బిహారీ వాజ్ పేయి గారు ప్రధాని ఉన్న సమయంలోనూ, విశాఖ ఉక్కు ప్లాంట్ కష్టాల్లో ఉన్నప్పుడు అప్పటి నేతలు కలిసి రూ.1,350 కోట్లు తెచ్చి కాపాడిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు గారు, ఎంపీ భరత్ గారితో పాటు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ సహకారంతో భారీ నిధులు సమకూర్చినందువల్లే ప్లాంట్ మళ్లీ లాభదాయక దిశగా పయనిస్తోందని వివరించారు. కొందరు కార్మిక సంఘ నేతలు ప్లాంట్ మొత్తం ప్రైవేటీకరణ అవుతుందని సృష్టిస్తున్న అపోహలకు వాస్తవ ఆధారం లేదని స్పష్టం చేశారు. కొంతమంది కాంట్రాక్ట్ వర్క్‌లను మెరుగైన సేవలు అందించేలా ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం జరిగిందని, ఇది కొత్త విషయం కాదని, గతంలో కూడా ఇదే విధానం కొనసాగిందని తెలిపారు. ప్రస్తుతం ప్లాంట్‌లో 15 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, వారి సహకారంతోనే ఉత్పత్తి కొనసాగుతోందని వివరించారు. అమరావతి వరద ముంపు, విశాఖ స్టీల్ ప్రైవేటైజేషన్ వంటి దుష్ప్రచారాలు వైసీపీకి అనుబంధమైన వ్యక్తుల వల్లనే జరుగుతున్నాయని, ఇటువంటి ప్రయత్నాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు ,మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధి, పబ్లిక్ సెక్టార్ బలోపేతం, నిర్వాసితులకు న్యాయం, కార్మికుల సంక్షేమం అన్నీ సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. "ప్లాంట్ ప్రైవేటీకరణ అవుతుంది" అనే వాదనకు ఎలాంటి ఆధారాలు లేవని, ఎవరైనా ఇలాంటి ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మెరుగైన ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఆగస్ట్19, ప్రభాతవార్త: ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే మెరుగైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని ఏఎన్‌యు ఇన్‌చార్జి వీసి ఆచార్య కె.గంగాధరరావు సూచించారు. వర్సిటీలోని వ్యాయామ విద్య కళాశాల, ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్ అండ్ డైటిటిక్స్, కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబులిటీ విభాగాలు సంయుక్తంగా 'ఉచిత పోషకాహార ఆరోగ్య పరీక్షలు - కౌన్సెలింగ్' అనే అంశంపె రెండు రోజుల కార్యక్రమం డైక్మన్ ఆడిటోరియంలో మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న వీసి గంగాధరరావు మాట్లాడారు. ముఖ్యంగా పోషకాహార లోపాలను



అధిగమించాలంటే ముఖ్యమైన విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలను ప్రతీరోజు తీసుకోవాలని, దానితోపాటు ఆరోగ్యకమైన అలవాట్లు కలిగి ఉండాలన్నారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇటువంటి సమాజహిత కార్యక్రమాలు భవిష్యత్‌లో కూడా చేపట్టాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్ అండ్ డైటిటిక్స్, కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబులిటీ విభాగాల కోఆర్డినేటర్ డాక్టర్ బి.బబిత, డాక్టర్ కె.వి.శాంతిశ్రీ, డాక్టర్ జలజకుమారి, సిఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యం.వెంకటరమణ, వ్యాయామ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య వై.కిషోర్, అధ్యాపకులు డాక్టర్ రామ్మోహనరావు, వికాస అధ్యక్ష్య కార్యదర్శులు ఎన్.ప్రసాద్, జె.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు నూతక్కి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులు, వృద్ధుల అభ్యున్నతి కృషి చేయాలి

గుంటూరు తూర్పు, ఆగస్టు 19 (ప్రభాతవార్త) : వికలాంగులు మరియు వృద్ధుల అభ్యున్నతి కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల కార్పోరేషన్ ఛైర్మన్‌గా ఎన్నికైన గడుపూటి నారాయణస్వామి మేయర్‌ను నగరపాలక



సంస్థలోని ఆయన ఛాంబర్ నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ ఆయనను శాలువా మరియు పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని ముఖ్యంగా వికలాంగుల మరియు వృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలని తెలిపారు.

## అనధికారిక లే-అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం 2020ను సద్వినియోగం చేసుకోండి

గుంటూరు తూర్పు, ఆగస్టు 19 (ప్రభాతవార్త) : రాష్ట్ర ప్రభుత్వం అనధికార లే-అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం 2020ని పొడిగించి జిఓఎంఎస్ నెం.134సవరణ ఉత్తర్వులు జారీ చేశారని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ పథకంలో రాష్ట్రంలో జూన్ 30వరకు వేసిన అనధికార లే అవుట్లు, ప్లాట్లను నిర్ణీత అపరాధ రుసుము, 14శాతం ఓపెన్ స్పెస్ రుసుం బదులుగా 7శాతం మాత్రమే చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకంకు లైసెన్సు సర్వేయర్, ఇంజనీర్లు, లేదా ఆర్కిటెక్ట్ల ద్వారా అనధికార లే అవుట్లో ఉన్న స్థలం యొక్క ప్లాన్లు తయారు చేసుకుని అపరాధ రుసుములో 50శాతం చెల్లించి, జులై 26నుండి 90రోజుల లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.



పథకంలో 45రోజులలోపు పూర్తి రుసుం చెల్లించిన వారికి 10శాతం, 45నుండి 90రోజుల్లో చెల్లిస్తే 5శాతం రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు. గడువు అనంతరం క్రమబద్ధీకరించుకోని అనధికార లే అవుట్లు, ప్లాట్లకు విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, డ్రైనేజీ అనుమతించబడవన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ యొక్క నిషేధ ఆస్తి వాచ్ రిజిస్టర్‌లో నమోదు చేయబడతాయని, అటువంటి సైట్లలో ఏదైనా అమ్మకం, కొనుగోలు వంటి లావాదేవీలు అనుమతించబడవని స్పష్టం చేశారు. వివరాలకు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక ఏసిపి వెంకటేశ్వరరావును సంప్రదించవచ్చని తెలిపారు.

## బాలింతలకు పోషకాహారం పంపిణీ

గుంటూరు విద్య,ఆగష్టు 19,ప్రభాతవార్త : అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్,సెయింట్ లారెన్స్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో అధినేత మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా జిజిహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ సేవా కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా పొన్నూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జనసేన నాయకులు కిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు.జిజిహెచ్‌లో పురుడు పోసుకున్న మాతృమూర్తులకు పెద్దఎత్తున పండ్లు బ్రెడ్ తదితర పోషక ఆహారం పంపిణీ చేయబం జరిగింది.కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ,డాక్టర్ స్వరూప రాణి,డాక్టర్ బుచ్చిబాబు,మెడికల్ స్టూడెంట్స్ అలాగే పెద్దఎత్తున మెగా అభిమానులు మాధవరావు మొహమాటం రమేష్.గిడుతూరి సత్యం,యుగంధర్ అనేకమంది అభిమానులు విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రావణ మంగళగౌరీగా శ్రీకనకమహాలక్ష్మీ





గుంటూరు కల్చరల్, ఆగష్టు 19, ప్రభాతవార్త : స్థానిక సిద్దార్ధ నగర్ శ్రీకనక మహాలక్ష్మి మందిరంలో వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాలంకరణ,ప్రత్యేక పూజలు,సువాసినులచే కుంకుమార్చనలు నిర్వహించారు.హారతి మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

# గుంటూరు వార్త



## 'శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులు వేగవంతానికి నగరవాసులు సహకరించాలి'

గుంటూరు తూర్పు, ఆగస్టు 19 (ప్రభాతవార్త) : శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులు ప్రారంభమైనందున పనుల వేగావంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, స్థలాలు లేదా భవనాలు కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం టిడిఆర్ ఆండ్లు, నష్టపరిహారం అందిస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమీషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమీషనర్ ఛాంబర్‌లో శంకర్ విలాస్ వంతెన నిర్మాణంకు సంబంధించి కోర్ట్ కేసులు దాఖలు చేసిన వారితో నగర మేయర్, కమీషనర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేయర్, కమీషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ వంతెన పనుల్లో భాగంగా ఇప్పటికే పిల్లర్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, ప్రజల సౌకర్యం దృష్ట్యా వంతెన పనులు వేగంగా జరిగేలా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. కోర్టు కేసులు దాఖలు చేసిన వారు కూడా ప్రజలకు సహకరించాలని, వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని రకాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఆయా భవన యజమానులు కోరిన విధంగా వారి సర్వేయర్ల సమక్షంలోనే జిఎంసి, జిల్లా సర్వేయర్ల బృందం వంతెన నిర్మాణ ప్రాంతాన్ని మాస్టర్ ప్లాన్ మేరకు రీ సర్వే చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రీ సర్వేలో ఏమైనా లోపాలు ఉంటే అందుకు అనుగుణంగా మార్పులు చేయడానికి కృషి చేస్తామన్నారు. నగరానికి కీలకమైన శంకర్ విలాస్ వంతెన పనులు వేగవంతంకు సహకరించాలని, పనులను ఏడాదిలోపే పూర్తి చేయడానికి ప్రణాళికా బద్ధంగా జరుగుతుందన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసిపి రెహ్మాన్, బ్రాడిపేటీ, అరండల్‌పేట భవన యజమానులు పాల్గొన్నారు.



## డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తాం: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు తూర్పు, ఆగస్టు 19 (ప్రభాతవార్త) : నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీ కమిటీ ఛైర్మన్ మొహమ్మద్ నసీర్ తెలిపారు. బైపాస్ వద్ద డ్రైనేజీ వ్యవస్థను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. గుంటూరు నుంచి వచ్చే నాలుగు డ్రైనేజీల నీరు గుంటూరు బైపాస్ వద్ద సరైన ప్రవాహం లేక పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని, స్థానికులు ఎమ్మెల్యే నసీర్ దృష్టికి తీసుకురావడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. గుంటూరు నుంచి వచ్చే మురుగు నీటి ప్రవాహానికి బైపాస్ దాటి వెళ్ళేందుకు కేవలం వంతెన మాత్రమే నిర్మించాలని తెలిపారు. దీనిని మార్చే విషయంపై నేషనల్ హైవే అధారిటీ అధికారులతో సంప్రదిస్తామని ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే గుంటూరు నగరంలోని డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొండిగేటు వద్ద అదనపు వెంట్ వే నిర్మాణాన్ని చేపడుతున్నామని వెల్లడించారు. గత ఐదేళ్ళలో చిన్న చినుకు పడితే అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యేవరి తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక డ్రైయినేజీలు, ఆర్వోబీల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు.



## రోడ్లపై వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలి: కమిషనర్

గుంటూరు తూర్పు, ఆగస్టు 19 (ప్రభాతవార్త) : చెత్త కుప్పలు, బ్లాక్స్ స్పాట్స్ లేకుండా ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని, ప్రజలకు కూడా రోడ్ల మీద వ్యర్థాలు వేయకుండా అవగాహన కలిగించాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం శ్రీనివాసరావుతోట, సాయినగర్, పొత్తూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం, అభివృద్ధి పనులు, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వార్డ్ సచివాలయాల వారీగా పారిశుద్ధ్యంపై అధికారులు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్ల మీద చెత్త ఉండడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రతిరోజు ఇంటి వద్దకు చెత సేకరణకు వచ్చే సమయంపై అవగాహన కల్గించాలని, రోడ్ల మీద వేసే వారికి అపరాధ రుసం విధించాలన్నారు. మధ్యాహ్నం డ్రైన్ కల్వర్ట్ల శుభ్రం చేయాలన్నారు. డిఈఈ తోట వెంకటరమణ, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో పీ-4ప్రారంభ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేలు



గుంటూరు తూర్పు, ఆగస్టు 19 (ప్రభాతవార్త) : పీ-4 కార్యక్రమం ద్వారా పేదరికాన్ని జయిస్తామని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. మంగళగిరిలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించిన పీ-4కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ బంగారు కుటుంబాల ఆర్థిక ప్రగతికి మార్గదర్శకుల చేయూత అందించాలని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలోనే పీ-4ఒక మైలురాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమం దేశంలో ఇప్పటి వరకు చేపట్టలేదని, అన్న ఎన్టీఆర్ ఆశయ సాధనలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు.

## వర్సిటీలో ఘనంగా సోషల్ వర్క్ దినోత్సవం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఆగస్ట్19, ప్రభాతవార్త: వర్సిటీలోని సోషియాలజీ అండ్ సోషల్‌వర్క్ విభాగంలో మంగళవారం 6వ జాతీయ సోషల్‌వర్క్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య యం.త్రిమూర్తిరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. నేషనల్ అసోసియేష్ ఆఫ్ ప్రొఫెషనల్ సోషల్‌వర్క్ ఇన్ ఇండియా (ఎన్‌ఎపిఎస్‌డబ్ల్యుఐ) సహకారంతో ఆగస్ట్ 15 నుంచి 21 వరకు నేషనల్ సోషల్‌వర్క్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా 'బ్రిడ్జింగ్ కేర్ అండ్ కంపోషన్- సోషల్‌వర్క్ ఇన్ హెల్త్ సెట్టింగ్స్' అనే ఇతివృత్తంతో కార్యక్రమానికి నిర్వహించినట్లు వివరించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ సోషల్‌వర్క్ ప్రాముఖ్యతను తెలియజేశారు. సామాజిక భాద్యత గత పౌరులను సోషల్‌వర్క్ విభాగం తయారుచేస్తుందన్నారు. విభాగం అధ్యాపకులు, సోషల్‌సైన్స్ డీన్, సిడిఇ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్‌ఎపిఎస్‌డబ్ల్యుఐ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. బిఓఎస్ ఛైర్మన్, మాజీ పాలకమండలి సభ్యులు ఆచార్య సరస్వతీ రాజు అయ్యర్ మాట్లాడుతూ ప్రజల్లో వస్తున్న మానసిక సమస్యలు, ఇతర రుగ్మతలపై సోషల్‌వర్కర్‌లు కల్పిస్తున్న అవగాహనను వివరించారు. ఆచార్య ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచీకరణలో సోషల్‌వర్కర్‌ల బాధ్యతలు విలువైనవిగా పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విభాగం అతిథి అధ్యాపకులు డాక్టర్ పి.రాజకుమార్, డాక్టర్ డి.రాజశేఖర్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## వర్సిటీ ఫోటోగ్రాఫర్‌కు అవార్డు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఆగస్ట్19, ప్రభాతవార్త: వర్సిటీలో దినసరి ఉద్యోగిగా ఉన్న ఫోటోగ్రాఫర్‌గా గుత్తా సునీల్‌కుమార్‌కు ఉత్తమ ఫోటో గ్రాఫర్ అవార్డు లభించింది. ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సెల్ అండ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఫోటో ప్రదర్శనలో ట్రైబల్ ఫోటో ఆఫ్ ద ఇయర్ అవార్డు-2025ను సునీల్‌కుమార్ అందుకున్నారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నూకసాని బాలిజి, డైరెక్టర్, సిఇఓ ఆర్.మల్లిఖార్జునరావు, పిఏఐ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ కొంపల్లి సుందర్, ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక ఛైర్మన్ తమ్మాశ్రీనివాసరెడ్డి, అవనిగడ్డ ఎంఎల్‌ఏ మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపి గోకరాజు గంగరాజులు సునీల్‌కు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసి గంగాధరరావు, రెక్టార్ రత్నషీలామణి, రిజిస్ట్రార్ సింహాచలం, విభాగం కోఆర్డినేటర్ జ్యోతిర్మయి, అధ్యాపకులు మధుబాబు, సిడిఇ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు సునీక్‌కు అభినందనలు తెలిపారు.



## ఆగస్టు 29నుండి దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు: 19:** ఆగస్టు 29 నుండి 31 వరకు దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవం-2025ను ఉత్సాహభరితంగా నిర్వహించేందుకు క్రీడా శాఖ విస్తృత ప్రణాళికలు రూపొందించింది. ఈ సందర్భంగా కేంద్ర క్రీడాశాఖ మంత్రి మనసుఖ్ మాండవీయ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించబడింది. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సచివాలయంలోని ఛాంబర్ నుండి పాల్గొన్నారు. ప్రజల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా, ఆరోగ్యం - ఫిట్‌నెస్ పై అవగాహన కల్పించేలా ప్రతి రాష్ట్రం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కేంద్ర మంత్రి సూచనలు చేసారు. ఆగస్టు 29న ఉద్యోగుల మధ్య వినోదాత్మక పోటీ ఆటలు, ఆగస్టు 30న మాజీ ఛాంపియన్లతో సదస్సులు, సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు . అలాగే ఆగస్టు 31న "[illegible]" పేరుతో సైక్లింగ్ ర్యాలీలు జరిపి సమాజంలో ఆరోగ్యకరమైన జీవనశైలి పై సందేశం ఇవ్వాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ - రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, ముఖ్యంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, యువజన సంఘాలు, క్రీడా సంస్థలు చురుకుగా పాల్గొనేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



### కాణిపాకం వినాయక బ్రహ్మోత్సవాలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఆహ్వానం

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు: 19:** చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఈనెల 27వ తేదీ నుండి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్, ఆలయ అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా సచివాలయంలోని మంత్రిగారి ఛాంబర్‌లో కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి అర్చకులు ఆశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు.



## నేటి నుంచి అమరావతి ఛాంపియన్‌షిప్ కప్ టోర్నీ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఆగస్ట్19, ప్రభాతవార్త: వర్సిటీలో శాప్ సహకారంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు అమరావతి చాంపియన్ షిప్ కప్ పేరుతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, (అండర్-19), బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్ అంశాలలో జోనల్ లెవల్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కృష్ణా, గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి 2వేల మంది (పురుష, మహిళ) క్రీడాకారులు హాజరుకానున్నట్లు వివరించారు. ఈ పోటీలో ప్రతిభచూపిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని నరసింహారెడ్డి తెలిపారు.

**ఫలితాలు విడుదల**

వర్సిటీ పరిధిలో బి.టెక్ 4/1 మొదటి సెమిస్టర్ (ఆర్-19)కు మే నెలలో జరిగిన పరీక్షల ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. నలుగురు పరీక్ష రాయగా ముగ్గురు ఉత్తీర్ణత సాధించారు. ఎంబిఏ మీడియా మేనేజ్‌మెంట్‌లో 4వ సెమిస్టర్‌లో 8మందికి ముగ్గురు, ఇంటిగ్రేటెడ్ ఎంఏ పబ్లిక్‌పాలసీ 2వ ఏడాది 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 49మందికి 41మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. రీవాల్యూయేషన్‌కు ఈనెల 28లోగా ఒక్కో పేపర్‌కు రూ.2070 చెల్లించి దరఖాస్తులు చేసుకోవచ్చునని సిఇ తెలిపారు.

## అఖిలభారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు పండ్లు పంపిణీ



గుంటూరు విద్య,ఆగష్టు 19,ప్రభాతవార్త : పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు సందర్భంగా గుంటూరులో అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్రబాబు తలపెట్టిన 8రోజుల నిరాటంకంగా జన్మదిన వేడుకలు కొనసాగాయి.స్థానిక బ్రాడీపేటలోని సాయి దీన జన సేవా సమితి వసతి గృహంలోని దివ్యాంగ విద్యార్థులకు మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితర నాయకులు కార్యక్రమంలోపాల్గొన్నారు.ఈ సందర్భంగా చిరంజీవి సమాజానికి చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను దివ్యాంగ విద్యార్థులకు ప్రసంగ రూపంలో తెలియజేశారు.చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడుతున్న అంశాలను వక్తలు వివరించారు.సమాజ స్ఫూర్తితో అఖిలభారత చిరంజీవి యువత చిరంజీవి పుట్టినరోజు ఆగస్టు 22ను పురస్కరించుకొని వారాంతర వేడుకలను గత కొద్ది రోజులు చేస్తున్నత కార్యక్రమాలుఎంతో స్ఫూర్తిగా నిలవడం అభినందనీయమని ఈ సందర్భంగా బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు రమేష్,నాగరాజు,నగేష్,గిడుతూరి సత్యం,సూరిబాబు, శ్రీదేవి,అంజలి, అతియసుల్తానా, పద్మజ,బాజీ సంతోష్‌కుమార్,ప్రమీల,మాధవరావు,శ్యాంబాబు,రమణారెడ్డి,శ్రీకర్ పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సబ్‌కమిటీని నియమించాలి

గుంటూరు విద్య,ఆగష్టు 19,ప్రభాతవార్త :నేడు జరిగే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని,ఉద్యోగులకు విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను తక్షణమే విడుదల చేయాలని,12వ వేతన సవరణ కమిటిని సిట్టింగ్ జడ్జి తోటి ఏర్పాటుచేయాలని,రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు విశ్రాంత ఉద్యోగులకు వెంటనే ఐఆర్ 29శాతం విడుదల చేయాలని,పెండింగ్‌లోఉన్న 25వేల కోట్ల రూపాయల బకాయిలకు చట్టబద్ధత కల్పించాలని గుంటూరు జిల్లా ఐక్యవేదిక ఛైర్మన్ చాంద్ భాష ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగే రాష్ట్రస్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగులకు విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ సమస్యలపై రాష్ట్ర క్యాబినెట్‌లో చర్చించి సముచిత నిర్ణయం తీసుకోవాలని చాంద్ భాషా కోరారు.



## సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ (కెబినెట్)కు ఘన సత్కారం

గుంటూరు విద్య,ఆగష్టు 19,ప్రభాతవార్త : పశ్చిమ గోదావరిజిల్లా ఉండి మండలం,పాందువ్వ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ రాజును సీఎం కార్యక్రమాలు కోఆర్డినేటర్ (కేబినెట్ ర్యాంక్)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ రాజుని శ్రీవికాస్ విద్యాసంస్థల అధినేత,రాష్ట్ర గ్రంధాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దాసరి రాజా మాస్టారు మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు.మిత్రులు రాజుకి పదవి రావడం కష్టపడినవారికి పార్టీ గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందనడానికి నిదర్శనమని,మిత్రునికి ఇంతటి గౌరవం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి,కిలారు రాజేష్‌కి,దాసరి రాజా మాస్టారు కు ధన్యవాదాలు తెలిపారు.



## శ్రావణ మంగళవారం 108కిలోల గంధంతో విశేషాభిషేకార్చన

గుంటూరు కల్చరల్,ఆగష్టు 19,ప్రభాతవార్త : స్థానిక అరండల్‌పేటలోని శ్రీఅష్టలక్ష్మి మందిరం కోటి కుంకుమార్చనలో భాగంగా శ్రావణ మంగళవారం సందర్భంగా మర్రిపాటి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం విశేష పూజలు,శ్రీచక్ర మహామేరుకు విశేషాభిషేకార్చనలు,108కిలోల గంధంతో విశేషాభిషేకార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.విశేష హారతులు,మంత్రపుష్పం అనంతరం కుంకుమార్చనలో పాల్గొన్న సువాసినులు,భక్తులు స్వామివారిని అమ్మవారిని సేవించుకొని తీర్థప్రసాదాలను అందుకున్నారు.నక్షత్ర హారతి,మంత్రపుష్పం అన్నదానం జరిగింది.

## విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఏఎన్‌ఎం లు శ్రద్ధ వహించాలి



పెదనందిపాడు ఆగస్టు 19 (ప్రభాతవార్త)వాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా మంగళవారం పెదనందిపాడు 2 గ్రామ సచివాలయం పరిధిలో ఎం. పి. ఎలిమెంటరీ స్కూల్, కొత్తపాలెం లో ఆరోగ్య కార్యకర్తలు విద్యార్థులకు కోరింత దగ్గు. ధనుర్వాతం .కంఠ సర్పి. లాంటి వ్యాధులు రాకుండా ప్రత్యేక వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి కెఎఫ్ కామెడీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం పట్ల ఆరోగ్య కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి వెంట కార్యాలయ సిబ్బంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని అనిత. ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 21న అవగాహన...లో హాస్యవల్లరి

గుంటూరు కల్చరల్,ఆగష్టు 19,ప్రభాతవార్త : గత 15సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న హాస్యవల్లరి నవ్వు నవ్వించు కార్యక్రమం ఆగస్టు 21వ తేది గురువారం సాయంత్రం 6గంటలకు అవగాహన సంస్థ కార్యాలయంలో నిర వ్రహించబడుతుదని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.

పల్నాడు జిల్లా వార్త





## పి-4 అమలుతో ఆర్థిక, సామాజిక అసమానతలకు స్వస్తి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఆగస్టు19,ప్రభాతవార్త: ప్రజారంజక పాలనతో కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ప్రజల మనసులు గెలిచిందని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం ప్రత్తిపాటి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్-6 అమలుతో అన్నివర్గాల ఆదరాభిమానాలు పొందిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల



మద్దతుతో రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులు పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణతో పాటు మరోపక్క పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ఆయన ఆలోచనలు వేగంగా అమలులోకి వస్తున్నాయని తెలిపారు. దానిలో బాగంగానే పి-4 కార్యాచరణ దిశగా ముఖ్యమంత్రి సన్నద్ధమయ్యారని ప్రత్తిపాటి తెలిపారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సదుద్దేశంతో, గొప్ప ఆశయంతో చేపట్టిన పథకమే పి-4 పథకమని అన్నారు. రాష్ట్రంలో ఉన్న పేదరికాన్ని దశలవారీగా రూపుమాపాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని, రాష్ట్రంలో అట్టడుగున ఉన్న 20శాతం పేద కుటుంబాలను ఆర్థికంగా ఎదిగేలా చేయాలన్న సంకల్పం దిశగా ప్రభుత్వం సాగుతుందని ప్రత్తిపాటి తెలిపారు.

**మాటల తప్ప చేతలకు పనికిరాని వారే పి-4 పథకాన్ని తప్పుపడుతున్నారు**

పి-4 పథకం అమలు అసాధ్యమంటూ పేదరికం ప్రామాణికాలను తప్పుపడుతూ, రాష్ట్రంలో కోటికి పైగా పేద కుటుంబాలున్నాయని చెబుతున్న వారు గతంలో ఐదేళ్లు అధికారంలో ఉండి పేదరిక నిర్మూలన ఏం చేశారో ఆలోచించాలని ప్రత్తిపాటి అన్నారు.

**నందమూరి పద్మజ మృతి కలిచివేసింది**

నందమూరి జయకృష్ణ సతీమణి, నందమూరి తారకరామారావు పెద్ద కోడలు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సోదరి సమానురాలైన నందమూరి పద్మజ మరణవార్త తీవ్రంగా కలిచివేసిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. అనారోగ్య సమస్యలతో ఆమె ఈ లోకాన్ని వీడిపోవడం మిక్కిలి బాధాకరమని, దగ్గుబాటి వారి ఆడబిడ్డ, నందమూరి వారి కోడలైన పద్మజ మరణం ఇరు కుటుంబాలకు తీరని లోటన్నారు.

## గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : అర్బన్ సిఐ పి రమేష్



చిలకలూరిపేట,ఆగస్టు19,ప్రభాతవార్త: వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక పందిళ్లను వేసుకొని చేసి గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసుకునే కమిటి సభ్యులకు పట్టణ ఆర్బన్ సిఐ పలు సూచనలు తెలియచేశారు. గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయాలంటే ముందుగా పోలీస్‌శాఖ అనుమతి అవసరమని తెలిపారు. ఈ అనుమతి పత్రంలో విగ్రహం ఏర్పాటు చేసే స్థలం,నిమజ్జన సమయం,మరియు ఊరేగింపు రూట్‌మ్యాప్, నిమజ్జనానికి ఉపయోగించే వాహనం వివరాలు తెలియచేయాలని అన్నారు.



వినాయక చవితి పండుగ పురస్కరించుకొని చిలకలూరిపేట రూరల్ మండలాలలో ఏర్పాటు చేస్తున్న వినాయక పందిళ్లకు, గణేష్ మండపాలకు పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరి అని రూరల్ సిఐ బి సుబ్బనాయుడు అన్నారు. మంగళవారం రూరల్ సిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటుచేసే వారు ముందుగా ఒక కమిటీగా ఏర్పడాలని, మండపాలను ఇరుకు వీదులలో ఏర్పాటు చేయకూడదని తెలిపారు. మండపాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా భక్తులు పూజలు జరుపుకోవాలన్నారు. మండలపాల వద్ద మద్యం సేవించడం, జూదం ఆడటం, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడటం నిషిద్ధమని తెలిపారు. మండపం వద్ద కనీసం ముగ్గురు వాలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి రోజు వాలంటీర్ల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

## పెన్షన్ అర్హులకు ప్రభుత్వం మరొక అవకాశం : మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు



చిలకలూరిపేట,ఆగస్టు19,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ల వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టిందని మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు మంగళవారం తెలిపారు. చిలకలూరిపేట పురపాలక సంఘ పరిధిలో 255మంది లబ్దిదారులు అనర్హులుగా తేలారని అన్నారు. అయితే ప్రభుత్వం వారికి మరోక అవకాశం కల్పించిందని, నిజంగా అంగవైకల్యం ఉన్నవారు అప్పీలు చేసుకోవచ్చునని కమీషనర్ వివరించారు. అప్పీలు చేసుకున్న ధరఖాస్తులను పిడి డిఆర్‌డిఎకు పంపించడం జరుగుతుందన్నారు. అక్కడనుంచి డియంహెచ్‌ఓకు పంపిస్తారని అన్నారు. అనంతరం నోటీసు జారీ చేసిన డాక్టర్ల బృందంతో మరోసారి వెరిఫికేషన్ చేయించి 40శాతం కంటే తక్కువ అంగవైకల్యం ఉంటే అనర్హులుగా, 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉండే ఫించన్‌ను మళ్లీ పునరుద్దరించడం జరుగుతుందని కమీషనర్ తెలిపారు. అర్హులైన లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా మున్సిపల్ కమీషనర్ కోరారు.

## లూథరన్ దేవాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



నాదెండ్ల,ఆగస్టు19,ప్రభాతవార్త: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలోని పెదమాలపల్లి (చైతన్య నగర్) లో నూతనంగా నిర్మించిన ఎపి పానియా లూథరన్ దేవాలయాన్ని మంగళవారం శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ సందర్శించారు. ఈ చర్చి నిర్మాణం కొరకు పల్లెలో ఉన్న షుమారు 200 కుటుంబాలు ఒక్కొక్క ఇంటికి రూ 40వేల వంతున చందాలు వేసుకొని చర్చి నిర్మాణాన్ని చేపట్టారు. షుమారు 2 కోట్ల వ్యయంతోనిర్మించిన ఈ చర్చిని చర్చి పెద్దల ఆహ్వానం మేరకు మర్రి రాజశేఖర్ ఆ చర్చిని సందర్శించారు. ఈ చర్చి నిర్మాణ పెద్దలను రాజశేఖర్ అభినందించారు.

## విద్యుత్ సమస్యలను తెలుసుకొని పరిష్కారం

చిలకలూరిపేట,ఆగస్టు19,ప్రభాతవార్త: విద్యుత్ సమస్యలపై పట్టణంలోని సింగు కళ్యాణ మండపంలో పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వేదికలో విశ్రాంత జిల్లా న్యాయమూర్తి, సిజిఆర్ఎఫ్ చైర్మన్



యన్ విక్టర్ ఇమ్మానియేల్ ముఖ్య అతిథిగా పాల్గొని వినియోగదారుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 12 సమస్యలు పై వినియోగదారులు ధరఖాస్తు చేశారు. వీటిలో 3 ధరఖాస్తులను తక్షణమే పరిష్కరించారు. 9 ధరఖాస్తులను 7 రోజులలోపు పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. వీటిలో చిలకలూరిపేట టౌన్2 పరిధిలో 7 ధరఖాస్తులు రాగా వాటిలో 2 పరిష్కారం అయ్యాయి. గణపవరం సెక్షన్ పరిధిలో ఒకటి రాగా దానిని పరిష్కరించారు. బొప్పూడు సెక్షన్‌లో ఒక ధరఖాస్తు, వట్టిచెరుకూరు సెక్షన్‌లో ఒక ధరఖాస్తు, చిలకలూరిపేట రూరల్ సెక్షన్ పరిధిలో ఈ ధరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా సిజిఆర్ఎఫ్ చైర్మన్ యన్ విక్టర్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ వినియోగదారులను ఎటువంటి ఇబ్బందులకు గురిచేయకుండా విద్యుత్ అధికారులు, విద్యుత్ సిబ్బంది పనిచేయాలని తెలిపారు. పల్నాడు జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు ముదికిపూడి ప్రసాద్, సిఆర్‌డిఏ పర్యవేక్షక అధికారి ఎన్ శ్రీనివాసరావు, గణాంక అధికారి అజయ్‌కుమార్, డిప్యూటీ ఈఈలు ఇద్దరు, 9మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, స్థానిక ఈఈ వై ఎడుకొండలు, ఎడిఈ ఆర్ అశోక్‌కుమార్, పట్టణ, రూరల్ ఏఈలు పాల్గొన్నారు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



చిలకలూరిపేటటౌన్,ఆగస్టు19,ప్రభాతవార్త: పట్టణ ఆదర్శ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎస్.ఆర్ శ్రీను, అన్నం బుజ్జిబాబు, సత్యనారాయణ, ఎ పోతురాజు, రాయల్ హరి, అలంకార్ నరేంద్ర, తిరుమల భాస్కర్, పూజిత డిజిటల్స్ శ్రీనివాసరావు, భాను ప్రేమ్స్ అరుణ్‌బాబీ, సుబ్బు, మిక్సింగ్ గోపి, యడ్లపాడు కోటి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## దివ్యాంగురాలి ఫించన్ అందజేత



నాదెండ్ల,ఆగస్టు19,ప్రభాతవార్త: మండలంలోని అమీన్‌సాహెబ్ పాలెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు శానంపూడి ఏసమ్మకు చెందిన మెడికల్ సర్టిఫికెట్‌ను మంగళవారం గ్రామ సర్పంచ్ కామినేని లలితా నాగేశ్వరరావు పరిశీలించారు. ఆ సర్టిఫికెట్‌లో నూరుశాతం అంగవైకల్యం ఉన్నట్లు ఉన్నందున దానిని పరిశీలించి దివ్యాంగురాలికి సర్పంచ్ పంచాయితీ కార్యదర్శితో కలిసి అందజేశారు.

## మార్కెట్‌యార్డు మట్టి నమూనా కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



నరసరావుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త : నరసరావుపేట మార్కెట్‌యార్డులోని మట్టి నమూనా కేంద్రాన్ని మంగళవారం పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూసార పరీక్షా కేంద్రంలో రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లా లక్ష్యాన్ని సాధించాలన్నారు. రైతులు అధిక దిగుబడులను సాధించేందుకు వ్యవసాయ అధికారులు, పరీక్షా కేంద్రం సిబ్బంది తగిన సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి, ఏడిఏ కె.వి.శ్రీనివాసరావు, శివలలిత, యాకోబు, బ్రహ్మయ్య, నాగేశ్వరరావు, విజయదుర్గ పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన

నరసరావుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త : మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం అమరావతి రజక ఐక్యవైదిక, ఎంహెచ్‌పిఎస్,బిఎస్‌పి సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు. నాయకులు




ఉదయగిరి వెంకట స్వామి, మస్తాన్‌వలి, బాబురావు, కోటేశ్వరరావు,శ్రీను నాయకత్వం వహించి మాట్లాడారు. టౌన్‌ప్లానింగ్ అధికారి సాంబయ్య తమ సామాజికవర్గాన్ని కించ పరుస్తూ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. నిరసన అనంతరం కమీషనర్ జస్వంతరావును కలిసి వినతిపత్రం అందించారు. కోటప్పకొండ రోడ్డులోని తమ సత్రం కబ్జాకు గురైందని దానిపై టౌన్ ప్లానింగ్ అధికారులను కలవటం జరిగిందన్నారు. గత నాలుగు నెలలు వారి చుట్టూ తిరిగిన ఫలితం లేదన్నారు. కార్యాలయం నుండి వెళ్లిపోవాలని దూషణలకు వారు దిగారని తెలిపారు. దీనిపై తమకు సమాధానం చెప్పాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేసారు.

## ఫోరమ్ ఫర్ ఆర్‌టిఐ పల్నాడు జిల్లా గోడ పత్రికల అవిష్కరణ

నరసరావుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త : ఫోరమ్ ఫర్ ఆర్‌టిఐకి సంబంధించిన గోడ పత్రికాలను మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ



అరవిందబాబు అవిష్కరించారు. కార్యక్రమానికి నాయకులు బత్తుల మురళిఅధ్యక్షత వహించారు. నూతన జిల్లా ఫోరం సభ్యులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శుభకాంక్షలు తెలిపారు. పట్టణంలో నిర్వహించేసదను ్ర విజయవంతం చేసేందుకు తమ వంతు చేయూత ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, బిజెపి నాయకులు రంగిశెట్టి రామకృష్ణలు పాల్గొన్నారు.

## లూపస్ వ్యాధి లక్షణాలను గుర్తించి ఖచ్చితమైన చికిత్సను తీసుకోవాలి : డాక్టర్ మన్నే దివ్య

నరసరావుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త : లూపస్ వ్యాధి లక్షణాలను గుర్తించి ఖచ్చితమైన చికిత్సను తీసుకోవాలని డాక్టర్ యనమదల దివ్య అన్నారు. మంగళవారం దివ్య రుమటాలజి వైద్యశాలలో ఆమె మాట్లాడుతూ ముక్కు ప్రక్కన ఇరువైపులా ఎర్రటి మచ్చలు రావడం ప్రాథమిక లక్షణం అన్నారు.



సీతాకోక చిలుక దద్దుర్లు, దవడ వాపు, కళ్ళు మంటలు, నోరు పొడిబారడం, కండరాళ్ళ నొప్పులు వస్తాయన్నారు. అదే విధంగా తరచుగా నోట్లో అల్సర్లు ఉంటాయన్నారు. శరీరకం బలహీనతగా ఉండటం, ఎర్రటి ర్యాషెష్ కనిపిస్తాయన్నారు. దీంతో పాటు జుట్టు రాలిపోవడం, తలనొప్పి, అధిక జ్వరం, పొత్తి కడుపునొప్పి వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ జబ్బుకు సంబంధించి పూర్తిస్థాయిలో చికిత్స దివ్య రూమటాలజీ సెంటర్‌లో అందిస్తున్నామని తెలియజేశారు. పల్నాడు జిల్లా ప్రజలు తమ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ యనమదల దివ్య కోరారు.

## జాతీయస్థాయి అబాకస్ పోటీలలో యూసిమస్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త : జాతీయస్థాయి అబాకస్ పోటీలలో నరసరావుపేట యూసిమస్ బ్రాంచ్ విద్యార్థులు మంచి ప్రతిభ చూపారు. హైదరాబాద్‌లోని సో ఎర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన అబాకస్ జాతీయస్థాయి పోటీలకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి 6 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని డైరెక్టర్ జి.కిరణ్, బ్లెస్సినా తెలియజేశారు. ఛాంపియన్ ట్రోఫీని



గెలుచుకోవడం జరిగిందన్నారు. రన్నరప్ స్థాయిలో అకీర, రోనిన్ నిలిచారన్నారు. మెరిట్ అవార్డులను ఆరోన్, మణికంఠ, భవిష్ సాధించారన్నారు. మొత్తం ఆరు ట్రోఫీలు నరసరావుపేట బ్రాంచ్‌కు వచ్చాయన్నారు. అబాకస్ కోర్సు విద్యార్థులలో గణనశక్తి, కేంద్రీకరణ, జ్ఞాపకశక్తి, మానసిక సమతూల్యం పెంపొందిస్తుందన్నారు. వేగవంతమైన లెక్కల నైపుణ్యం పెరుగుతుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో అబాకస్ కోర్సుతో మంచి విజేతలుగా విద్యార్థులు తయారవుతారని తెలియజేశారు.

## కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ పై ఒప్పందం

నరసరావుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త : స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మంగళవారం టిఎంఐ గ్రూప్ వారి సిఎస్ఆర్ ట్రైనింగ్అండ్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రాం కార్యక్రమానికి సంబంధించి పరస్పర ఒప్పందం జరిగింది. విద్యార్థుల శిక్షణకు సంబంధించి పలు అంశాలను ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు వివరాలు తెలిపారు. తమ కళాశాలతో టిఎంఐ సంస్థ సీనియర్ మేనేజర్ షేక్ ఇమ్రాన్‌తో ఒప్పంద పత్రాలు అందించుకోవటం జరిగిందన్నారు. తమ విద్యార్థులకు అవసరమైన టెక్నికల్ స్కిల్స్ ట్రైనింగ్ జావా, పవర్-బి, జెనరేటివ్ ఎఐ-డిజిటల్ మార్కెటింగ్, బ్యాంకింగ్ అంశాలలో శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. దీని వలన తమ



విద్యార్థులకు ఎంఎన్‌సికంపెనీలలో ఉద్యోగాలు తేలికగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి బాల కోటేశ్వరరావు, యోగేశ్వరరావు తదిత రులు పాల్గొన్నారు.

## గణేష్ విగ్రహాలకు అనుమతులు తప్పనిసరి: విజయపురిసౌత్ ఎస్సై అశోక్



విజయపురిసౌత్, ఆగస్టు 19 ప్రభాతవార్త: ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని విజయపురిసౌత్ ఎస్సై అశోక్ తెలిపారు. మంగళవారం ఎస్సై మాట్లాడుతూ వినాయక విగ్రహ మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిర్వాహకులు విద్యుత్తు, పంచాయతీ, అగ్నిమాపక శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వినాయక మండపాలు, నిమజ్జన ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదన్నారు.

## పడకేసిన పారిశుద్ధ్యం!... స్వచ్ఛభారత్ ఎక్కడ?

కారంపూడి, ఆగస్టు 19 ప్రభాతవార్త: కారంపూడి పట్టణంలో ఎక్కడ చూసినా పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్రభుత్వం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛభారత్ చేపట్టింది. దీని ముఖ్యఉద్దేశం గ్రామాల్లోని పరిసరాలు పరిశుభ్రంగా





ఉంచాలి. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండాలని ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛభారత్ పేరుతో కార్యాలయాలు శుభ్రంగా ఉంచాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. కానీ కారంపూడి పట్టణంలో స్వచ్ఛభారత్ కనపడటం లేదు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్‌లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

## కారంపూడి మోడల్ స్కూల్‌లో ఐఈసీ క్యాంపెన్


కారంపూడి, ఆగస్టు 19 ప్రభాతవార్త: కారంపూడిలోని ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ



ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం రీడ్స్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులకు హెచ్ఐవీ గురించి అవగాహన కల్పించారు. హెచ్ఐవీ ఎలా వస్తుంది, వాస్తవాలు, అపోహల గురించి వివరించారు. హెచ్ఐవీ నుంచి రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సుజాత, ఎల్‌టీ వెంకటలక్ష్మి, రీడ్స్ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ కోమలి, అవుట్ రీచ్ వర్కర్లు శేషయ్య, చెన్నమ్మ, కోటేశ్వరి, నాగరాజు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుద్రోహి జగన్‌రెడ్డి: ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ఆగ్రహం

మాచర్ల, ఆగస్టు 19 ప్రభాతవార్త: రైతు ద్రోహి పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వినుకొండ వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రైతులు పడిన కష్టాల గురించి ప్రస్తావించారు. రైతుల ఆర్థిక ఉన్నతి కోసం ఆనాడు టీడీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ




పథకాలకు శ్రీకారం చుడితే, వాటిని వైసీపీ పాలనలో సైకో జగన్‌రెడ్డి రద్దు చేశారని తూర్పార పట్టారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రైతుల ఉన్నతి కోసం గత ప్రభుత్వం రద్దు చేసిన పథకాలన్నింటినీ పునరుద్ధరించడమే కాకుండా అంతకుమించిన సంక్షేమాన్ని అమలు చేస్తుందని వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి వేల కోట్లు కేటాయించి, నిధులను ఖర్చు చేస్తోందని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర రైతాంగానికి ఖరీఫ్‌లో పెట్టుబడి సాయం అందించి, కూటమి ప్రభుత్వం ఆదుకుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రానున్న రోజుల్లో రైతులను లక్షాధికారులుగా మార్చేలా అనేక పథకాలు కార్యరూపం దాల్చుతాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు పెట్టుబడి సహాయం ఒకే విడత 20వేలు ఇవ్వాలి : కౌలు రైతు సంఘం నాయకులు

యడ్లపాడు, అగస్టు 19, ప్రభాతవార్త : కౌలు రైతులకు పెట్టుబడి సహాయం ఒకే విడత 20వేలు రూపాయలు ఇవ్వాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై రాధాకృష్ణ డిమాండ్ చేసారు. మండల పరిధిలోని జగ్గాపురం, జాలాది, సందెపూడి, మైదవోలు, లింగారావుపాలెం, సొలస తదితర



గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించిన సందర్భంగా అయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వివరిస్తూ ప్రభుత్వం ఇచ్చిన హామి మేరకు భూ యజమాని అనుమతితో పనిలేకుండా ప్రభుత్వం గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి పంట సాగు హక్కు పత్రాలను మంజూరు చేయాలని, అన్నదాత సుఖీ భవ పథకంలో భూమిలేని కౌలు రైతులకు పెట్టుబడి సహాయం 20వేల రూపాయలు ఒకే విడత ఇచ్చి కౌలు రైతులను అప్పుల నుండి అదుకోవాలన్నారు. కౌలు రైతులకు పంట రుణాలను 2లక్షల వరకు పంట స్కేల్ అఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు రుణమేళా నిర్వహించి కౌలు రైతులకు వడ్డీలేని పంట రుణాలు ఇవ్వాలని, అన్ని సచివాలయాల వద్ద కౌలు కార్డు దరకాస్తు ఫారాలను అందుబాటులో ఉంచి కౌలు రైతులలో ప్రభుత్వం ప్రచారం నిర్వహించాలని, కౌలు రైతుల పేర్లు ఈ క్రాప్‌లో నమోదు చేసి ఉచిత పంటల భూ యజమాని అమలు చేయాలని, ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 25న నర్సరావుపేటలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా లో కౌలు రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. రైతుల సంఘం నాయకులు ఎన్ కాళిదాసు మాట్లాడుతూ ఢిల్లీ రైతుల ఉద్యమం, పొగాకు రైతులు కొనుగోళ్ల కోసం చేసిన పోరాటాలను సూర్పిగా తీసుకొని కౌలు రైతులు పెట్టుబడి సహాయం కోసం పంట రుణాల కోసం పోరాడాలన్నారు. కౌలు రైతులు లేనిదే వ్యవసాయం చేసే వారు లేరని, భూ యజమానులు సహకరించి కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు వచ్చేలా చేయాలని, దీని వలన భూ యజమానులకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ఎన్నికల సంఘం వైఖరి దురదృష్టకరం : ఎంఐఎం

నకరికల్లు, ఆగస్టు 19 ప్రభాతవార్త : కేంద్ర ఎన్నికల సంఘం దురదృష్టకరమైన ప్రవర్తన చేస్తుందని ఎంఐఎం పట్టణ అధ్యక్షులు మౌలాలి అన్నారు. బిజెపి గెలుపు కోసం ఈవిఎంలతో పాటు ఓటర్లను సైతం అడ్డంగా మార్చేస్తుందన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రతిపక్షం, సుప్రీం కోర్టు అడిగిన ప్రశ్నలకు ఎన్నికల సంఘం చెప్తున్న వివరణ అనుమానాలను మరింత బలపరుస్తుందన్నారు. పోలింగ్‌కు సంబంధించి సిసి పుట్టేజ్ ఇవ్వాలని కోరితే మహిళల ప్రైవసీని దృష్టిలో పెట్టుకోని ఇవ్వలేమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్, బీహార్, ఇతర రాష్ట్రాలలో జరిగిన పోలింగ్ సరళిపై ఎన్నో అనుమానాలు, ఈవిఎంలపై సందేహాలు ప్రజల్లో పెద్ద ఎత్తున ఉన్నాయని, వాటిని నిరూపణ చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం పై ఉందని మౌలాలి అన్నారు.

## నిరుపేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి కోసమే పి4



నరసరావుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త : రాష్ట్రంలో నిరుపేద కుటుంబాల ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు, రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పి-4 పథకాన్ని అమలు చేస్తున్నారని జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజారంజక పాలనతో కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ప్రజల మనస్సు గెలిచిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను మొత్తాన్ని అమలు చేసి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చిందన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం సంపన్నులుగా మారేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పి-4 అమలు అసాధ్యమంటూ కొందరు ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. అన్ని వర్గాల నుండి పి-4 కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందని జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ తెలిపారు.

## ఎరువుల డీలర్లతో వ్యవసాయ అధికారుల సమావేశం

నకరికల్లు, ఆగస్టు 19 ప్రభాతవార్త : మండలంలోని ఎరువుల డీలర్లతో వ్యవసాయ అధికారి కె.దేవదాస్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను ఎంఆర్‌పి ధరకు మించి అమ్మవద్దన్నారు. రైతులకు అమ్మిన ప్రతి బస్తాకు ఖచ్చితంగా బిల్లులు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే దుకాణదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల నిల్వలపై ఎప్పటికప్పుడు స్టాక్ బోర్డులో తెలియజేయాలన్నారు. యూరియా, డిఏపి, కాంప్లెక్స్ ఎరువులు రైతులకు అవసరమైన మేర అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి దేవదాసు తెలిపారు.

## మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

రొంపిచర్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త : మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరలక్ష్మీదేవి వ్రతం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలోని మహిళా భక్తులతో పాటు పట్టణ, పరిసర ప్రాంతాలలోని భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శ్రద్ధగా పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ ఈవో నలబోతు మాధవిదేవి పర్యవేక్షణలో పసుపు, కుంకుమ, గాజులు, అమ్మవారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ప్రత్యేక పూజలకు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## సెయింటాన్స్‌లో ఈ నెల 21న దివ్యాంగులకు వైద్యశిబిరం

కారంపూడి, ఆగస్టు 19 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఈ నెల 21న గురువారం మాచర్ల సెయింటాన్స్ బాలికల ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు కారంపూడి మండల ఎంఈఓలు జె.అనిల్‌కుమార్, టి.రవికుమార్‌లు తెలిపారు. మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ పిల్లలకు మూగ, చెవిటి, శారీరక వైకల్యం, మానసిక వైకల్యం గల పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి వారికి తగిన ఉపకరణాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ వైద్యపరీక్షలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతున్నాయన్నారు. శిబిరానికి వచ్చిన వారికి ఉచితంగా టీ, స్నాక్స్, భోజనం అందిస్తారన్నారు. ఈ క్యాంప్‌కు వచ్చేవారు రెండు ఫోటోలు, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రేషన్ కార్డు జిరాక్సులు తప్పనిసరిగా తెచ్చుకోవవాలన్నారు. వివరాలకు 9959126142, 9666270018 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

# త్వరలో పార్టీ అనుబంధ కమిటీల నియామకం:

## మాజీ ఎంఎల్‌ఏ శివకుమార్

తెనాలి టౌన్ ఆగస్టు 19 (ప్రభాతవార్త): తెనాలి నియోజకవర్గంలో త్వరలో పార్టీ అనుబంధ కమిటీలను నియమించటం జరుగుతుందని మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు.



మంగళవారం పట్టణంలోని గంగానమ్మ పేటలోగల వైసీపి కార్యాలయానికి ,వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి మరియు గుంటూరు పల్నాడు జిల్లాల అనుబంధ విభాగాల అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి సందర్శించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటు గురించి చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. అలాగే త్వరలో పార్టీ అనుబంధ కమిటీలు పూర్తి చేసేలా దృష్టి సారించాలని కోరారు. మాజీ ఎంఎల్ఏ శివకుమార్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకి అయినా అనుబంధ విభాగాలే పట్టుగొమ్మలని, ప్రణాళికాబద్ధంగా అనుబంధ విభాగాల కమిటీలు ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీడియోగ్రాఫర్స్‌కు గుర్తింపు కార్డులు అందించిన తహసీల్దార్ గోపాలకృష్ణ:

తెనాలి టౌన్ ఆగస్టు 19 (ప్రభాతవార్త): ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా స్థానిక గాంధీనగర్ లోని కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు నందు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మార్వో గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కటింగ్




చేసి అసోసియేషన్ సభ్యులకు ఐడి కార్డ్స్ అందించారు. అనంతరం తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ తిరిగిరాని కాలాన్ని మరుపురాని మధుర క్షణాల్ని మధురంగా అందించే ప్రక్రియ చాయాగ్రహణం అని, అందరికీ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెనాలి జిల్లా వైద్యశాల నందు ప్రసూతి వార్డులో ఫ్రూట్స్ బ్రెడ్స్ పంపిణీ అసోసియేషన్ పెద్దలు కార్యవర్గం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు శుద్ధపల్లి సాంబశివరావు కార్యదర్శి మణికాంత్ (బాబి) అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కూరపాటి రవికుమార్, ధరణికోట శ్రీనివాసరావు సిద్దుల సాయినాథ్ కుర్ర అంక మహేష్ చంద్రశేఖర్ సునీల్ సందీప్ కార్యవర్గ సభ్యులు ఫోటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు

## సినీకార్మికుల డిమాండ్లు అంగీకరించాలి:

## 'మాఏపి' వ్యవస్థాపకుడు దిలీప్ రాజా

తెనాలి టౌన్ ఆగస్టు 19 (ప్రభాతవార్త): గత పదిహేను రోజులుగా జరుగుతున్న తెలుగు సినీ కార్మికుల సమ్మె వలన సినీపరిశ్రమకు భారీగా నష్టం వచ్చిందని ఖిమాఏపీఖి వ్యవస్థాపకులు సినీదర్శకుడు, దిలీప్ రాజా పేర్కొన్నారు. మంగళవారం పట్టణం లోని ఖిమాఏపీఖి కార్యాలయంలో మంగళవ్నార ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సినీ కార్మికులకు, నిర్మాతలకు మధ్య పట్టు విడుపులు ఉంటెనే పరిష్కారం దొరుకుతున్నదన్నారు. దసరా, సంక్రాంతికి విడుదల కావాల్సిన పెద్ద సినిమాలు సమ్మె కార్నణగా సమయానికి విడుదల కావని ఆయన తెలిపారు .ఒకేసారి ముప్పై శాతం



వేతనాలను పెంచితే చిన్న బడ్జెట్ సినిమాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. వందకోట్ల బడ్జెట్ తో ఆర్బోరేలతో సినిమాలు రూపొందించే నిర్మాత సుద్ది ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పద్దతిలో కొంత మేరకు కార్మికుల వేతనాలు పెంచడంతన్నారు పరిశీలించవలసిందిగా ఆయన బడా నిర్మాతలను కోరారు. మూడు నుండి ఐదు కోట్ల బడ్జెట్ తో నిర్మించే చిన్న సినిమాలకు వేతనాలు పెంపు విషయంలో కొంతమేరకు సడలింపు అవసరమన్నారు. నిర్మాత క్షేమంగా ఉంటేనే సినిమాలు బయటకొస్తాయని ఆయన తెలిపారు. అలాగే కష్టపడి పనిచేసే కార్మికుల జీవన పరిస్థితులపై పెద్ద సినిమాల నిర్మాతలు కార్మికులను కుటుంబ సభ్యులుగా పరిగణించి వేతనాలు పెంపు అంశాలపై ఫోకస్ పెట్టాల్సిందిగా దిలీప్ రాజా మనవి చేశారు. ప్రస్తుతం లైట్ బాయిస్ కు రూ. 1450/ నుండి పదిహేను శాతం పెంచడానికి నిర్మాతలు పరిశీలిస్తున్నారని ఆయన తెలిపారు. ముప్పైశాతం పెంచాలనే కార్మికుల డిమాండ్ ను ఉపసంహరించుకుని నిర్మాతల శ్రేయస్సు గురించి ఆలోచించాల్సిందిగా కార్మికులను కోరారు. టీ కప్పులో తుఫానులా ప్రస్తుత వివాదాలను వీడి అందరూ కలిసి కుటుంబ సభ్యులుగా పని చేసుకుందామని దిలీప్ రాజా సూచించారు. మంగళవారం హైదరాబాద్ లో జరుగుతున్న జనరల్ బాడీ సమావేశంలో ఇరు పక్షాలు సయోధ్యను పాటించి సమ్మె విరమణకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాఏపి సభ్యులు సునీత(హైదరాబాద్) మిలటరీ ప్రసాద్, ఎర్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది: తేదేపా నేత పూర్ణచంద్

తెనాలి టౌన్ ఆగస్టు 19 (ప్రభాతవార్త): పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందని, ఇన్నాళ్లు ఫ్యాక్షనిజంతో జరిపిన ఎన్నికలను ఈసారి తెలుగుదేశం పార్టీ నిలువరించిందని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధికారప్రతినిధి ఈదర పూర్ణచంద్ పేర్కొన్నారు.



ఇటీవల జరిగిన జెడ్పిటీసీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పిటిసి స్థానాల్లో ప్రజాబ్యాలెట్ లో డిపాజిట్ కోల్పోయి మతిస్థిమితం తప్పి తప్పుడు మాటలు మాట్లాడుతున్న వైసిపి పార్టీ నాయకులు, రీపోలింగ్ జరిపి కేంద్ర బలగాలు ను తీసుకొచ్చి ఎలక్షన్ జరప మంటున్న వైసీపీ నాయకులకు మీ నాయకుడు ఎమ్మెల్యే కు రాజీనామా చేసి నిలబడమని, కేంద్రబలగాలతో ఎలక్షన్ నిర్వహిద్దాం, డిపాజిట్ తెచ్చుకోండి అని ఈదర పూర్ణచంద్ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా అక్కడి ఓటర్లు బ్యాలెట్ తో పాటు ముప్పై సంవత్సరాల తర్వాత నా ఓటు నేను వేసుకున్నాను, అధికార యంత్రంగానికి ధన్యవాదములు అని చీటీలు వేశారు అంటే ఇన్నాళ్లు జరిగింది ఏమిటో అర్థం కావడం లేదా, ఇక ముందు వైసీపీ క్రికెట్ టీం బ్యాడ్మింటన్ టీమ్ అవ్వటం ఖాయమని, పులివెందుల ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలను భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్ల కు ధన్యవాదములు తెలుపుతున్నామని, ఈదర వెంకట పూర్ణ చంద్

## రేటూరు , అప్పాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది

కాకుమాను ఆగస్టు 19(ప్రభాతవార్త): మండల పరిధిలోని రేటూరు , అప్పాపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి వి.సుధాకర్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు సునీత మాట్లాడుతూ వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించడం జరిగినది. జీవ శిలీంధ్ర నాశిని సుడోమోనస్ వరిలో వాడటం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. మరియు పచ్చి రొట్ట ఎరువులు వాడడం వల్ల ఎరువులు మోతాదు తగ్గించవచ్చు అని రైతులకు తెలియజేశారు. అలానే



వ్యవసాయ శాస్త్రవేత్త దయానా మాట్లాడుతూ వరిలో ఎరువుల సమగ్ర యాజమాన్య పద్ధతులు మరియు వరిలో వచ్చే తెగుళ్ల గురించి రైతులకు వివరించడం జరిగింది. సహాయ వ్యవసాయ సంచాలకులు పొన్నూరు రామకోటేశ్వరి మాట్లాడుతూ ప్రధాన పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రంలో వి. ఎ. ఎ. ని కలిసి పంట నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు . ఇంకా ఎవరికైనా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులు ఎవరైనా లబ్ది పొందకపోతే రైతు సేవా కేంద్రంలో గ్రీవెన్స్ లో నమోదు చేసుకోవడానికి నేడు ఆఖరి తేదీ కనుక ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి వి. సుధాకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు రామకోటేశ్వరి , రైతు శిక్షణ కేంద్రం గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ. సునీత , వ్యవసాయ శాస్త్రవేత్త దయానా , రైతులు,వి ఎ ఎ లు, తదితరులు పాల్గొన్నారు

# పొలాల్లో నీటిని బయటకు వెళ్లగొట్టాలి

## -మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు

పొన్నూరు, ఆగస్టు 19,ప్రభాతవార్త: ప్రస్తుతం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొంట పొలాల్లో నీరు నిలిచిపోయి ఉన్నాయని, వాటిని బయటకు వెళ్ళగొట్టాలని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని పొన్నూరు, నిడుబ్రోలు గ్రామాల్లో



మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నీటిని బయటకు పంపించిన తర్వాత ఎకరాకు 35కిలోల యూరియా, 15కిలోల పొటాష్ ఎరువులను వేయాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల అధిక తేమశాతం మొత్తాన్ని యూరియా గ్రహిస్తుందన్నారు. తద్వారా పంటకు నష్టం జరగకుండా కాపాడుకోవచ్చన్నారు. పొటాష్ వేసినందువల్ల పంటకు తెగులు నుండి పురుగులు బారి నుండి తట్టుకునే శక్తి వస్తుందన్నారు. పైపాటుగా ఎం45 లీటర్ నీటికి మూడు గ్రాములు లేదా కార్బడిజయం లీటర్ నీటికి ఒకటిన్నర గ్రాము చొప్పున పిచికారి చేయాలని సూచించారు. అదేవిధంగా పొటాష్ నైట్రేట్ 19.19.19 ఎకరాకు ఒక కిలో చొప్పున పైపాటుగా పిచికారి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు పడనివారు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. రైతు ఆధార్‌కార్డు, పాసుపుస్తకము తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళ్ళాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి టి.దివ్యశ్రీ, ఎంపీఈవోలు షేక్ రేష్మ, ఎస్.సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

## వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్‌కు ఉత్తమ సేవా అవార్డు



తిరువూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త : 79వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా మంగళవారం సాయంత్రం మల్లేల గ్రామీణ పశువైద్యశాల వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ మిరియాల గోపాలకృష్ణ వృత్తిలో ప్రదర్శించిన ఉత్తమ సేవలకు గాను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా ఉత్తమ సేవా ప్రశంస పత్రం అందచేశారు.

## డిఎం సుబ్రహ్మణ్యంకు అవార్డు ప్రశంసా పత్రం

ఎ కొండూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు ఆర్టీసి డిపో మేనేజర్ ఎ




సుబ్రహ్మణ్యంకు ఆగష్టు 15 స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ సేవలు అందించినందుకు గాను డిఎం సుబ్రహ్మణ్యంకు కలెక్టర్ జి లక్ష్మీశ ప్రశంసా పత్రంతో పాటు అవార్డు అందచేశారు. ఆ క్రమంలో డిపో మేనేజర్ ఎ సుబ్రహ్మణ్యంను డిపో సిబ్బంది గ్యారేజి కార్మికులు పలువురు అభినందించారు.

## స్త్రీశక్తి బస్సు పథకాన్ని నీరుగారుస్తున్న తిరువూరు ఆర్టీసి కండక్టర్లు డ్రైవర్లు

### - హరిజనవాడ వద్ద ఆగని బస్సులు

ఎ కొండూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త :రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు ఆర్టీసి డిపో డ్రైవర్లు కండక్టర్లు ప్రారంభించిన 2,3 రోజుల్లోనే నీరుగారుస్తున్నారు. తిరువూరు ఆర్టీసి డిపో నుండి మంగళవారంఉదయం ఎ కొండూరు మైలవరం మీదుగా విజయవాడ వెళ్ళే 5996 నెంబరు గల బస్సు చీమలపాడు హరిజనవాడ వద్ద చిరువ్యాపారాలు చేసుకుని జీవనం సాగించే దళిత మహిళలు కొండపల్లి చిరువ్యాపారం చేసుకునేనిమిత్తం బస్సు ఆపే నిమిత్తం చేయి ఎత్తగా బస్సు ఆపకుండా వెళ్ళిందని అలాగే సోమవారం కూడా ఇదే పరిస్థితి ఎదురైందని దళిత మహిళ ప్రయాణీకులు మంగళవారం ప్రభాతవార్త వద్ద వాపోయారు. ఇకపైన ఈ స్త్రీశక్తి చేయేత్తిన చోట బస్సులు ఆగే విధంగా డ్రైవర్, కండెక్టర్‌పై చర్యలు తీసుకుని చిరువ్యాపారం సజావుగా సాగే విధంగా చర్యలు తీసుకుని ఆదుకోవాలని హరిజనవాడకు చెందిన స్త్రీశక్తి దళిత మహిళ ప్రయాణీకులు విజయవాడ ఆర్టీసి ఆర్ఎంకు తిరువూరు డిఎంకు ఉన్నతాధికారులకు చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు.

## సిఎం చంద్రబాబుకు మహిళల ప్రశంసలు

ఎ కొండూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆగష్టు 15న అట్టహాసంగా ప్రవేశపెట్టి ప్రారంభించిన స్త్రీశక్తి బస్సులో తిరువూరు



ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు డిపోలో స్త్రీశక్తి బస్సు మంగళవారం ఎక్కి ఎ కొండూరు చీమలపాడు మైలవరం మీదుగా ఇబ్రహీంపట్నం వరకు ప్రయాణం చేసి మహిళలకు ఉచిత బస్సు పథకంద్వారాపొందే లబ్దిని ప్రయాణీకులకు వివరించి మహిళ ప్రయాణీకులతో సరదాగా ప్రయాణం చేసి వారిని ఉత్తేజ పరిచారు. ఈ స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన సిఎం చంద్రబాబు రాష్ట్రం ఆర్థికంగా లోటు బడ్జెట్‌లో ఉన్నా సూపర్ 6 పథకాల అమలులో సిఎం చంద్రబాబు సూపర్ హిట్‌గా అమలు చేసినట్టు సిఎం చంద్రబాబు అడ్మినిస్ట్రేటర్ అని మహిళ ప్రయాణీకులు ప్రశంసించారు. అలాగే ఎసి కారులో ప్రయాణించే ఎమ్మెల్యే శ్రీనివాసరావు తిరువూరు డిపో నుండి మైలవరం మీదుగా ఇబ్రహీంపట్నం వరకు ఎటువంటి దర్పం ప్రదర్శించకుండా సాదాసీదా శ్రామికుడిలా బస్సులో ప్రయాణించడం పట్ల పలువురు మహిళ ప్రయాణీకులు ఎమ్మెల్యే వైఖరిని అభినందించారు.

# జగ్గయ్యపేటలో వరద ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే రాజగోపాల్

జగ్గయ్యపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త : భారీ వర్షాలతో సంభవించిన వరద ముంపు ప్రభావిత ప్రాంతాలను మంగళవారం జగ్గయ్యపేటలో వరద ముంపు ప్రాంతాలను స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. ఈసందర్భంగా వరద ముంపుకు గురైన నివాశితులను కలుసుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి



తెలుసుకున్నారు. వరదల కారణంగా దెబ్బతిన్న మంచినీటి సరఫరా పైపులైన్ల మరమ్మతులను రెండు రోజుల్లో పూర్తిచేసి నీటి సరఫరా పునరుద్ధరించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు అధికారులను ఆయన ఆదేశించారు. ఇంకా తుఫాను కారణంగా రానున్న రెండు రోజుల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాధితులకు ప్రభుత్వం భరోసా నిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కట్టా వెంకట నరసింహారావు, మైనేని రాధాకృష్ణ, నకిరికంటి వెంకట్, పూసల పుల్లారావు, యామర్తి బోసు యాదవ్, గింజుపల్లి కృష్ణ, గడ్డం రాంబాబు, కొత్త నాగరాజు, మున్సిపల్ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ రిటైర్డు ఉద్యోగి పూసపాటి వెంకన్న మృతి

జగ్గయ్యపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త :జగ్గయ్యపేట మున్సిపల్ రిటైర్డు ఉద్యోగి పూసపాటి వెంకటేశ్వర్లు (వెంకన్న) ఆకస్మికంగా మృతి చెందగా జనసేన పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు



సామినేని ఉదయభాను అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. పట్టణంలోని రజక బజారులో నివసిస్తున్న వెంకన్న సామినేని కుటుంబ అభిమాని. ఉదయభాను, ఆయన సతీమణి విమల కలిసి మంగళవారం వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రఘాడ సంతాపం, సానుభూతి తెలిపారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అభిమానిపట్ల ఆదరణతో ఉదయభాను ఆయన అంత్యక్రియల్లో పాల్గొనటంతోపాటు పాడె మోశారు.

# ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా, కాంగ్రెస్ వామపక్షాల కొవ్వొత్తుల ర్యాలీ

తెనాలి టౌన్ ఆగస్ట్ 19 (ప్రభాతవార్త):

కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం పిలుపు మేరకు, పట్టణంలో కాంగ్రెస్ సీపిఐ సీపిఎం పార్టీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి నిర్వహించిన ఈర్యాలీలో "ఓట్ల దొంగతనం ఆపాలినరేంద్ర మోదీ గద్దెదిగాలి"అనే నినాదంతో పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ, స్వాతంత్రసంస్థ ఐన ఎన్నికల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం తన గుప్పిట్లో పెట్టుకుని వ్యవహరిస్తుందని, ఓట్లచోరిపై తమపార్టీ అధినేత రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే తిరిగి కేసులు పట్టటాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ఎక్కడైతే ప్రతిపక్షపార్టీలు బలంగా ఉన్నాయో




అక్కడ ఓట్లు తారుమారు చేశారని, కేంద్రప్రభుత్వం ఎన్నికల సంఘంతో కుమ్మక్కై, కుట్ర పూరితంగా ఈఓట్లు చోరీ చేశారని డాక్టర్ సాంబశివుడు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు శశి, మండల పార్టీ అధ్యక్షులు ఎం. ప్రసాద్, సీపిఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, సీపిఐ నాయకులు చేరుకుమల్లి సింగారావు, కే.బాబు ప్రసాద్, మద్దినేని కిరణ్ బాబు, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాశం వెంకటేష్, గండు శివ, భీమా రమేష్, మాదాల పూర్ణచంద్రరావు, కే. కోటేశ్వరరావు, పిల్లి ప్రభాకర్, సీహెచ్.అయ్యప్ప, బీ. శ్రీను, పూలే రామ్, అనిల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంపిడిఓలు పాలనపై పట్టు సాధించాలి

### -జిల్లా పంచాయితీ అధికారి వెంకటనాగసాయికుమార్

పొన్నూరు, ఆగస్టు 19,ప్రభాతవార్త: నూతనంగా నియమితులైన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాలనపై పట్టు సాధించేవిధంగా తర్ఫీదు పొందాలని జిల్లా పంచాయితీ అధికారి బి.వెంకట నాగసాయి కుమార్ సూచించారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం



క్షేత్రస్థాయి పరిశీలనపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయితీ అధికారి వెంకట నాగసాయి కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన ఎంపిడిఓలు పనిని సమర్ధవంతంగా చేయడానికి, అవసరమైన నైపుణ్యాలను, జ్ఞానం, తదితర విషయాలను మెరుగు పరచుకునేందుకు ఈ ఫౌండేషన్ శిక్షణ దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గ్రామాల అభివృద్ధి సమర్ధవంతమైన శానిటేషన్‌తోనే ముడిపడి ఉందన్నారు. ఈ క్షేత్ర పర్యటన ద్వారా మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. పారిశుద్ధ్యం పంచాయితీల ప్రధాన లక్ష్యమన్నారు. ఇందుకు గ్రామాల్లో ప్రతి ఇంటి నుండి ఘన వ్యర్థాల సేకరణ, వాటి నిర్వహణ ఒక నిరంతర అధ్యయనమన్నారు. ఇల్లు, దుకాణాలు, బజార్లు, రహదారులు, బహిరంగ ప్రదేశాలు, మురుగు కాలువలు తదితర ఏ ఇతర ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా, గ్రామంలో మరెక్కడా చెత్త డంపు చేయకుండా హరిత రాయబారం ద్వారా చెత్త సేకరణ చేయాలన్నారు. చెత్తను వేరు చేసి తడి,పొడి చెత్తను సేంద్రియ ఎరువుగా, పొడి చత్తెను షెడ్డు ద్వారా విక్రయించడం, రీసైకిల్ చేసి సంపద సృష్టించడమే ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్ర లక్ష్యమని చెప్పారు. దీనికి సంబంధించి పంచాయితారాజ్‌శాఖ ఉన్నతాధికారులు 10సూత్రాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కర పంచాయితీరాజ్‌శాఖ సిబ్బంది వీటిపై అవగాహన పెంచుకొని పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామస్థాయిలో పంచాయితీకార్యదర్శి విధిగా నిర్వహించాల్సిన 10ప్రశ్నలు వాటి కార్యాచరణ వివరాలను డిపిఆర్సీ రీసోర్స్ పర్సన్లు అనూరాధ, నిరంజన్ వివరించారు. ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ వడ్లమూడిలో డిపిఓ, డిఎల్పీఓ శిక్షణ ఉమ్మడి 5జిల్లాల ఎంపిడిఓలు కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా, ఉమ్మడి జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డిప్యూటీ ఎంపిడిఓ ఎం.రవిశంకర్, చేబ్రోలు, వడ్లమూడి పంచాయితీ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జి.సుభాష్‌చంద్రబోస్, ఎంసిఓఎస్‌బిఎం జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్వల్పకాలిక వరినారు నాటుకోవాలి

పొన్నూరు, ఆగస్టు 19,ప్రభాతవార్త: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి వెదసాగు దెబ్బతిన్న రైతులు స్వల్పకాలిక వరినారు తెచ్చుకొని నాటుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యనారాయణ సూచించారు.



ఇటీవల కురిసిన వర్షాలకు వరివెదసాగు దెబ్బతిన్న గ్రామాలైన గోళ్ళమూడిపాడు, దండమూడి, పచ్చలతాడిపర్రు, నిడుబ్రోలు వరి పొలాల్లో మంగళవారం శాస్త్రవేత్తల బృందం పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్ఐఆర్-3354, ఆర్ఎన్-515088, ఎంటియు-1282,1224 రకాల నారు తెచ్చుకొని పలచగా నాటుకోవాలని సూచించారు. బెంగాల్ నాటు పద్ధతిన నాటుకొంటే బాగుంటుందన్నారు. నాటుకున్న తర్వాత యూరియా 20కిలోలు, పొటాష్ 15కిలోలు ఎరువులను మొదటి దఫాగా అందించాలన్నారు. ముఖ్యంగా ముంపుకు గురైన పొలాల్లో నీటిని వీలైనంత త్వరగా బయటకు వెళ్ళబెట్టుకోవాలని సూచించారు. దెబ్బతిన్న పొలాలను దమ్ము చేసుకొని మొలకెత్తిన విత్తనాలను కూడా వెదజల్లుకోవచ్చని సూచించారు. ఏ పొలంలో అయితే ఎరువులు వేయలేదో ఆ పొలాల్లో పంట కుళ్ళిపోకుండా బాగుందని తెలిపారు. శాస్త్రవేత్తల బృందం రైతులను ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పంటల ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ డి.మోహనరెడ్డి, డాక్టర్ ఎస్.ప్రతిభాశ్రీ, డాక్టర్ ఆర్ క్రిష్ణనాయక్, డాక్టర్ పి.కిషోర్ వర్మ, డాక్టర్ రాజేష్ చౌదరి, మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, ఎంపీఈఓ ఎస్.సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

## సమాజానికి ఫోటోగ్రాఫర్ల సేవలు అవసరం


పొన్నూరు, ఆగస్టు 19,ప్రభాతవార్త: సమాజానికి ఫోటోగ్రాఫర్ల, వీడియో గ్రాఫర్ల సేవలు ఎంతో అవసరం ఉందని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఫోటోగ్రాఫర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య



అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు కూడా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలన్నారు. ఫ్రోటోగ్రాఫర్లందరూ సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకునే వీలు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్లు పలువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్‌జిలాని, కార్యదర్శి దేశిరాజు బాలగంగాధరతిలక్, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులకు పేస్ వాష్ కార్యక్రమం

బాపట్ల, ఆగస్టు 19,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు పోలీసులు వాహనదారులకు ఫేస్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చందోల్ లో హైవేపై బాపట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో చందోలు ఎస్సై ఎంవి శివకుమార్ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాల గురించి వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెడ్డిపాలెం టోల్ ప్లాజా వద్ద వాహనాలను



రోడ్డు పక్కన నిలిపి డ్రైవర్, క్లీనర్‌లకు నీటినిచ్చి మొఖం కడుక్కునే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వేళల్లో వాహనాలను నడిపేవారు నిద్ర వస్తే కొద్దిసేపు పక్కన నిలుపుకొని పేస్ వాష్ చేసుకొని వెళ్ళాలన్నారు.

## 24న వెంకయ్యస్వామి ఆరాధనా మహోత్సవం

పొన్నూరు, ఆగస్టు 19,ప్రభాతవార్త: మండల పరిధిలోని కట్టెంపూడి అడ్డరోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ షిరిడి సాయి, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి మందిరంలో ఈ నెల 24వ తేదీన భగవాన్ శ్రీవెంకయ్యస్వామివారి ఆరాధనా మహోత్సవాలు జరుగుతాయని మందిర కమిటి అధ్యక్ష, కార్యదర్శులు కొల్లిపర సాంబశివరావు, పబ్బిశెట్టి త్రినాథ్‌గుప్త తెలిపారు. 24వ తేదీ ఉదయం 9గంటలకు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, 10గంటలకు హారతి, నైవేద్యం, భజన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

## మాచర్లలో బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తు చేసుకోండి: ఎక్సైజ్ సీఐ

మాచర్ల, ఆగస్టు 19 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాల కాల పరిమితికి మాచర్లలో బార్ అండ్ రెస్టారెంట్‌లు నడుపుకోవడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తూ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె.మణికంఠ గెజిట్ ప్రకటన చేసినట్లు మాచర్ల సీఐ వెంకటరమణ తెలిపారు. 2025 సెప్టెంబరు 1 తేదీ నుంచి 2028 ఆగస్టు 31 వరకు మూడు సంవత్సరాల పరిమితికి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఒక్కో దరఖాస్తు రూ.5 లక్షలు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మాచర్ల మున్సిపాలిటీ బార్ అండ్ రెస్టారెంట్‌కు మొదటి సంవత్సరం లైసెన్సు ఫీజు రూ.55 లక్షలు, రెండో సంవత్సరానికి రూ.60 లక్షల 50 వేలు, మూడో సంవత్సరానికి రూ.66 లక్షల 55 వేలు లైసెన్సు ఫీజు చెల్లించాలన్నారు. ఈ నెల 26 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులో ఏమైనా సమస్యలు ఉంటే నరసరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ నెల 28న జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో దరఖాస్తులు ఎంపిక చేస్తారని మాచర్ల ఎక్సైజ్ సీఐ వెంకటరమణ తెలిపారు.

# అబద్ధాలు,అసత్య ప్రచారాలకు కేరాఫ్ జగన్

### మంత్రి అచ్చెన్నాయుడు,చీఫ్‌విప్ జీ.వీ,మాజీ మంత్రి,ఎమ్మెల్యే కన్నా,జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన ధ్వజం

వినుకొండ,ఆగస్టు19,ప్రభాతవార్త: అబద్ధాలు,అసత్య ప్రచారాలకు కేరాఫ్ అయిన వై.ఎస్ జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా సిగ్గు రాలేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. మంగళవారం వినుకొండ పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డు నందు గల వ్యవసాయ మార్కెట్‌యార్డు నందు ఏర్పాటు చేసిన మెగా కిసాన్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. రైతులతో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి,ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ,ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు,మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రాహ్మరెడ్డి,జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తదితర జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన విత్తనాలు,ఎరువులు,పురుగుమందులు,డ్రోన్లు,డ్రిప్ ఇరిగేషన్,ట్రాక్టర్లు,స్ప్రేయర్లు,పశుసంవర్ధక,పట్టుపరిశ్రమ,ఉద్యానశాఖ,మత్స్యశాఖ,బ్యాంకింగ్ తదితర రంగాలకు చెందిన 150 స్టాళ్లు ఏర్పాటు చేశారు. శాస్త్రవేత్తలు రైతులకు పంటల రక్షణ,అధిక దిగుబడి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు,ఉద్యాన పంటల పెంపకం,డెయిరీ,ఫౌల్ట్రీ,చేపలు,గొర్రెల పెంపకం వంటి అనుబంధ రంగాల్లో లాభాలు సాధించే మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా వేదికపై నుంచి మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ 43 ఏళ్ళ చరిత్రలో అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పని చేసిందన్నారు. 2019లో తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన వైకాపా రాష్ట్రంలోని అన్ని రంగాలను నాశనం చేసిందన్నారు. వ్యవసాయ రంగం, రైతులు జగన్ అరాచక పాలనలో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి



ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సంక్షేమానికి పెద్ద వేసిందన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి,రైతుల ఆధాయం రెట్టింపుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సబ్సిడీపై ఎరువులు,విత్తనాలు,యంత్ర పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. మారుతున్న పంటల సరళీ సాగు పద్దతులపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటలు సాగు చేసే విధంగా అవగాహన కల్పించి రైతులు ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తద్వారా రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిచాలంటే వ్యవసాయం, పంటల విధానంలో మార్పులు రావాలన్నారు. రైతులకు అవగాహన కల్పించి ఉద్యాన పంటల సాగును పెంచేలా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం మాజీ మంత్రి,ఎమ్మెల్యే కన్నా, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెనతోపాటు తదితర నేతలు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. రాజధాని అమరావతిపై కూటమి ప్రభుత్వ పాలనపై వైకాపా తప్పుడు ప్రచారాలు చేస్తుందని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు వేలాదిగా పాల్గొన్నారు.


# ఘనంగా నరసరావుపేట, రొంపిచర్ల మార్కెట్‌యార్డు ఛైర్మన్‌ల ప్రమాణ స్వీకారం

### - వందల ట్రాక్టర్లతో భారీ ర్యాలీ- హాజరైన మంత్రి అచ్చెన్నాయుడు

నరసరావుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త : నరసరావుపేట, రొంపిచర్ల మార్కెట్‌యార్డు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. పట్టణంలో వినుకొండ రోడ్డు నుండి టౌన్‌హాలు వరకు వందలాది ట్రాక్టర్లతో భారీ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ ముందు భాగాన రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, యార్డు ఛైర్మన్‌లు పూనాటి శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ కాసా ఆంజనేయులు, సీనియర్ పార్టీ నాయకులు కొల్లి బ్రహ్మయ్యలు




ప్రజలకు అభివాదం చేస్తూ పాల్గొన్నారు. ప్రమాణ స్వీకార సభలో రాష్ట్ర చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు, జిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు వర్ల రామయ్య పాల్గొని మాట్లాడారు. వర్ల రామయ్య మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో కనిపిస్తుందన్నారు. రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రజా సేవ కోసమే ఎన్టీఆర్ టిడిపి పార్టీని స్థాపించారని తెలిపారు. గత ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అమాయక ప్రజలను జైలులో పెట్టిందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేర్చామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ నరసరావుపేట పోరాటాల గడ్డ అని తెలిపారు. ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా ధైర్యంగా ముందుకు సాగామన్నారు. ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు కుటుంబం తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం నుండి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసిందని తెలిపారు. పల్నాడు ప్రాంతంలో రైతుల సంక్షేమం కొరకు కృషి చేస్తామన్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ డబ్బులు అందించిందన్నారు. సబ్సిడీపై అనేక రకాల పనిముట్లు అందిస్తున్నామని తెలియజేశారు. యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమం

సత్తెనపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త : మండలంలోని లక్కరాజుగార్లపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ బరువు నేల్లో



విత్తిన పత్తి అధిక వర్షాలకు లోనైతే వెంటనే నీటిని కాలువల ద్వారా బయటకు తీసి వీలైనంత త్వరగా ఎద సేద్యం చేసి భూమి ఆరేటట్లు చేసుకోవాలన్నారు. ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను అదనంగా వాడుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రత్తి పైరులో తామర పురుగు గమనించడం జరిగిందన్నారు. దాని నివారణకు ఎసిఫేట్ 350 గ్రాములు లేదా ఏసిటామిప్రిడ్ లేదా థైయోమిథాక్సమ్ 40 గ్రాములు లేదా పిప్రోనిల్ 400 మిల్లీ గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పది రోజులకు మందులను మార్చుతూ పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్కరాజుగార్లపాడు గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ

సత్తెనపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త : పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగింది. స్వామివారి హుండీ పగులకొట్టి చోరీకి దుండగులు పాల్పడ్డారు. ఆలయంలో సిసి పుటేజ్‌కు సంబంధించి వైర్లను దొంగలు కట్ చేసి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఘటనపై ఆలయ అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



## లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన సదస్సు

తాడేపల్లి,ఆగష్టు 19,ప్రభాతవార్త : లైంగిప వేధింపుల నివారణ చట్టం-2013 గురించి కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్,మార్పు ట్రస్టు,పాయింట మీడియా సంయుక్తాధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.సదస్సుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పని ప్రదేశాల్లో,చదువుకునే ప్రదేశాల్లో మహిళల భద్రత,లింగ సమానత్వం గురించి అవగాహన కల్పించారు.హైకోర్టు న్యాయవాది అనుపమ దార్ల,మార్పు ట్రస్ట్ డైరెక్టర్ రావూరి






సూయిజ్‌లు గౌరవాతిధులుగా పాల్గొని లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013 గురించి ప్రసంగించారు.రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ 10మంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న ప్రతిసంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు ను లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013 తప్పనిసరి చేసుందన్నారు.ఫిర్యాదులను దాఖలు చేయడానికి చట్టపరమైన విధానాలు,వేధింపులను నివారించడంలో యజమానుల పాత్ర,దర్యాప్తులో గోప్యత ప్రాముఖ్యతను వివరించారు.హైకోర్టు న్యాయవాది అనుపమ దార్ల మాట్లాడుతూ నిజ జీవిత అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో వర్సిటీ కార్యదర్శి కోనేరు కాంచనలత,విసి డాక్టర్ జి.పార్ధసారధి వర్మ,ఆచార్య విసి డాక్టర్ ఎన్.వెంకటరామ్,డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ కె.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్‌ఎస్ ప్రసాద్,డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్,ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ రూత్ రమ్య,కోకన్వీనర్ డాక్టర్ కె.సోని తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ గుంటూరుజిల్లా సహాయ కార్యదర్శిగా చిన్ని తిరుపతయ్య ఎన్నిక

తాడేపల్లి,ఆగష్టు 19,ప్రభాతవార్త : సిపిఐ గుంటూరుజిల్లా సహాయ కార్యదర్శిగా చిన్ని తిరుపతయ్య ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కులను కాపాడుకోవడమే తమ ప్రధానలక్ష్యమన్నారు. ప్రజల సంక్షేమానికి విరుద్ధంగా,కార్పొరేట్



అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను ఖండించారు.ప్రజా సమస్యలను విస్మరిస్తూ నిరుద్యోగం,ధరల పెరుగుదల,రైతుల కష్టాలకు పరిష్కారం చూపకుండా కేంద్రం ప్రజావ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటుందని ఆయన విమర్శించారు.ఈ పరిస్థితుల్లో సిపిఐ పార్టీ ప్రజలతో కలిసి,ఉద్యమాలతో ప్రభుత్వాలను ప్రశ్నిస్తుందని స్పష్టం చేశారు.ప్రజా పోరాటాల ద్వారానే మార్పు సాధ్యమనిచెబుతూ, కార్మికులు,రైతులు, విద్యార్థులు,యువత, మహిళలు కలసి పోరాడితేనే బలపడుతుందని ఆయన నొక్కి చెప్పారు.ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,ప్రజాసంఘాల ప్రతినిధులు,ప్రముఖులు అభినందనలు తెలిపారు.చిన్ని తిరుపతయ్య తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ,పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగుతానని అన్నారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమం


కొల్లూరు, ఆగస్టు 19 (ప్రభాతవార్త) : గ్రామంలో మండల వ్యవసాయశాఖ అధికారి వి.నరేంద్రబాబు మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు ఈపంట నమోదు చేసుకొనుటకు సర్వర్ వచ్చి ఉన్నది, ప్రతి ఒక్క రైతు పొలం పాస్ పుస్తకం ఆధార్ కార్డు మరియు ఫోన్ నెంబర్ తీసుకుని మీకు అందుబాటులో ఉన్న రైతు



సేవా కేంద్రంలో విఎఏ మరియు విహెచ్ఎలకు మీ వివరాలు అందించి వరి పంట ఏది వేశారో తెలియజేసి ప్రతి ఒక్కరూ ఈ పంట నమోదు చేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. మండల హార్టికల్చర్ అధికారి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ హార్టికల్చర్ క్రాఫ్స్ ప్రతి రైతు ప్రతి ఒక్క సెంటును ఈ పంట నమోదు చేసుకోవాలని తెలియజేశారు. మురళీకృష్ణ , వ్యవసాయ విస్తరణ అధికారులు, బిఎస్.వంశీ, విఏఏలు మరియు రైతులు పాల్గొన్నారు.

## మెగా కిసాన్ మేళాలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త : వినుకొండ వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన మెగా కిసాన్ మేళా కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరపు అచ్చంనాయుడు, ఎమ్మెల్యేలు జి.వి.ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చంనాయుడు మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశంపార్టీ ప్రజా సేవ కోసమే




పుట్టిందన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్ళుగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించారన్నారు. కానీ వైకాపాలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్ళారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం ,పరిశుభ్రతపై అవగాహన

తాడేపల్లి,ఆగష్టు 19,ప్రభాతవార్త : కెఎల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటిస్ (సీఈఏ) ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం మరియు పరిశుభ్రత పై అవగాహన పై చిర్రావూరు గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు.మన ఆరోగ్యం మన చేతుల్లో అని వర్షాకాలంలో పరిశుభ్రత పాటించకపోతే అనేక వ్యాధులు ప్రబలుతాయని పరిశుభ్రత పాటించడం వల్ల జలుబు,ఫ్లూ మరియు ఇతర ఇన్ఫెక్షన్ నుండి రక్షణ పొందవచ్చిని మన పరిసర ప్రాంతాల్లో మురుగు వాటర్ నిల్వ ఉండకుండా చెత్తా చెదారం లాంటివి నిల్వ ఉండకుండా చూసుకోవాలని విద్యార్థి విభాగపు అధికారి డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్ తెలిపారు.మురుగు నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో చెక్కపొట్టు,వరిపొట్టుల్లో కిరోసిన్ లాంటివి కలిపి ఉండలు చేసి వేస్తే దోమల ఉత్పత్తి తగ్గుతుందన్నారు.వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం అని సీఈఏ విద్యార్థులు చిలువూరులోని ఇంటింటికి తిరిగి తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు,డాక్టర్ ఎస్‌వెంకటేశ్వర్లు,డాక్టర్ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.ఈ కార్యక్రమం నిర్వహించినందుకు వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్ధసారధి వర్మ,ఆచార్య డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ కె.సుబ్బారావు,విద్యార్థుల విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్,విద్యార్థుల విభాగం అడ్వైజర్ డాక్టర్ హబీబుల్లాఖాన్ తదితరులు అభినందించారు.

## కృష్ణానదికి పెరుగుతున్న వరద..లంకవాసులు టెన్షన్..టెన్షన్



కొల్లిపర,అగష్టు 19 ప్రభాతవార్త: ప్రకాశం బ్యారేజీ నుండి 5 లక్షల క్యూసెక్కులు పైగా నీటిని కృష్ణానది దిగువకు విడుదల చేసారు.దీంతో వరద ఉధృతి మరింత పెరుగుతుండటంతో లంకవాసులు టెన్షన్..టెన్షన్ పడుతున్నారు.వరద



మరింత పెరిగితే పంటలు నష్టపోవలసి వస్తుందని ఆందోళనలో ఉన్నారు.మండల యంత్రాంగం కూడా అప్రమత్తం అయ్యి లంకవాసులు తగు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు.కొల్లిపర తహశీల్ధార్ గుమ్మడి సిద్ధార్ధ,ఎస్ఐ కోటేశ్వరరావు మండలంలోని బొమ్మువానిపాలెం,కొల్లిపర,అన్నవరం లంక గ్రామాల్లోని రేవులను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు.కృష్ణానదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేసారు.పడవ నడిపే జాలర్లకు తగిన జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.కృష్ణానదికి వరద ఉధృతి పెరగటంతో ముందు జాగ్రత్త చర్యగా ప్రజలను అప్రమత్తం చేయటానికి వీఆర్‌ఓలను,పోలీసులను రేవుల్లో ఏర్పాటు చేసారు.

## స్వమిత్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

కొల్లిపర,అగష్టు 19 ప్రభాతవార్త: స్వమిత్ర సర్వేకు ప్రజలు సహకరించాలని డిప్యూటి ఎంపీడీఓ భార్గవ్ అన్నారు.మంగళవారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో



ఇంజనీరింగ్ అసిస్టెంటుల తో, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి సర్వేపై తీసుకో వలసిన జాగ్రత్తల గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ స్వమిత్ర సర్వేతో పంచాయతీలకు సంభందించిన ఆస్తుల విషయంలో స్పష్టత రానున్నట్లు చెప్పారు.ప్రజలకు కూడా స్థలాలపై యాజమాన్య హక్కులు కల్పించేందుకు గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు.స్వమిత్ర సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు.కార్యక్రమంలో పరిపానాధికారి ప్రతాపరెడ్డి,సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాజుపాలెం, ఆగస్టు 19 ప్రభాతవార్త : మండల కేంద్రమైన రాజుపాలెంలో పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద



పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి, అమ్మవారికి విశేష అలంకరణలు, పూజలను నిర్వహించారు. స్వామివారిని కనులారా దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కోలాటాలు, భజనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ పొత్తూరి వెంకట రామ సుబ్బారావు ఆధ్వర్యంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల చివరి రోజైన 19వతేదీన మంగళవారం నిత్యారాధన, మంగళశాసనం, ఉత్సవ హవన స్వపనం, తీర్థ ప్రసాద గోష్టి, ఆచార్యులకు, ఋత్వికులకు సన్మానం వంటి కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ ఛైర్మన్ పొత్తూరి వెంకట రామసుబ్బారావు తెలియజేశారు.

## దీనంగా మారిన ఆటో డ్రైవర్ల పరిస్థితి

పెదకూరపాడు, ఆగస్టు 19 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సదుపాయాన్ని ఆగస్టు 15 నుంచి కల్పించారు. ఆనాటి నుంచి ఆటోలు ఎక్కే వారు లేకపోవడంతో డ్రైవర్లు పూట గడవని స్థితిలో ఉన్నామని ఆవేదన చెందారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల విషయంలో కూడా ఆటోచన చేసి తమ ఆటోలను నేరుగా



ప్రభుత్వమే తీసుకొని నెలకు రూ.30 వేల చొప్పున ఇచ్చి, ఆయిల్ పోయించి ఉచిత ఆటోల సదుపాయం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై అన్ని యూనియన్లు ఏకమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ బాజీ, లగడపాడు సత్యం, నరసింహారావు, పెదకూరపాడు రవి, రఫీ, బాజీ, షేక్.నాగూర్‌షరీఫ్, సుధాకర్, సుభాని, శ్రీను, షేక్.ముస్తఫా, షేక్.బాజీ, పెదకూరపాడు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## అధిక వడ్డీలు చెల్లించమని బెదిరింపులు

తాడేపల్లి,ఆగష్టు 19,ప్రభాతవార్త : వివాహితను అదికవడ్డీలు చెల్లించమని బెదిరింపులకు,లైంగిక వేధింపులకు పాల్పడుతూ ఆత్మహత్యకు ప్రేరేపించిన ఘటనలో 5గురు నిందితుల అరెస్టు.జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ ఘటనకు సంబంధించి తాడేపల్ల పోలీస్టేస్ లో కేసు నమోదుచేసి




దర్యాప్తు చేపట్టినట్లు సిఐ వీరేంద్రబాబు తెలిపారు.కేసు వివరాలు 2016లో మృతురాలి భర్త అద్దంకి జయకృష్ణ తో జ, నిందితులు వేణుగోపాల్ మరియు శ్రీనివాసరావుల నుండి రూ.50,000లు నగదును అప్పుగా తీసుకున్నారు. అప్పుతీర్చిన తర్వాత కూడా నిందితులు అధికవడ్డీ పేరుతో రూ.15లక్షలకు పైగా వసూలు చేశారని అయినప్పటికీ నిందితులు అప్పు తీర్చలేదని ఒత్తిడి చేస్తూ ఖాళీ చెక్కులు,ప్రామిసరీ నోట్లు తీసుకొని బెదిరింపులకు గురిచేశారని,నిందితులిద్దరూ వారికి పరిచయస్తులైన ఇతర నిందితులు కూడా పలుమార్లు మృతురాలి ఇంటికి వెళ్ళి అవమానకరంగా మాట్లాడి బెదిరించారు.అంతేకాకుండా నిందితులు వేణుగోపాల్ మరియు బుచ్చిప్రసాద్ మృతురాలిని లైంగికంగా వేధించినట్లు ఆమె రాసిన సూసైడ్ నోట్ మరియు మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసిన సెల్ఫీ వీడియోల ద్వారా స్పష్టమైంది.నిరంతర వేదింపులు,బెదిరింపులు తట్టుకోలేక 14-08-2025న మద్యాహ్నం 1గంట సమయంలో మృతురాలు ఎలుకల విషం సేవించి ఆత్మహత్యకు యత్నించారు.అనంతరం చికిత్స పొందుతూ 15-08-2025 ఉదయం 3.01గంటలకు మరణించారు.ఈ ఘటనపై తాడేపల్లి పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేసి తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి,సాక్ష్యాధారాలు,సూసైడ్ నోట్ వీడియోలాను పరిశీలించి నిందితులను గుర్తించారు.నిందితులను 19.08.2025ఉదయం 9గంటలకు ఉండవల్లి సెంటర్ వద్ద అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరచగా న్యాయస్థానం రిమాండ్ విధించారు.

## వరి దెబ్బతిన్న రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు

కొల్లిపర,అగష్టు 19 ప్రభాతవార్త: భారీవర్షాలు కారణంగా వెదపద్ధతి ద్వారా సాగు చేపట్టిన వరి పంట నీట మునిగి దెబ్బతిన్న రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు ఇస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి చెప్పారు.మంగళవారం మండల పరిధిలోని చక్రాయపాలెంలో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై తగిన సూచనలు,సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వరిపొలాలలో ఎక్కువుగా ఉన్న నీటిని



బయటకు పంపాలన్నారు.ఎకరాకు 30 కిలోల యూరియా,20 కిలోల పిటిపి అదనంగా వేసుకోవాలన్నారు.వ్యవసాయాధికారుల సూచనలు రైతులు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు,విఏఏలు,రైతులు పాల్గొన్నారు.

20-8Pg5 9thpage_20-8Pg5.qxd 8/19/2025 10:35 PM Page 1



# 6 వేల విద్యార్థి వీసాలు రద్దు!



## అమెరికా ప్రభుత్వం తాజా నిర్ణయం

### నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు: ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 19:** అమెరికాలో నిబంధనలు ఉల్లంఘించిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకొంటున్నారు. తాజాగా 6,000 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్లు బిబిసి రిపోర్టులో పేర్కొంది. అమెరికా విదేశాంగ శాఖ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. 4,000 మంది దేశ చట్టాలు ఉల్లంఘించడం, దాడులు, మత్తులో డ్రైవింగ్, దోపిడీలకు పాల్పడటం వంటివి చేసినట్లు తెలుస్తోంది. అమెరికా చట్టాల్లోని ఐఎన్ఎ 3బి కింద ఉగ్రవాదానికి పాల్పడిన దాదాపు 300 మంది కూడా ఈ జాబితాలో ఉన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలో ఈ వీసాల రద్దు వ్యవహారం వెలుగులోని రావడం గమనార్హం.

ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించే పనిలో పడ్డారు. ప్రధాన విశ్వవిద్యాయాలను లక్ష్యంగా చేసుకొని తీవ్రస్థాయిలో పాలసీల మార్పులు చేపట్టారు. ఇవి అంతర్జాతీయ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. తొలుత జనవరిలో యాంటీ సెమిటిజమ్‌ను (యూదులపై వ్యతిరేకత) అరికట్టేలా బిల్లును పాస్‌చేశారు. అంతర్జాతీయ విద్యార్థులు పాలస్తీనాకు మద్దతుగా ఆందోళనలు చేపడితే ఈ ఆదేశాల ప్రకారం వారిని దేశ బహిష్కరణ చేయవచ్చు.

విదేశీ విద్యార్థులకు కొత్త ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను నిలిపివేస్తూ జూన్‌లో ట్రంప్ కార్యవర్గం నిర్ణయం తీసుకొంది. అనంతరం సోషల్ మీడియా వెట్టింగ్‌ను కఠినతరం చేశారు. ఫారెన్ స్టూడెంట్స్ కచ్చితంగా వారి సామాజిక మాధ్యమ ఖాతాలు బహిర్గతం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల పోస్టులు, కామెంట్లు, లైక్‌లను అమెరికా అధికారులు పరిశీలించి.. వారు జాతీయ భద్రతకు ముప్పు కాదు అని భావిస్తే మాత్రమే వీసా ప్రక్రియలో ముందుకువెళతారు. ఇక కీలక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు కేటాయించిన నిధుల్లో కోత విధించారు. క్యాంపస్‌ల్లో పాలస్తీనా అనుకూల ఆందోళనల్లో పాల్గొన్న చాలామంది విదేశీ విద్యార్థులను అరెస్టు చేయించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థులను నియమించుకోకుండా బ్లాక్ చేశారు. ఈ క్రమంలో ట్రంప్ కార్యవర్గం, విశ్వవిద్యాలయం మధ్య న్యాయపోరాటం మొదలైంది.

గతేడాది గణాంకాల ప్రకారం.. దాదాపు 10 లక్షల మందికిపైగా అంతర్జాతీయ విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారు. వారి నుంచి దాదాపు 43.8 బిలియన్ డాలర్లు అమెరికాకు లభించాయని ఎన్ఎఫ్ఎస్ఎ అసోసియేషన్ వెల్లడించింది. దేశంలోని మొత్తం విద్యార్థుల్లో వీరు 6 శాతం వరకు ఉంటారు.



## యుఎస్-ద.కొరియా సైనిక విన్యాసాలు

### ఉత్తర కొరియా నియంత కిమ్ కన్నెర్ర

**ప్యాంగ్‌యాంగ్, ఆగస్టు 19:** అమెరికా, దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ మళ్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ అణ్వాయుధ దళాన్ని విస్తృతం చేస్తానని వ్యాఖ్యానించారు. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన అధునాతన యుద్ధనౌకను పరిశీలించిన కిమ్.. ప్రత్యర్థుల సైనిక విన్యాసాలు శత్రుత్వాన్ని పెంచేవేనని అన్నారు. అమెరికా, ద.కొరియా చేపడుతున్న సైనిక కసరత్తులను దండయాత్రకు సన్నాహాలుగా వాదిస్తున్న కిమ్.. తన సైనిక, అణ్వాయుధ కార్యక్రమాలను సమర్థించుకుంటున్నారు. ఈ క్రమంలోనే అణుసామర్థ్యం కలిగిన చో హ్యోన్ అనే యుద్ధనౌకను తాజాగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యర్థుల సైనిక కసరత్తులు శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నాయని, యుద్ధాన్ని ప్రేరేపించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవి మునుపటి కంటే ఎక్కువ ఉద్రిక్తతలు పెంచేవిగా ఉన్నాయని, వాటికి దీటుగా ప్రతిస్పందించేందుకు తాము కూడా సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. 'ఉ. కొరియా చుట్టూ భద్రతా పరిస్థితులు రోజురోజుకు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇప్పటికే ఉన్న సైనిక, అణు సామర్థ్యాలను వేగంగా మరింత విస్తరించుకోవాల్సిన అవసరం ఉంది' అని కిమ్ పేర్కొన్నట్లు ఉత్తరకొరియా అధికార వార్తా సంస్థ కెసిఎన్ఎ వెల్లడించింది. ఉత్తర కొరియా నుంచి పొంచి వున్న ముప్పును ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతున్న అమెరికా, దక్షిణ కొరియా బలగాలు.. వార్షిక సైనిక విన్యాసాలను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నాయి. 11 రోజులపాటు కొనసాగే ఈకసరత్తుల్లో సియోల్‌కు చెందిన 18 వేల మందితో సహా మొత్తం 21వేల మంది సైనికులు పాల్గొంటున్నారు. క్షేత్రస్థాయి శిక్షణ, కంప్యూటర్ సిమ్యులేటెడ్ కమాండ్ పోస్టుతో పాటు ఆయుధ పరీక్షలు కూడా నిర్వహించనున్నారు.

## కాంగోలో ఊచకోత

### 52 మందిని నరికేసిన రెబల్స్

**కిన్‌షాస, ఆగస్టు 19:** ఆఫ్రికా దేశమైన కాంగోలో ఇస్లామిక్ స్టేట్ మద్దతు కలిగిన తిరుగుబాటు దారులు రెచ్చిపోయారు. కత్తులు, గొడ్డళ్లతో 52 మందిని నరికి చంపారు. ఈ విషయాన్ని స్థానిక అధికారులు తెలిపారు. కాంగో దళాల చేతిలో ఓటమి పాలవడంతో రగిలిపోయిన అలైట్ డెమోక్రటిక్ ఫోర్సెస్ (ఎడిఎఫ్) సభ్యులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని అక్కడి అధికారి తెలిపారు. బెని, లుబెరో ప్రాంతాల్లోని పౌరులపై ఎడిఎఫ్ తిరుగుబాటుదారులు దాడికి పాల్పడినట్లు వెల్లడించారు. నిద్రపోతున్న ప్రజలను లేపి.. తాళ్లతో చేతులు కట్టి కత్తులు, గొడ్డళ్లతో అతికిరాతకంగా నరికి చంపారన్నారు. మెలియా గ్రామంలోనే దాదాపు 30 మంది ప్రాణాలు తీశారన్నారు. ఎనిమిది మంది మహిళలు, ఇద్దరు చిన్నారులతోసహా మొత్తం 52 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వివరించారు. ఇళ్లకు కూడా నిప్పంటించారని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇటీవల ఓ కాథ్యలిక్ చర్చి ప్రాంగణంలో తిరుగుబాటు దారులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 38 మంది ప్రాణాలుకోల్పోయారు. ఇస్లామిక్ స్టేట్‌తో ముడిపడి ఉన్న తిరుగుబాటు సంస్థ ఎడిఎఫ్. ఈ సంస్థ ఉగాండా, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. పౌరులే లక్ష్యంగా కొన్నేళ్లుగా దాడులకు పాల్పడుతోంది. 2013నుంచి ఇప్పటి వరకు దాదాపు ఆరు వేల మందికిపైగా బలిగొన్నట్లు నివేదికలుఉన్నాయి. ఎడిఎఫ్‌పై అమెరికా, ఐరాస భద్రతామండలిలు ఆంక్షలు విధించాయి.

## అభిప్రాయం చెప్తాం.. తీర్పు ఇవ్వం



### తమిళనాడు కేసుపై స్పష్టం చేసిన సిజెఐ

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** తమిళనాడు కేసుపై తమ బెంచ్ అభిప్రాయం వెల్లడిస్తుందే కానీ తీర్పు ఇవ్వదని సుప్రీంకోర్టు సిజెఐ బిఆర్ గవాయ్ పేర్కొన్నారు. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా తేల్చాలని కోర్టులు నిర్దేశించవచ్చా అన్న అంశంపై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. తొలుత ఈ పిటిషన్‌ను విచారణకు చేపట్టడంపై ఉన్న అర్హతలను వింటామని చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బిఆర్ గవాయ్ వెల్లడించారు. దీనిపై సీనియర్ న్యాయవాది కెకె వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ అంశంలో చాలా విషయాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200ను చూడాలని పేర్కొన్నారు. పంజాబ్, తమిళనాడు, తెలంగాణ కేసుల్లో వీలైనంత త్వరగా అన్న పదంవల్ల జాప్యం చోటుచేసుకొందన్నారు. తమిళనాడు కేసు వల్ల ఇప్పుడుగడువు విధించారని వెల్లడించారు. దీనిపై సిజెఐ స్పందిస్తూ స్వయంగా రాష్ట్రపతి దీనిపై రిఫరెన్స్ అడిగారు. దీనిలో మీకున్న సమస్య ఏమిటని ఆయన ప్రశ్నించారు. మరోవైపు అటార్నీ జనరల్ వెంకటరమణి స్పందిస్తూ తాము రాజ్యాంగ ధర్మాసనం పరిశీలన కోరతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు కూడా విన్న సిజెఐ గవాయ్ స్పందిస్తూ తాము కేవలం అభిప్రాయాలు మాత్రమే చెబుతామని తమిళనాడు కేసుపై తీర్పు మాత్రం ఇవ్వమని పేర్కొన్నారు. మరో న్యాయమూర్తి జస్టిస్ పిఎస్ నరసింహా కూడా తమబెంచ్ కేవలం అభిప్రాయం మాత్రమే వెల్లడిస్తుందని, అది తమిళనాడు కేసు జడ్జిమెంట్‌పై ఎలాంటి ప్రభావం చూపదని పేర్కొన్నారు.

తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్ఎన్‌రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ యేడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్ గరిష్టంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. ఈతీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టు ఉందని జస్టిస్ జెబిపార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది.

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ స్పందిస్తూ రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అనంతరం దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గడువు విధించడంపై అభిప్రాయాలు తెలియచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఇప్పటికే దీనిపై కేంద్రం స్పందించింది. ఒక రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం రాజ్యాంగపరమైన గందరగోళానికి దారి తీస్తుందని సుప్రీంకోర్టుకు తెలియచేసింది. అలాచేయడం ప్రభుత్వం తనకు రాజ్యాంగం ఇవ్వని అధికారాన్ని అందిపుచ్చుకుని చెల్లాయించినట్లువుతుందని పేర్కొంది.

## నెలాఖరులో ప్రధాని చైనా పర్యటన: దోవల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెలలో చైనాలో పర్యటించనున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వెల్లడించారు. భారత్ పర్యటనలో ఉన్న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భేటీ సందర్భంగా దోవల్ ఈ విషయాన్ని ధృవీకరించారు. తియాంజిన్ నగరంలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రధాని మోడీ పాల్గొననున్నారని చెప్పారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీతో 24వ ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చలు ఢిల్లీలో జరిగాయి. ఈ సందర్భంగా అజిత్ దోడల్ మాట్లాడుతూ గడిచిన తొమ్మిది నెలల్లో సరిహద్దుల్లో పరిస్థితులు మెరుగుపడ్డాయని, ప్రస్తుతం అక్కడ ప్రశాంత వాతావరణం కొనసాగుతుందన్నారు. తాజా ద్వైపాక్షిక చర్చలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్న ఆయన ఇరు దేశాధినేతలు కజాన్‌లో భేటీకావడం ఉద్రిక్తతలను తగ్గించిందన్నారు. చైనాలోజరిగే ఎస్‌సిఒసదస్సుకు ప్రధాని మోడీ హాజరవుతున్నారని అధికారికంగా ప్రకటించారు. వాంగ్ యీ మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా మనం ఎదుర్కొంటున్న సవాళ్లు మన ప్రయోజనాలకు అనుగుణంగా లేవు. మోడీ, జిన్‌పింగ్‌లు కజాన్‌లో భేటీ కావడం, ఆ తర్వాత సరిహద్దులోనూ పరిస్థితులు స్థిరంగాఉండటం సంతోషకరమైన విషయం. ఎస్‌సిఒ సదస్సుకు ప్రధాని మోడీ రాకను స్వాగతిస్తున్నాం. భారత్, చైనాల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలు దీర్ఘకాలిక ప్రయోజనాలకు దోహదం చేస్తాయని చరిత్ర, వాస్తవికత రుజువు చేస్తోంది అని చెప్పారు.

## 75 వేల కిలోల రాకెట్‌ను సిద్ధం చేసిన ఇస్రో

### ఇప్పటిదాకా ఇదే 'పవర్‌ఫుల్'

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** భారతదేశ అంతరిక్ష లక్ష్యాలకు పెద్ద ముందడుగు వేస్తూ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇప్పటివరకు అత్యంత శక్తివంతమైన రాకెట్‌పై పని చేస్తోంది. ఈ రాకెట్ 40 అంతస్తుల ఎత్తు ఉంటుంది. ఇది 75,000 కిలోల బరువు గల ఉపగ్రహాన్ని భూమికి దగ్గరి కక్ష్యలోకి తీసుకెళ్తుంది. ఈ ప్రాజెక్టును ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ప్రకటించారు. 35 కిలోల నుండి 75,000 కిలోలకు ప్రయాణం ఇస్రో ప్రారంభ దశలను గుర్తు చేసుకుంటూ నారాయణన్ డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో రూపొందించిన మొదటి రాకెట్ 17 టన్నుల బరువు ఉంటుందని, అది కేవలం 35 కిలోలను మాత్రమే భూమికి దగ్గరి కక్ష్యలో ఉంచగలదని చెప్పారు. 'ఈ రోజు, మేము 75,000 కిలోలను కక్ష్యలో ఉంచగల రాకెట్‌ను రూపొందిస్తున్నాము. ఈ రాకెట్ 40 అంతస్తుల భవనం ఎత్తు ఉంటుంది' అని ఆయన అన్నారు. ఇది భారతదేశ సాంకేతిక అభివృద్ధిలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. 2025లో ఇస్రో కార్యక్రమాలు ఇస్రో చేపట్టనున్న కార్యక్రమాలు నావిక్ ఉపగ్రహాలు భారత స్వతంత్ర జీపీఎస్ వ్యవస్థను మెరుగుపరచడం.కొత్త ఎన్1 రాకెట్, ఇది భారీ ప్రయోగాలకు వెన్నెముకగా పనిచేస్తుందని భావిస్తున్నారు. 6,500 కిలోల అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహ ప్రయోగం, ఇది భారతదేశ తక్కువ ధర ప్రయోగ వాహనాలపై ప్రపంచ దేశాలకు పెరుగుతున్న నమ్మకాన్ని సూచిస్తుంది.

**టెక్నాలజీ డెమోన్‌స్ట్రేషన్ శాటిలైట్ ప్రయోగం.**

భారత నావికాదళం కోసం ఒక సైనిక కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్7ఆర్ ప్రయోగం, ఇది పాతబడిపోయిన జీశాట్7 (రుక్మిణి) స్థానంలో వస్తుంది. భారతదేశ ఉపగ్రహాల సంఖ్యను పెంచడం ప్రస్తుతం, అంతరిక్షంలో భారతదేశానికి 55 ఉపగ్రహాలు పనిచేస్తున్నాయి. అవి నావిగేషన్, కమ్యూనికేషన్, రక్షణ, వాతావరణ శాస్త్రం, భూమి పరిశీలనలకు ఉపయోగపడుతున్నాయి.

ఈ సంఖ్య రాబోయే మూడు నుంచి నాలుగు సంవత్సరాలలో మూడు రెట్లు పెరుగుతుందని నారాయణన్ చెప్పారు. ప్రపంచ పరిస్థితి, ప్రాధాన్యత ఈ ప్రకటన భారతదేశాన్ని అమెరికా, చైనా, రష్యా వంటి అభివృద్ధి చెందిన అంతరిక్ష దేశాల సరసన నిలుపుతుంది. ఈ దేశాలు కూడా భారీ ప్రయోగ వాహనాలను రూపొందిస్తున్నాయి.

## ఇది పరిహాసమా.. ఒక జిల్లా మొత్తాన్ని రాసిస్తున్నారా?

### ఒక కంపెనీకి 992 ఎకరాల భూమిని కేటాయించడంపై గువాహతి హైకోర్టు సీరియస్!

**గువాహతి, ఆగస్టు 19:** రాష్ట్రంలోని డిమా హసావో జిల్లాలో మహాబల్‌సిమెంట్స్ అనే ప్రైవేట్ సిమెంట్ కంపెనీకి ఏకంగా 3,000 బీఘాల (దాదాపు 992ఎకరాలు) భూమిని కేటాయించడంపై గువాహతి హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్ణయాన్ని అసాధారణమైనదిగా అభివర్ణించిన న్యాయస్థానం 'ఇది పరిహాసమా.. ఒక జిల్లా మొత్తాన్ని రాసిస్తున్నారా?' అంటూ సీరియస్‌గా ప్రశ్నించింది.

విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కుమార్ మేధి భూ కేటాయింపుల గురించి తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒక ప్రైవేట్ కంపెనీకి 3000 బీఘాలా? అది బీడు భూమి అయినా ఇంత పెద్ద మొత్తంలో కేటాయించడం ఏమిటి? ఇక్కడ కంపెనీకి ఎంత భూమి అవసరం అన్నదికాదు, ప్రజా ప్రయోజ నమే ముఖ్యం' అని వ్యాఖ్యానించారు. ఈ భారీ భూ కేటాయింపుకు సంబంధించిన అన్ని రికార్డులు, ప్రభుత్వ విధాన పత్రాలను తమముందు ఉంచాలని నార్త్ కచార్ హిల్స్ అటానమస్ కౌన్సిల్‌ని న్యాయస్థానం ఆదేశించింది. డిమా హసావో జిల్లా రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ పరిధిలోకి వస్తుందని, ఇక్కడి గిరిజన తెగల హక్కులు, ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోర్టు గుర్తుచేసింది. కంపెనీ తరఫు న్యాయవాది వాదిస్తూ అది పూర్తిగా బీడు భూమి అని ఫ్యాక్టరీ నిర్మాణానికి అంతభూమి అవసరమని చెప్పారు. టెండర్‌ద్వారా పొందిన మైనింగ్ లీజుకు కొనసాగింపుగానే ఈ కేటాయింపు జరిగిందని తెలిపారు.

## మరో 15 యేళ్లలో చంద్రుడిపైకి భారత్ వ్యోమగామి




### 2027లో మానవసహిత గగన్‌యాన్

### శుభాంశు శుక్లా ఘనతపై లోక్‌సభ చర్చలో కేంద్రమంత్రి జితేంద్రసింగ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** వికసిత భారత్‌కు దూతగా 2040లో భారతీయ వ్యోమగామి చందమామపై అడుగుపెట్టనున్నాడని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. శుభాంశు శుక్లాను అభినందిస్తూ కేంద్రమంత్రి జితేంద్రసింగ్ సోమవారం లోక్‌సభలో చర్చను ప్రారంభించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారేందుకు అంతరిక్ష కార్యక్రమంలో ఈ యాత్ర కీలక పాత్ర పోషిస్తుందని సింగ్ చెప్పారు. 'సంస్కరణల ద్వారా అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించాక సంబంధిత వాణిజ్యం 800 కోట్ల డాలర్లకు చేరింది. వచ్చే దశాబ్ది నాటికి ఇది 4,500 కోట్ల డాలర్లకు చేరుతుంది. వ్యోమమిత్ర అనే రోబోను వచ్చే యేడాది అంతరిక్షంలోకి పంపించనున్నాం. 2027లో తొలిసారిగా మానవసహిత అంతరిక్ష యాత్ర చేపట్టనున్నాం. 2040లో చంద్రుడిపై భారత వ్యోమగామి పాదం మోపి.. త్రివర్ణ పతాకాన్ని ఎగరవేస్తారు. 2035కల్లా మనకూ సొంత అంతరిక్ష కేంద్రం ఉంటుంది' అని జితేంద్ర సింగ్ వివరించారు. బీహార్ ఓటరు జాబితాలో సవరణలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు లోక్‌సభలో నినాదాలు చేశాయి. జితేంద్ర సింగ్ ప్రసంగిస్తున్న సమయంలోనూ ఇవి కొనసాగాయి. వాకౌట్ చేసిన ప్రతిపక్షాల తీరును ఎన్డీయే నేతలు తప్పుబట్టారు. 'మీకు బిజెపిపై, ప్రభుత్వంపై కోపం ఉండవచ్చు. వ్యోమగామిపైనా మీరు కోపంగా ఉండటం ఆశ్చర్యకరం. ఆయనొక వ్యోమగామి మాత్రమే కాకుండా క్రమశిక్షణ గల వాయుసేన సైనికుడు. ఆయనకు ఏ పార్టీతో సంబంధం లేదు' అని జితేంద్ర చెప్పారు.

**ఇలాంటి వాటిపైనా రాజకీయాలా? : రక్షణమంత్రి రాజ్‌నాథ్**

దేశం అభివృద్ధి చెందడం ప్రతిపక్షాలకు ఇష్టంలేదని, వాటి తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విమర్శించారు. దేశానికి గర్వకారణమైన అంశాల్లోనైనా రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రశ్నోత్తరాల సమయానికి అడ్డుపడిన సభ్యులపై స్పీకర్ ఓంబిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతలు ప్రశ్నలడిగితే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. విపక్ష నిరసనలతో సభ వాయిదా పడినందువల్ల అసంపూర్తిగా మిగిలిన చర్చ మంగళవారం కొనసాగింది. ప్రతిపక్షాల ఆందోళనతో రాజ్యసభ కూడా వాయిదా పడింది. గందరగోళం మధ్యనే భారతీయ ఓడరేవుల బిల్లును సభ ఆమోదించింది. విపక్షాలు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ అరాచకంగా వ్యవహరిస్తున్నాయని సభాపక్ష నేత జెపి నడ్డా విమర్శించారు.

## సంక్షిప్తంగా..

### నెహ్రూ దేశాన్ని రెండుసార్లు విభజించారు: ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ భారతదేశాన్ని రెండుసార్లు విభజించారని ప్రధాని నరేంద్రమోడీ ఆరోపించారు. ఒకసారి రాడ్‌క్లిఫ్ లైన్‌తో విభజిస్తే భారత్‌కు చెందిన సింధూ నదిని ముక్కలు చేసి మరోసారి విభజించారన్నారు. దీనివల్ల దేశంలో వ్యవసాయానికి గణనీయమైన నష్టం వాటిల్లిందన్నారు. కొంత కాలానికి పాకిస్తాన్‌తో తాను చేసుకున్న సింధూ నది ఒప్పందం వల్ల 80 శాతం నీరు ఆ దేశానికి వెళ్లాయని భారత్‌కు మాత్రం ఎలాంటి ప్రయోజనం లేదనే విషయాన్ని నెహ్రూనే స్వయంగా అంగీకరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు వ్యతిరేకి అనే దానికి ఆయన తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమన్నారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కును కాలరాసేందుకు నెహ్రూ హయాంలో రాజ్యాంగ సవరణ చేశారని మోడీ మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచేశారని ఆరోపించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేయలేదని, తమ ప్రభుత్వం అధికారం చేపట్టాకే వారి అభివృద్ధి మొదలయిందని, ఎన్డీఎ పాలనలో దేశం మూడో ఆర్థిక శక్తిగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోందన్నారు.

### హద్దుమీరితే అరెస్టులే: అసోం సిఎం శర్మ

**గౌహతి, ఆగస్టు 19:** ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు తమ రాష్ట్రంలో పర్యటించడంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 'కొత్త వ్యక్తులు' రాష్ట్రాన్ని సందర్శిస్తున్నారని, సున్నిత అంశాలపై రాజకీయం చేస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. కేరళ, ముంబయి, ఢిల్లీ ఇలా ఎక్కడివారైనా నిబంధనలకు లోబడి నడుచుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పర్యటించే కొందరిపై నిఘా ఉంచాం. ఎన్ఆర్‌సి అప్‌డేషన్ సమయంలోనూ కొందరు అలజడులు సృష్టించడానికి ప్రయత్నించారు. అప్పుడు వారిపై ప్రభుత్వం అంతగా దృష్టి పెట్టలేదు. కానీ ఇప్పుడు మాత్రం వారిపై కన్నేసి ఉంచాం. నిబంధనలు అతిక్రమించి హద్దులు దాటి ప్రవర్తిస్తే అరెస్టు చేస్తాం అని సిఎం హిమంత పేర్కొన్నారు. రాష్ట్రంలోని సున్నితమైన అంశాలపై రాజకీయం చేస్తే సహించే ప్రసక్తే లేదని అస్సాం ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేరళ, ముంబయి లేదా ఢిల్లీ ఎక్కడి నుంచి వచ్చినా కొన్ని వర్గాల వారి కార్యకలాపాలను ప్రోత్సహించే ప్రయత్నాలను ఉపేక్షించమన్నారు.

### నేడు రాధాకృష్ణన్ నామినేషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఈనెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. రాధాకృష్ణన్ నామినేషన్ పేపర్లపై ఎన్డీఎ పక్ష నేతలు సంతకాలు చేయనున్నారు. ఆయనకుమద్దతుగా 20 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. ఎన్నిక సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై మంగళవారం ఉదయం ఎన్డీయే పక్ష నేతలు సమావేశం కాగా, సాయంత్రం 4.30 గంటలకు మరోసారి సమావేశమయ్యారు.

**ప్రతిపక్షాల మద్దతు కోరిన మోడీ**

కాగా, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు ప్రతిపక్షాలు మద్దతివ్వాలని ప్రధానమంత్రి మోదీ కోరారు. ఏకగ్రీవంగా ఆయనను ఎన్నుకునేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులోని బాలయోగి ఆడిటోరియం మంగళవారం ఉదయం ఎన్డీయే ఎంపీల సమావేశం జరిగింది. ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ప్రధాని స్వయంగా ఎంపీలకు పరిచయం చేశారు. అనంతరం రాధాకృష్ణన్‌ను సన్మానించారు. కాగా, 20వ తేదీ ఉదయం 11 గంటలకు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని కిరణ్ రిజిజు చెప్పారు.

### అమెరికాలో మెలోనీ విడియో వైరల్..

**వాషింగ్టన్, ఆగస్టు 19:** భారత ప్రధాని నరేంద్రమోడీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీల పేర్లు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వీరిమధ్య ఎలాంటి భేటీ జరగలేదు. అయితే, అమెరికాలోని వైట్‌హౌస్‌లో సమావేశంకోసం వచ్చినఆమె.. అక్కడిఅధికారులను భారతీయ సంప్రదాయంలో నమస్తే అంటూ పలకరించారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారగా.. మోడీ ఎఫెక్ట్ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. రష్యాతో యుద్ధం ముగించే అంశంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీఅయిన సంగతి తెలిసిందే. ఈ సమావేశానికి యూరోపియన్ నేతలు కూడా హాజరయ్యారు. అందులో ఇటలీ ప్రధాని మెలోనీకూడా ఉన్నారు. వైట్‌హౌస్‌కుచేరుకున్న ఆమెకు ట్రంప్ పరిపాలనాధికారులు స్వాగతం పలికారు. ముందుగా షేక్‌హ్యాండ్స్‌తో వారినిపలకరించిన మెలోనీ.. అనంతరం నమస్కారం చేశారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

## ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ దేశానికి ఆదర్శంగా ఉండాలి

### పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** వికసిత్ భారత్ 2047లో ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ దేశానికి ఆదర్శంగా నిలవాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో ఏపీకి కేంద్రం 935 పీఎంశ్రీ పాఠశాలలను కేటాయించిందని, ఇది శుభపరిణామమని పేర్కొన్నారు. వికసిత్ భారత్-2047 సంకల్పంలో భాగంగా విజయవాడలో సోమవారం 'స్కూలింగ్-బిల్డింగ్ బ్లాక్స్' అనే అంశంపై రాష్ట్ర స్థాయి కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా కోన శశిధర్ మాట్లాడుతూ 'అభివృద్ధి చెందిన ,సుసం పన్నమైన దేశంగా మార్చడమే వికసిత్ భారత్ సంకల్పం.ఈ లక్ష్య సాధనకు పాఠశాల,విద్య కీలకం. ఉపాధ్యాయులు, అధికారులు ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో భాధ్యతాయుతమైన సమిష్టి కృషి చేయాలి. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో 125 పురపాలికల్లో అటిజం కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాం. త్వరలో మంగళగిరిలో ప్రారంభించనున్నాం. పునాది దశ నుంచే లిటరసీ,న్యూమరసీలో నైపుణ్యం సాధించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం'అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యా డైరెక్టర్లు విజయ రామరాజు, కృతిక శుక్లా,ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఎండిఎస్ తాజా నోటిఫికేషన్

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** నీట్-పీజీ(ఎండీఎస్) కటాఫ్ శాతాన్ని 19,863కి తగ్గించిన నేపథ్యంలో విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం కన్వీనర్,యాజమాన్య కోటా సీట్ల భర్తీకి తాజాగా సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కటాఫ్ తగ్గించిన తర్వాత అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 18 రాత్రి 7 గంటల నుంచి 21 వరకు రాత్రి 7 గంటల ల్లోగా కొత్తగా ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలి. మాప్-అప్ రౌండ్ కౌన్సిలింగ్ అనంతరం కన్వీనర్ కోటాలో 15 సీట్లు, యాజమాన్య కోటాలో 96 సీట్లను విశ్వ విద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.కొత్తగా ధరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు మార్గ నిర్దేశకాల్లో సందేహాలుంటే 89787 80501 నంబరుకు,సాంకేతిక సమస్యలు తలెత్తితే 90007 80707 నంబరుకు ఫోన్ చేయచ్చని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

## వెంకటపాలెం వేంకటేశ్వర ఆలయంలో పవిత్రోత్సవాలు

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి: వెంకటపాలెం(అమరావతి)** శ్రీ వేంకటేశ్వరసస్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో అంతర్భాగంగా ఉదయం యాగశాలలో పంచగవ్యారాధన, అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంలతో స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ట, అధివాసం, సర్వదైవత్య హోమం చేపడుతారు. ఆగష్టు 20న ఉదయం పుణ్యాహావాచనం, కుంభ ఆరాధన, ప్రధాన హోమములు, స్నపన తిరుమంజనం, పవిత్రాభిమంత్రణ, పవిత్ర సమర్పణము, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, మహా శాంతి హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఆగష్టు 21వ తేదీ బుధవారం ఉదయం పుణ్యాహవచనం, యాగశాల వైదిక కార్యక్రమములు, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, కుంభ సమర్పణం, విశేష ఆరాధన, ఆచార్య, ఆగమ సలహాదారు, ఋత్విక్కులకు బహుమానం, యాజమాన ఆశీర్వాచనం చేపడుతారు.

## వైఎస్సార్సీ ఎంపి మిథున్ రెడ్డి పై చంద్రబాబు తప్పుడు కేసులు బనాయించారు

### ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో ఆగస్టు 19 (ప్రభాతవార్త):** వైయస్ఆర్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పై సిఎం చంద్రబాబు నాయుడు అన్యాయంగా తప్పుడు కేసులు బనాయించి సెంట్రల్ జైల్లో పెట్టించారని ఉభయగోదావరి జిల్లాల వైఎస్ఆర్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్,ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో మిథున్ రెడ్డి తో ములాఖత్ అయ్యేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి ఎంపీ మిథున్ రెడ్డి పై చంద్రబాబు నాయుడు అన్యాయంగా తప్పుడు కేసులు పెట్టినందుకు జైల్లో ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని కలిసేందుకు వచ్చానన్నారు.అధికార బలంతో ఎన్ని తప్పుడు కేసులు బనాయించినా కోర్టులో వాటిని రుజువు చేయలేరని త్వరలోనే మిథున్ రెడ్డి నిర్దోషిగా బయటకు వస్తారని బొత్స అన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన అధికార కూటమి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదన్నారు.

## సెప్టెంబర్ 5నుండి పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు

**తిరుచానూరు,ఆగస్టు19ప్రభాతవార్త:** తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయంలో సెప్టెంబర్ 5వతేదీ శుక్రవారం నుండి 7వతేదీ ఆదివారం వరకు మూడురోజులు పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు సెప్టెంబర్ 2వతేదీ మంగళవారం సాయంత్రం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతిఉత్సవం ,అంకురార్పణ చేపట్టనున్నారు. ఆలయంలో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలిసీతెలియక దోషాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు మూడురోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. సెప్టెంబర్ 5వతేదీ ప్రవిత్రప్రతిష్ట, 6న పవిత్ర సమర్పణ, 7వతేదీ పూర్ణాహుతి కార్యక్రమాలు జరగనున్నాయి. 750 రూపాయలు చెల్లించి పవిత్రోత్సవాలు టిక్కెట్ పొందే గృహస్థభక్తులకు 2లడ్డూలు, 2వడలు బహుమానంగా అందజేస్తారు. ఆలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 2న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, సెప్టెంబర్ 4న అంకురార్పణ సందర్భంగా అమ్మవారికి జరిగే తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, 5వతేదీ అభిషేకానంతరం దర్శనం, లక్ష్మీపూజ సేవలు రద్దుచేశారు. అలాగే సెప్టెంబర్ 5,6,7తేదీల్లో మూడురోజులు కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, వేద ఆశీర్వచనం, కుంకుమార్చన,ఊంజల్‌సేవలు టిటిడి రద్దుచేసింది.

## అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేసిన కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ, ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** జిల్లా అధికారుల సమష్టి కృషితోనే ఎన్నో మెగా ఈవెంట్లను విజయవంతంగా నిర్వహించగలిగామని.. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో ఉత్తమ ఫలితాల సాధనకు సమర్థవంతమైన అధికారులు, సిబ్బంది పాత్ర కీలకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. రాజధాని హెడ్ క్వార్టర్ డిస్ట్రిక్ ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కలెక్టర్ లక్ష్మీశ. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన 376 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ముమ్ముందు ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావడంలో భాగస్వాములు కావాలంటూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విజయవాడ నగరంలో గత ఏడాది కాలంలో ఎన్నో భారీ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని.. ఒకవైపు ఆయా శాఖల కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తూనే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అహర్నిశలు కృషిచేశారని పేర్కొన్నారు. అవార్డులు అందుకున్న ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, కళాకారులు ఇలా ప్రతిఒక్కరి భాగస్వామ్యం ఉందని.. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తుచేసుకోవాల్సిన అవసరముందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. .అవార్డుల గ్రహీతలు:.. కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం శాఖల వారీగా అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమం సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## రైల్వే వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్‌ల పని విధానంపై నిర్దిష్టమైన ఆదేశాలు!

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 19,ప్రభాతవార్త** రైల్వే వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు తమ విధి నిర్వహణలో భాగంగా బాధిత రైల్వే సిబ్బంది, కుటుంబాలను నిర్ణీత పని వేళలలో మాత్రమే సంప్రదించాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ సిపిఓ ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు రాష్ట్రాలలోని కొన్ని రైల్వే డివిజన్‌లలో వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పిసిపిఓఈ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. రైల్వే ఉద్యోగి మృతి, నార్మల్ రిటైర్మెంట్, అధర్ ధాన్ నార్మల్ రిటైర్మెంట్,విఆర్ఎస్,మెడికల్ డీ-క్యాటగిరైజేషన్, మిస్సింగ్, రాజీనామా, కంపల్సరీ రిటైర్మెంట్ తదితర కారణాల వల్ల ఏర్పడిన సమస్యలను సదరు బీట్,సెక్షన్,యూనిట్ స్టాఫ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు బాధ్యతలతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కారుణ్య నియామకాలు, సెకండరీ ఫ్యామిలీ పెన్షన్ తదితర కేసులను నిర్ణీత కాలవ్యవధిలోగా నివేదికలను సంబంధిత ఉన్నతాధికారులకు సమర్పించాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించే పనిలో భాగంగా సమయం, సందర్భం లేకుండా ఎప్పుడుబడితే అప్పుడు బాధిత కుటుంబాలను విసిగించరాదని, రైల్వే ఉద్యోగి మృతిచెందితే ఆఫీసులకు తిప్పుకోకుండా సదరు ప్రాంత వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ బాధ్యత తీసుకుని రైల్వే శాఖ మానవతా దృక్పథంతో చెల్లిస్తున్న రూ.25వేల ఫెనరల్ అడ్వాన్స్‌ను బాధిత కుటుంబ సభ్యులకు అందజేయాల్సి ఉంటుంది. కొందరు వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు ఫెనరల్ అడ్వాన్స్ మొత్తం ఇవ్వలేదు.

## జలాశయాల్లో నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలి : అదనపు ఇఒవెంకయ్య చౌదరి

**తిరుమల,ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:** తుఫాన్ ప్రభావంతో వరుసగా వర్షాలు కురుస్తున్నా తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాలకు నీరుచేరకపోవడంతో ఉన్న నీటిని పొదుపుగా సద్వినియోగం చేసుకోవాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుంటే నిరంతర సరఫరా సాధ్యమవుతుందని సూచించారు. రానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని ,తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీటినిల్వలపై మంగళవారం సాయంత్రం గోకులం విశ్రాంతి భవనంలో అదనపు ఇఒ చౌదరి సమీక్షించారు. తిరుమల,తిరుపతిలోని అన్ని డ్యామ్‌లలో నీటిలభ్యత, వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. తిరుమలలోని డ్యాముల ధృఢత్వంపై సమగ్ర నివేదిక అందించాలని వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఐదు జలాశయాల్లో నీటినిల్వలు డిసెంబర్ వరకు భక్తుల అవసరాలకు సరిపోతాయని,

రాబోయే కార్తీక మాసంలో వర్షపాతం ఆధారంగా భవిష్యత్ అవసరాలకు సరిపడే విధంగా నీటిని వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆయన చెప్పారు.

## ప్రభుత్వ వైద్యశాలలో తమకు రక్షణ లేదంటూ నర్సింగ్ సిబ్బంది పోరుబాట




**నెల్లూరు, ఆగష్టు 19, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మేల్ నర్సు వెంకటయ్య మరో మేల్‌నర్స్ కళ్యాణ్ కుమార్‌పై పీజీలు, హౌస్ సర్జన్ల దాడి ఘటనపై జీజీహెచ్‌లోని నర్సింగ్ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు మేల్ నర్సులపై దాడికి పాల్పడ్డ ట్రైనీ వైద్యులను శిక్షించాలంటూ జీజీహెచ్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింగ్ సిబ్బంది, హెడ్ నర్సులు మాధురి, శాంతి, వరలక్ష్మీ తదితరులు మాట్లాడుతూ పీజీలు, హౌస్ సర్జన్లు మేల్ నర్సు వెంకటయ్యను, మరో మేల్ నర్స్ కళ్యాణ్ కుమార్‌ను విచోణ రహితంగా కొట్టడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలతో ఆసుపత్రిలో ప్రశాంత వాతావరణం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులు జరుగుతున్నా దీనిపై పర్యవేక్షణ లేదని, ఈ ఘటనలతో తమకు అభద్రతా భావం ఏర్పడుతుందని వెల్లడించారు. జరిగిన దాడి ఘటనపై ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్లో కంప్లైంట్ చేశామని, అయితే సోమవారం సాయంత్రం జరిఇన దాడి పై ఫిర్యాదు చేస్తే ఇంత వరకు చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఇదేమని సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ మాధవి ని వివరణ కోరగా కేసు పెడితే జైలుకెళ్తారు. ఏమవుతుంది అని వివరణ ఇచ్చారని, ఆమె బాధితుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారో ఈ విషయం తేట తెల్లం చేస్తుందన్నారు.

## ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ ఆపాలి

### - ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ విజ్ఞప్తి

**తిరుపతి కలెక్టరేట్, ఆగష్టు 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏబీసీ వర్గీకరణ అమల్లోకి వచ్చే వరకు ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ ఆపాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీఎంఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.స్థానిక డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో మంగళవారం అత్యవసర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి దండు వీరయ్య మాదిగ హాజరై మాట్లాడారు. ఏపీలో షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ కోసం మాదిగ ఉప కులాలు 31 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేపట్టడం జరిగిందన్నారు. 2000లో అమల్లోకి వచ్చిన వర్గీకరణ 2004 నవంబరున సుప్రీంకోర్టు తీర్పుతో రద్దయిందన్నారు.




## సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసేవారిపై చర్యలకు ప్రత్యేక చట్టం

### - హోంమంత్రి వంగలపూడి అనిత

**సచివాలయం,ఆగష్టు 19,ప్రభాత వార్త:** సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించి అభద్రతా భావానికి గురిచేసే వారిపై ఇకపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుందని దీనిపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టాన్ని కూడా తీసుకురానున్నట్లు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించడమే గాక అభద్రతా బావానికి గురి చేస్తున్నారని ఇకపై అలాంటి దుష్ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ విజయవంతంగా అమలుచేయడంతో ప్రతిపక్ష పార్టీ తట్టుకోలేక పోతుందని అందుకే సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాన్ని చేస్తుందని హోంమంత్రి అనిత విమర్శించారు.ఒక్క ఆగష్టు లోనే తల్లికి వందనం,అన్నదాత సుఖీభవ,నేతన్నలకు నాయీబ్రాహ్మణులకు 200వరకు ఉచిత విద్యుత్ స్త్రీశక్తి పథకం కింద మహిళలందరికీ ఉచిత బస్సుసౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు.శ్రీకాంత్ అనే వ్యక్తి పెరోల్ రద్దు చేశాం ప్రస్తుతం జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు మంత్రి అనిత పెరోల్ రావడం వెనుక ఏముంది ఎవరున్నారనే దానిపై పూర్తిగా విచారణ జరుపుతున్నాయని ఈ సంఘటనలో ఎవరున్నా వారిపై చట్టపక్రారం తగిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత స్పష్టంచేవారు.శ్రీకాంత్ విషయంలో ఎస్కార్ట్ సిబ్బందిపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు .క్రిమినల్ రికార్డు ఉన్న వ్యక్తికి పెరోల్ వచ్చిందని జైలు అధికారిచెప్పారని వెంటనే అతని పెరోల్ రద్దుచేసి తిరిగి జైలుకు పంపామన్నారు.ఈ ఘటనలో పోలీస్ అధికారులు ఎవరున్నా వారిపై కూడా విచారణ అనంతరం తగినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అరుణ అనే మహిళ దిశా ఫౌండేషన్‌కు సెల్ఫ్ డిక్లేర్డ్ సెక్రటరీ అని ఆమె నుంచి హోమ్‌శాఖ పేషీకి ఫోన్ వచ్చిందని దానిపై కూడా దర్యాప్తు చేస్తున్నామని ఆమె గురించి ఆమె వెనుకున్న వారి గురించి ఆరా తీస్తున్నా అని తెలిపారు.

## భవన నిర్మాణ కార్మికులకు మొండి చెయ్యి చూపిన కూటమి ప్రభుత్వం

### - ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ

– విజయవాడలో ఇఫ్టూ బిసి డబ్ల్యూయు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర స్థాయి ధర్నా

విజయవాడ.ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి: భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాకా కూటమి ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందనిఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. ఇఫ్టూ బిసి డబ్ల్యూయు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ధర్నా మంగళవారం ధర్నా చౌక్ లో నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఇప్పుడూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 35 లక్షల కుటుంబాలు 36 రకాల వృత్తులలో భవననిర్మాణ రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. నిత్యం ప్రమాదాలు అంచున పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుల భద్రత కోసం అనేక సంవత్సరాలు గా ఎన్నో ప్రభుత్వాలపై సుదీర్ఘంగా పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ఈరోజు న కార్మికులకు అందుబాటులో లేదు. 1996 కేంద్ర చట్టాన్ని అనుసరించి తయారుచేసిన ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో 2007 అమలు చేసిన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసారు. సంక్షేమ బోర్డు నుండి దేశంలో భవన నిర్మాణ కార్మికులకు అనేక రాష్ట్రాలలో అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం 6 సంవత్సరాలుగా సంక్షేమ బోర్డు వల్ల కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేకుండా సంక్షేమ బోర్డును నిరుపయోగంగా తయారు చేసిన పాలకవర్గాలు ప్రమాదాల బారిన పడ్డ కార్మికులకు సంక్షేమ బోర్డు నుండి నష్ట పరిహారాలు ఇవ్వాలి అంటే రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుండి రూపాయి తీయ్య నవసరం లేదు. భవన నిర్మాణ కార్మికులు పనిచేసే నిర్మాణాలు పది లక్షల దాటితే ఆ నిర్మాణాల వద్ద నుండి 1 సెక్స్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు కార్మిక శాఖ వసూలు చేసిన జమ చేస్తుంది. అలా జమ అయిన డబ్బులు కార్మికుల సంక్షేమాన్ని కి ఖర్చు పెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వాలు వాటి ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయి.

## బిజెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షునిగా నాలి మధుసూదన్

**గూడూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త** భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షునిగా తిరుపతి జిల్లా గూడూరు పట్టణానికి చెందిన నాలి మధుసూదన్‌ను భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ జాతీయ అధ్యక్షులు శాంత్ ప్రకాశ్ జాతవ్ సూచన మేరకు ప్రధాన కార్యదర్శి ఏ డి వి రక్ష పాల్ సింగ్ నియమించారు. మధుసూదన్ విశ్వహిందూ పరిషత్ బాధ్యలగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేసేవారు. దేశంలో సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ పనిచేస్తోంది. ఈ క్రమంలో నాలి మధుసూదన్‌ను బిజెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం పట్ల పట్టణంలో పలు కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ తనను రాష్ట్ర అధ్యక్షునిగా నియమించేందుకు తోడ్పాటు అందించిన ఎన్డీఏ కూటమి ఎన్ సి పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మద్దిశెట్టి సామేలు సూచనల మేరకు ప్రకటించిన భారతీయ మజ్దూర్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు బీజేఎంఎస్ నాయకులకు, కార్యకర్తలకు కార్మిక సంఘ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అనంతపురం జిల్లాలో 9601పిహెచ్ ఫించన్లు తొలగింపు

### రెండు రోజుల క్రితమే నోటీసులు జారీ - అప్పీలు అవకాశం కల్పించిన ప్రభుత్వం



**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 19 ప్రభాతవార్త** బోగస్ ఫించన్లు ఏరివేతకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా 40 శాతం కంటే వికలాంగ శాతం తక్కువగా ఉండటంతో వికలాంగులకు సంబంధించి జిల్లాలో 9601 ఫించన్లు తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ఫించన్ దారులకు నోటీసులు జారీ చేసింది. అందులో అర్హులుంటే ఆయా మండల ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు అప్పీలు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. అనంతపురం జిల్లాలో వివిధ క్యాటగిరిలకు సంబంధించి 2,83,219 ఫించన్లు ఉన్నాయి. ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీ రూ.125.960 కోట్లు ఫించన్లు రూపంలో పంపిణీ చేస్తుంది. అయితే గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా ఫించన్లు మంజూరు చేశారని కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ప్రభుత్వం స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా బోగస్ ఫించన్లు ఏరివేతకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మొదట విడతలో వికలాంగుల ఫించన్ల పరిశీలన ప్రక్రియను ప్రారంభించింది. 40 శాతం వికలాంగ శాతం తక్కువగా ఉన్న 9601 ఫించన్లు జిల్లాలో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి వారందరికి ఈనెల 14న నోటీసులు జారీ చేసింది. అందులో హెల్త్ ఫించన్స్ 326,డిజేబుల్ ఫించన్స్ 9275 మొత్తం 9601 ఫించన్లు బోగస్ ఉన్నాయి. వికలాంగుల ఫించన్లు తొలగిస్తున్నట్లు ప్రభుత్వం నుండి నోటీసులు అందుకున్న ఫించన్‌దారులకు ప్రభుత్వం మరొక అవకాశం కల్పించింది. పాత సదరం సర్టిఫికెట్ జిరాక్స్,ఆధార్ కార్డు జిరాక్స్, పెన్షన్ కోల్పోయిన నోటీస్, బియ్యం కార్డు జిరాక్స్‌తో సహా అప్పీలు దరఖాస్తులను ఆయా మండల ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు అందజేయాలి. ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు ఫలాన రోజు ఫలాన ఆసుపత్రికి వెళ్లి చెకప్ చేసుకోవాలని మరలా ఫించన్‌దారులకు నోటీసులు అందజేస్తారు. ఆ నోటీసు ప్రకారంగా డాక్టర్లు చెకప్ చేసిన తర్వాత ఫించన్‌కు అర్హత ఉందని గుర్తించి సర్టిఫికెట్ ఇస్తే ఆ సర్టిఫికెట్‌ను ఎంపీడీవో, కమిషన్లకు అందజేస్తే ఫించన్‌ను పునరుద్ధరణ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అయితే ఆ విధంగా తొలగించిన వికలాంగుల ఫించన్లలో ఎంత మంది అర్హత సాధిస్తారో అన్నది వేచి చూడాల్సిందే. అనంతపురం జిల్లాలో వికలాంగులకు సంబంధించి 9601 ఫించన్లు తొలగిస్తూ రెండు రోజులు క్రితం నోటీసులు ఇవ్వడం జరిగింది. అలా నోటీసులు అందుకున్న ఫించన్‌దారులు సంబంధిత పత్రాలతో ఆయా మండల ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు అప్పీలు చేసుకోనే అవకాశం వుంది. అలా అప్పీలు చేసుకున్న వారికి ఒక నోటీసు ఇచ్చి ఆసుపత్రిలో డాక్టర్‌తో చెకప్ చేయిస్తాం. డాక్టర్ ఇచ్చే

## దుర్గమ్మ ఆలయంలో వైద్యశాల ఆకస్మిక తనిఖీ



దాతలకు దుర్గమ్మ వారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 19, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో భక్తులకందిస్తున్న వైద్య సౌకర్యాలను మంగళవారం క్షేత్రస్థాయిలో అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్ రంగారావు ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. ఆయనకు మెడికల్ ప్రాక్టీషనర్ కనకరావు, నర్సింగ్ సిబ్బంది తమ కార్యకలాపాలను వివరించారు. భక్తులకు సేవల ఒదిస్తున్న సేవలు వివరిం చారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రు.1,00,008ల విరాళాన్ని విజయవాడకు చెందిన కడియాల శాంతి సుభాష్ మంగళవారం ఇఒ వికె శీనా నాయక్‌కు అందించారు. అలాగే విజయవాడకు చెందిన రు.1,00,116ల విరాళాన్ని కొల్లి కృష్ణమోహన్‌రెడ్డి, తమ తండ్రి కొల్లి వీర వెంకట శివప్రసాద్ పేరిట అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మ వారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

## అనంతపురం ఎమ్మెల్యే ఆడియోపై భగ్గు మన్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు - పలుచోట్ల నిరసనలు

**అనంతపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త బ్యూరో** సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 సినిమా రిలీజ్ సందర్భంగా ఇటీవల అనంతపురం ఎమ్మెల్యే ఒక వ్యక్తితో బూతులు తిట్టిన ఆడియో వైరల్ ఆయన నేపథ్యంలో అనంతపురం జిల్లాతో పాటు కర్నూలు, చిత్తూరు , తదితర జిల్లాలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నిరసనలకు దిగుతున్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ ఈ విషయంలో జూనియర్ ఎన్టీఆర్ కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని అనంతపురం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నిరసన వ్యక్తం చేయడంతో పాటు పలుచోట్ల కూడా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారు.. జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 సినిమాను అనంతపురంలో ఆడించే ప్రశ్నలేదని అంటూ జూనియర్ ఎన్టీఆర్ ను ఒక వ్యక్తితో తిట్టిన ఆడియో వైరల్ అయింది..ఆ ఆడియో నాది కాదు ఎవరో కావాలని నాపై కుట్రపడి ఇలా చేశారని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ఒక వీడియో సందేశం ద్వారా స్పష్టం చేశారు.. అయినప్పటికీ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు తమ నిరసనను కొనసాగిస్తూనే ఉన్నారు.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్ తో పాటు రాష్ట్రంలో మరో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహార శైలిపై దర్యాప్ చేసి ఇవ్వాలని పార్టీ ముఖ్యులను ఆదేశించారు. సీఎం ఎలాంటి చర్యలు తీసుకుంటాడు అన్నది పార్టీ కార్యకర్తల్లో చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత దూషణలు ఏంటి అని జూనియర్ ఎన్టీఆర్ ఆక్రోషం.

## తాడిపత్రి అరాచకాలపై సిట్‌తో విచారణ జరిపించాలి

### - తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి డిమాండ్

**అనంతపురం, ఆగస్టు 19 ప్రభాతవార్తబ్యూరో** అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఉన్నారా లేదా..? తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ అరాచకాలు చేస్తున్నారని, పోలీసులను అడ్డం పెట్టుకొని వైసిపి నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వైసిపి నేత, తాడపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. తాడిపత్రిలో జరుగుతున్న అరాచకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిట్ వేసి విచారం జరిపించాలని, సిట్‌తో విచారం జరిపిస్తే నేను తప్పులు చేశానో జేసీ ప్రభాకర్ రెడ్డి తప్పులు చేశారో తేలుతుందని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ..నేను వెదవలతో రాజకీయాలు చేయదలుచుకోలేదని.. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో జేసీ ప్రభాకర్ రెడ్డి లాంటి వారితో రాజకీయాలు చేయాల్సి వస్తోందన్నారు. నేను తాడిపత్రికి ఎక్కడ వస్తానో అని.. జెసి నిద్రలో కూడా కలవరించుకుంటున్నాడని ఆయన జోష్యం చెప్పారు. హైకోర్టు ఒక ఆర్డర్ ఇస్తే దానిని అమలు చేయకుండా.. నన్ను ఆపేందుకు 700 మంది పోలీసులను తాడిపత్రిలో పెడుతున్నారంటే పోలీసులు వ్యవస్థ ఏ విధంగా పనిచేస్తుందో అర్థమవుతోందన్నారు. రోజురోజుకీ పోలీసుల మీద ప్రజలకు నమ్మకం పోతుందని అని పెద్దారెడ్డి అభిప్రాయపడ్డారు. నేను ఇంటి నుంచి బయలుదేరగానే జెసి ప్రభాకర్ రెడ్డి తన ప్రైవేట్ సైన్యానికి, అనుచరులను ఇంటి వద్దకు రావాలంటూ మెసేజ్‌లు పెడుతున్నారన్నారు. పైగా తనను ప్రజలు అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

20-8P g7exHMNWJQE 11_20-8P g7exHMNWJQE.qxd 8/20/2025 12:34 AM Page 1





మంగళవారం కడెం ప్రాజెక్టును సందర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

# వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

## మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్,ఆగస్టు19, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టును ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరదనీటి ఇన్ఫ్లో,అవుట్ఫ్లోపై ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ఇప్పటికే 9 కోట్ల రూపాయల నిధులతో మరమ్మతు పనులు పూర్తిచేశామన్నారు.వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.భారీ వరదల కారణంగా పంట పొలాలు,నివాస గృహాలు,రహదారులు నష్టపోయాయని మంత్రి పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన అనంతరం సంబంధిత శాఖలు సర్వే చేసి,నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక పంపు తాయని, అనంతరం బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.వరద నీటిలో కొట్టుకుపోయిన ఒక మత్స్యకారుని కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయని,ఆ కుటుం బాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి అన్నారు.కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టి,స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపడతామని వెల్లడించారు.ప్రజలకు ఎలాంటిఇబ్బందులుతలెత్తకుండా ముందస్తు సమాచారం అందించాలని,అవసరమైన సహాయకచర్యలు వెంటనే చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వాగులు,నదులు,ప్రాజెక్టులోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకిషర్మిల, ఎమ్మెల్సీ దండేవిట్టల్,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్కుమార్,ఆర్డీఓ రత్నా కళ్యాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభకు తెలంగాణ ఉద్యోగుల జెఎసి మద్దతు

**హైదరాబాద్,ఆగస్టు19,ప్రభాతవార్త:** సి.పి.ఎస్ విధానం రద్దుచేయాలని కోరుతూ తెలంగాణ సి.పి.ఎస్ ఉద్యోగుల సంఘం టిజిసిపిఎస్ఈయు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సిపిఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని గినిరితిది చైర్మన్ వి లచ్చి రెడ్డి తెలిపారు.భద్రత లేని సి.పి.ఎస్ విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ దశాబ్దకాలంగా పోరాటం చేస్తున్న 2 లక్షల పై చిలుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులసంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచొరవ తీసుకుని సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుదనదరించాలని విజ్ఞప్తిచేశారు. పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# కాంగ్రెస్ను అబాసుపాలు చేయడానికి కుట్ర

## రాష్ట్రానికి వెంటనే యూరియా కోటా విడుదల చేయాలి

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్కుమార్ గౌడ్

**హైదరాబాద్,ఆగస్టు 19, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అబాసు పాలు చేయాలని బిజెపి,బిఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని టిపిసిసి చీఫ్ మహేష్కుమార్ గౌడ్ ఆరోపించారు. బిజెపి,బిఆర్ఎస్ లోపాయికార ఒప్పందంతోనే యూరియాను అడ్డుకుంటున్నారని ప్రజా స్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదు అని ఆయన ఆవేదన చెందారు.తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాను తక్షణమే కేంద్రం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మీద అక్కసుతో నే రాష్ట్రానికి రావాల్సిన వాటాను ఇవ్వట్లేదని అన్నారు. యూరియా కోసం ఇక్కడ రైతులు ఆందోళన చేస్తుంటే కిషన్ రెడ్డి ఢిల్లీలో పడుకుండని ఎద్దేవా చేశారు.కిషన్ రెడ్డి, బండి సంజయ్కి ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఇప్పటికే సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖ రాశారని గుర్తుచేశారు.

# గోబ్యాక్ నినాదాలతో అభివృద్ధి కుంటుపడుతోంది

## మాజీ పిసిసి చీఫ్ మాజీ ఎంపి హనుమంతరావు

**హైదరాబాద్,ఆగస్టు 19,ప్రభాతవార్త:** మార్వాడీ గో బ్యాక్ ఎక్కడి నినాదం ఇలాంటి నినాదాలలో అభివృద్ధి కుంటుపడుతుందని మాజీ పిసిసి చీఫ్ మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. గాంధీభవన్లో విలేఖరులతో మాట్లాడుతూ నిజాంకాలం నుంచి మార్వాడీలు ఇక్కడ వ్యాపారాలు చేస్తున్నారని వారిని వెనక్కిపోవాలని అనకూడదని హితవు చెప్పారు.రిలయన్స్, డీమార్ట్ లాంటి బడాకంపెనీలలో అన్ని వస్తువులు దొరుకుతున్నాయి, మరి వాళ్ళను ఎందుకు గోబ్యాక్ అనడంలేదని ప్రశ్నించారు. తరతరాలుగా మార్వాడీలు తెలంగాణలో ఉంటున్నారనీ మార్వా డీలను గో బ్యాక్ అనడం ఏంటి అని ఆయన ఆవేదన చెందారు.తెలంగాణ అభివృద్ధి జరుగు తుందని దీంతో ఇతరరాష్ట్రాల నుంచి చాలా మంది వస్తున్నారని ఆయన భాష్యం చెప్పారు. ఈ విధమైన నినాదాలతో అభివృద్ధి కుంటుపడుతుంది. రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తే తప్పకుండా ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచి వేయాలని సూచించారు. ఇది సరైన పద్ధతి కాదని తెలిపారు.

# యూజీ కోర్సుల కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థులకు ప్రవేశ ధ్రువపత్రం అందజేస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్,డా.శరత్ చంద్ర,తదితరులు

**అత్తాపూర్ ఆగస్టు19,ప్రభాతవార్త :** 2025-26 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని వివిధ యూజీ కోర్సులలో ప్రవేశాలకు మొదటి దశ కౌన్సిలింగ్ మంగళవారం ప్రారంభమైంది. రాజేంద్రనగర్లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరుగుతున్న ఈ కౌన్సిలింగ్కు పీజెటీఏయూ రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సీ హెచ్. విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా హాజరై లాంచనంగా ప్రారంభించారు.తెలంగాణ ఈఏపీసెట్ 2025లో 221 ర్యాంకు సాధించిన పిడిశెట్టి వర్షితకు రాజేంద్రనగర్ లోని వెటర్నరీ కళాశాలలో బివిఎస్సీలో ప్రవేశం కల్పిస్తూ వెటర్నరీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్రతో కలిసి ఆయన ధ్రువపత్రాన్ని అందజేశారు.262వ ర్యాంకు పొందిన రిగ్వేద్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ప్రవేశంపొందాడు.అలాగే 273ర్యాంకర్ సత్యనారాయణరెడ్డి, 276 ర్యాంకర్ మధుమిత, 316 ర్యాంకర్ ఆర్. మధుమిత, 362 ర్యాంకు పొందిన ఎస్. హరిచందన వరుసగా రాజేంద్రనగర్ లోని వెటర్నరీ కళాశాల మరియు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశం పొందారు.ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ తాము ఈ మూడు విశ్వవిద్యాల యాల్లోని కోర్సుల్లో చివరి సీటు నిండే వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ కోర్సులలో ఎంత కష్టపడి చదివితే అంత ఫలితం ఉంటుందని చెప్పారు. గుర్తింపు ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలలోనే చేరి మీ డిగ్రీలకు విలువను జోడించుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణలో కేవలం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి మాత్రమే ఐసీఎఆర్ గుర్తింపు ఉందని తెలిపారు.

ఈ సేమావే శంలో వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విశ్వవి ద్యాలయాల అధికారులు డాక్టర్ ఈశ్వరి, డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ రమణారావు, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర జయలక్ష్మితో పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక శ్రద్ధ

## ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**సికింద్రాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రధాన అస్పత్రులను కార్పరేట్ ఆస్పత్రుల కంటే మెరుగైన వైద్యం అందించే ఆస్పత్రులుగా తయారు చేయనున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు జరుపుతున్నట్లు వివరించారు. మంత్రి గాంధీ ఆస్పత్రిని సందర్శించి పేషెంట్లు, అటెండెంట్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆస్పత్రిలో డ్రైనేజ్ సమస్య, ఎలక్ట్రిసిటీ, ఫైర్ సర్వీసులు, నర్సింగ్ విభాగంలో కొరతలు ఉన్నాయని గుర్తించామని తెలిపారు. మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు అన్నీ ఒకే ఫ్లోర్లో ఉండాలనే అభిప్రాయాలు కూడా వచ్చినట్లు పేర్కొన్నారు.



రాష్ట్రంలో ఆస్పత్రుల సంఖ్య పెరిగినా, పరికరాలు సరిపోవడం లేదని, క్రిటికల్ కేసుల్లో స్టాఫ్ కొరత ఎక్కువగా ఉన్నందున దీనిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి వెల్లడించారు. పేషెంట్ అటెండెంట్ల కోసం ప్రత్యేకంగా అకామిడేషన్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని, సీఎస్ఆర్ కింద శాశ్వత నిర్మాణం చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

గాంధీ ఆస్పత్రిలో రెండు వేలకుపైగా బెడ్స్ ఉన్నందున వాటికి తగిన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. పాత పరికరాలను తొలగించి, కొత్త పరికరాలతో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఐవీఎఫ్ సెంటర్లలో నిబంధనలు అతిక్రమిస్తున్న కొన్ని క్లినిక్లపై చర్యలు ప్రారంభమయ్యాయని, కొన్నిటిని ఇప్పటికే మూసివేశామని వెల్లడించారు. అలాగే పెట్లబురుజు, కొండాపూర్లో కొత్త ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాట్లు జరుగుతున్నాయని ఇప్పటికే కొన్ని చోట్ల పాజిటివ్ ఫలితాలు వచ్చాయని వివరించారు. హాస్టల్ నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని, పరికరాల నిర్వహణ, స్టాఫ్ నియామకాలు వంటి అంశాలపై త్వరలోనే పూర్తి స్థాయి నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి దామో దర రాజనర్సింహ హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఈ సమస్యలను సీరియస్గా తీసుకుంటోంది త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన స్పష్టం చేశారు.

# నేటి నుంచి ఐ సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

## 28 వరకు ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి

### సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు

**సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 19:** రాష్ట్రంలోని ఎంబిఎ, ఎంసిఎ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ను సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 20నుంచి 28 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ను నిర్వహించడానికి షెడ్యూల్ను జారీ చేశారు. ఈ నెల 25 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. వెబ్ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

# కేన్సర్ రహిత తెలంగాణగా ప్రభుత్వ ప్రయత్నం

## కేన్సర్ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయులుతో మంత్రి దామోదర సమావేశం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 19:** తెలంగాణ రాష్ట్రాన్ని క్యాన్సర్ రహిత రాష్ట్రంగా చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హైదరాబాద్లోని సచివాలయంలో ప్రముఖ క్యాన్సర్ నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ సలహాదారులు నోరి దత్తాత్రేయులుతో మంత్రి మంగళవారం సమావేశమయ్యారు. సమావేశంలో నోరి దత్తాత్రేయులు రాష్ట్రంలో క్యాన్సర్ నిర్మూలనపై రూపొందించిన పలు అంశాలను పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ఐసిఎంఆర్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2025 సంవత్సరానికి 55 వేల కేసులు నమోదు అయ్యో అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ రహిత తెలంగాణగా తీర్చిదిద్దటానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన పలు అంశాలను మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చించారు. రాష్ట్రంలో ఎయే ప్రాంతంలో క్యాన్సర్ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయో వైద్య శాఖ అధికారులు నోటిపై చేయాలని మంత్రి ఆదేశించారు. క్యాన్సర్ బాదితుల డెటాను నమోదు చేసుకోవాలన్నారు. క్యాన్సర్ నివారణపై పరిశోదనలు నిర్వహించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో క్యాన్సర్ బాదితులకు మెరుగైన వైద్య సాయంను రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా సేవలను అందించడాన్ని స్వాగతించారు.90 శాతం క్యాన్సర్ రోగాలను రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సేవలలో కవర్ అవుతున్నాయన్నారు. నిమ్స్, ఎంఎన్జె క్యాన్సర్ అసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలున్నాయన్నారు. క్యాన్సర్ను తోలి దశలో గుర్తించేందుకు అన్ని జిల్లా ప్రభుత్వ అసుపత్రులలో క్యాన్సర్ లక్షణాలున్న వారిని గుర్తించిన వారికి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయాలని సూచించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ లో పాజిటివ్ వచ్చిన బాదితులను గుర్తించి వారిని సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే అసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ అసుపత్రులలో క్యాన్సర్ బాదితుల కోసం డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. నిమ్స్లో క్యాన్సర్ చికిత్సలను అందిస్తున్న సమాచారం ప్రజలకు తెలిసేలా క్యాన్సర్ అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. క్యాన్సర్పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండేలా ప్రమోషన్ల కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. క్యాన్సర్ బాధితుల వైద్యం కోసం ప్రతి 100 కిలోమీటర్ల పరిధిలో చికిత్స అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ క్యాన్సర్ బాధితులకు అందిస్తున్న పలు సేవలను మంత్రి దామోదర రాజనర్సింహ డాక్టర్ నోరి దత్తాత్రేయులకు వివరించారు. క్యాన్సర్పై అవగాహన కోసం వర్క్ షాపులను ప్రతి మెడికల్ కాలేజీలో నిర్వహించాలని మంత్రి వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ కేంద్రాలను పెద్ద ఏత్తున ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిని రేగ్యూలర్గా క్యాన్సర్ స్క్రీనింగ్ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తొలి దశలో క్యాన్సర్ను గుర్తించేందుకు వైద్యశాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# సిఆర్పిఎఫ్ను హడలెత్తిస్తున్న నకిలీ యాప్

## కీలక సమాచారం విద్రోహులకు చేరవేసేందుకు సైబర్ నేరగాళ్ల కుట్ర

### జాగ్రత్తలు వహించాలని కేంద్ర హోం శాఖ హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** కేంద్ర పారా మిలటరీ బలగాలలో అగ్రగామి అయిన సిఆర్పిఎఫ్ సిబ్బందిని నకిలీ యాప్ హడలెత్తిస్తోంది. సిఆర్పిఎఫ్ సిబ్బంది కోసం రూపొందించిన అసలు యాప్తో పోలివున్న ఈ నకిలీ యాప్ పేరు సంభవ్ అప్లికేషన్ రైటర్. ఈ యాప్ అసలు యాప్ ను పోలి వుండడంతో సిఆర్పిఎఫ్ సిబ్బంది తమ రోజువారి కార్యకలాపాల నిర్వహణ సమయంలో కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నకిలీ యాప్ను సిఆర్పిఎఫ్ సిబ్బంది ఎవరైనా వాడేందుకు ప్రయత్నిస్తే వ్యక్తిగత సమాచారం అడుగుతోందని, దీనివల్ల భద్రతాపరమైన అంశాలు విద్రోహులకు చేరే వీలుందని సిఆర్పిఎఫ్ ఐటి విభాగం చెబుతోంది. కాగా ఈ నకిలీ యాప్ వాట్సాప్, యూట్యూబ్ వేదికలపై ప్రచారం అవుతుంద ని, దీనినే అధికారిక వెబ్సైట్గా నమ్మిస్తోందని సిఆర్పిఎఫ్ ఐటి విభాగం చెబుతోంది. సిఆర్పిఎఫ్ సిబ్బంది కొన్నేళ్లుగా నక్సల్స్ ఆపరేషన్లలో పాల్గొంటుండడంతో పాటు విమానాశ్రయాలు, జాతీయ సంస్థలు, ప్రముఖుల భద్రత పర్యవేక్షిస్తున్నాయి. ఈ క్రమంలో సిఆర్పిఎఫ్ సిబ్బంది రోజువారి అవసరాలకు అధికారిక వెబ్సైట్ సంభవ్ యాప్ ఎంతగానో దోహదం చేస్తోంది. కాగా అసలు యాప్ను రోజువారి కార్యకలాపాలకు వాడే సమయం లో సిఆర్పిఎఫ్ సిబ్బందికి వున్నట్లుండి కొన్నిసార్లు నకిలీ యాప్ ప్రత్యక్షమవుతోందని, దీనిని ఉపయోగించాలంటే సంబంధిత అధికారి లేదా సిబ్బంది వ్యక్తిగత ఐడితో పాటు ఏ యూనిట్లో పనిచేస్తున్నారనే వివరాలు కోరుతోందని, ఇతర సున్నితమైన వివరాలు అడుగుతోందని సిఆర్పిఎఫ్ ఐటి విభాగం చెబుతోంది. వాస్తవానికి ఇవన్నీ దేశ భద్రతకు సంబంధించిన కీలక అంశాలు కాగా వీటిని కొందరు సైబర్ నేరగాళ్లు దొంగిలించి విద్రోహుల కు అమ్మేందుకు యత్నిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అనుమానిస్తోంది. సిఆర్పిఎఫ్ విభాగం కోసం సిఆర్పిఎఫ్ సంభవ్ యాప్ వుండగా సైబర్ నేర గాళ్లు సంభవ్ అప్లికేషన్ రైటర్ పేరిట నకిలీ యాప్ను వాడుకలో తెచ్చారు. ఈ నకిలీ యాప్ కూడా సిఆర్పిఎఫ్ అధికారిక యాప్లోని అనేక అంశాలను చూపుతోందని హోంశాఖ పరిశీలనలో వెల్లడయ్యింది. నకిలీ యాప్ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్ర హోం శాఖ దీనిని వెంటనే గూగుల్ ప్లే స్టోర్ వంటి ప్లాట్ ఫామ్ల నుంచి తొలగించాలని సైబర్ భద్రతా సంస్థలను కోరింది. ఇదే సమయంలో సిఆర్పిఎఫ్కు సంబంధించిన అన్ని యూనిట్ల అధికారులకు నకిలీ యాప్ విషయంలో జాగ్రత్తలు వహించాలని ఆదేశించింది. తమ తమ యూనిట్లలోని అందరు అధికారులు, సిబ్బ ందికి నకిలీ యాప్ విషయంలో జాగ్రత్తలు వివరించి వాటిని పాటించేలా చూడాలని కేంద్ర హోం శాఖ కోరింది. నకిలీ యాప్ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరూ డౌన్ లోడ్ చేసుకోవద్దని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి ఎలాంటి సమాచారం వెల్లడించవద్దని కేంద్రం ఆదేశించింది.

# ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బిసిని ఎందుకు ప్రకటించలేదు?

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా కాంగ్రెస్పార్టీ బిసి వ్యక్తిని ఎందుకు ప్రకటించలేదని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మాట్లాడారు. ఇండియా కూటమి నేతల సమావేశంలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ప్రకటించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి, తెలంగాణకు చెందిన రిటైర్డ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును అభ్యర్థిగా ప్రకటించారు.




ఏ రాజకీయ పార్టీకైనా, ఏ కూటమికైనా వారి ఇష్టానుసారం అభ్యర్థిని ప్రకటించుకోవచ్చు కానీ దీనిపై ఎవరికి అభ్యంతరం లేదు. అయితే, కాంగ్రెస్ పార్టీ చెప్పేది వేరు, చేసేది వేరుగా ఉందన్నారు. ఆచరణలో చెప్పింది కనిపించడం లేదు. సమతుల్యత ఏమీ పాటించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ రాజకీయాలు, రాహుల్ గాంధీ రాజకీయాలు, ప్రత్యేకంగా కాంగ్రెస్ రాజకీయాలు తెలంగాణ చుట్టే తిరుగుతున్నాయని, నిత్యం కాంగ్రెస్ పార్టీ బిసి జపమే చేస్తుంది. కానీ అభ్యర్థుల ఎంపికలో మాత్రం ఈ రాష్ట్రంలో గాని, దేశంలో గాని ఒక్క ఒబిసి అభ్యర్థి కూడా దొరకకపోవడం కాంగ్రెస్ పార్టీ దుస్థితిని బయటపెట్టిందన్నారు. రాహుల్ గాంధీ తానే ఓబిసిల ఉద్ధారకుడని చెప్పుకుంటున్నాడు. ఆయన తర్వాత రేవంత్ రెడ్డి తెలంగాణనే రోల్ మోడల్ అంటున్నాడు. కానీ వీరి మాటలు, మాయమాటలే తప్ప ఆచరణలో ఏదీ జరగడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, నిజానికి బిసి వ్యతిరేక ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా కనీసం ఒక బిసి అభ్యర్థిని కూడా రెఫర్ చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ పార్టీ పడిందన్నారు.

# బాలసదనాల్లో పెద్దఎత్తున ఖాళీలు

## పలు కేటగిరిల్లో 267 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తింపు

### భర్తీకి ప్రతిపాదనలు రూపొందిస్తున్న మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు

**హైదరాబాద్,ఆగస్టు18 ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటైన బాలసదనాలు,జిల్లా స్థాయి శిశు సంరక్షణ యూనిట్లలో పలు కేటగిరీల్లో 267 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి.నవజాత శిశువు మొదలు ఆదేళ్లలోపు ఉన్న చిన్నారుల సంరక్షణలో ఈ గృహాలు కీలక పాత్ర పోషిస్తాయి.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 17 శిశుగృహాలు,బాలసదనాలున్నాయి.వీటితో పాటు రాష్ట్రమహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ కమిషనరేట్ పరిధిలో శిశువిహార్ఉంది.మంజూరైన పోసుల్లో దాదాపు 60 శాతానికి పైబడి ఖాళీగా ఉన్నట్లు సమాచారం. పారామెడి ఈ గృహాల్లో మొత్తం 32 మంది వైద్యులు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 8 మంది మాత్రమే కొనసాగుతున్నారు.నర్సుల కేటగిరిలో 70 శాతం మేర పోస్టులు ఖాళీగా ఉన్నాయి.ఇవి కాకుండా సూపరింటెండెంట్, మ్యాట్రిన్స్,నైట్ వాచ్మెన్ పోస్టులు కూడా పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి.రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా స్థాయి శిశు కేంద్రాల్లో చాలా కేటగిరిల్లో వేకెన్సీ ఉంది.శిశు గృహాల్లో మొత్తం 267 పోస్టులు ఖాళీగా ఉండగా జిల్లా స్థాయి శిశు సంరక్షణ కేంద్రాల్లో 67 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రాష్ట్ర మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు గణాంకాలు వెల్లడించారు.వీటి భర్తీకి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వ అనుమతి కోసం పంపాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# కేంద్రమంత్రి నడ్డాను కలిసిన గువ్వల బాలరాజు

**హైదరాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** బిజెపి జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాను మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు మర్యాదపూర్వకంగా కలిసారు. మంగళవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవలే మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు బిజెపిలో చేరిన సంగతి తెలిసిందే. ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు పార్లమెంటరీ బోర్డు సభ్యులు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్సైతం నడ్డాను మర్యాదపూర్వకంగా కలిసారు.

# ఎస్సీ గురుకులాలను ఆకస్మిక తనిఖీ చేసిన అలగు వర్షిణి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 19:** రాష్ట్రంలోని పలు ఎస్సి గురుకుల విద్యాసంస్థలను సొసైటీ కార్యదర్శి, ఎస్సి సంక్షేమ శాఖ కమిషనర్ అలగు వర్షిణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిగి, కొడంగల్, మద్దూరు, శంకర్పల్లి ప్రాంతాల్లోని గురుకులాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తనిఖీల్లో స్పెషల్ ఆఫీసర్ వెంకట రెడ్డి, జాయింట్ సెక్రటరీ (అకడమిక్) సక్రూ నాయక్, డిప్యూటీ సెక్రెటరి రజినీ, ఇంజనీర్లు పాల్గొన్నారు. పరిగి గర్ల్స్ జూనియర్ కాలేజీని సందర్శించి అక్కడ విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం, వసతి, బోధన విధానాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కామన్ మెనూ పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. రోజువారీగా అందిస్తున్న భోజనం రుచి, నాణ్యతపై ఎలాంటి సమస్యలూ లేవని విద్యార్థులు తెలిపారు. అంతేకాకుండా మైక్రో షెడ్యూల్ ( పాఠ్య ప్రణాళిక )వల్ల పోటీ పరీక్షలకు మరింత సమగ్రంగా సిద్ధమయ్యే అవకాశం కలుగుతోందని తమ ఆనందాన్ని సెక్రటరీతో పంచుకున్నారు. కొడంగల్ బాయ్స్ జూనియర్ కాలేజీని సందర్శించారు.కొడంగల్లో విద్యార్థుల క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని కార్యదర్శి ప్రకటించారు. శంకర్పల్లి (గొలిదొడ్డి విస్తరణ)లో నడుస్తున్న ప్రత్యేక కోచింగ్ సెంటర్ను కూడా సెక్రటరీ అలగు వర్షిణి పరిశీలించారు.

# భారత్ ఐటీ, టెలికం రంగాల పితామహుడు రాజీవ్ గాంధీ

## రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 19:** భారత ఐటీ, టెలికం రంగాల పితామహుడు మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా నివాళులు అర్పించారు. భారత్లోకి టెక్నాలజీని తీసుకొచ్చిన రాజీవ్ గాంధీని కంప్యూటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా అని పిలుస్తారని అన్నారు. 21వ శతాబ్దిలో దేశాన్ని కొత్త దిశగా నడిపించి దిశానిర్దేశం చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్మరించుకున్నారు. ప్రపంచంతో ఇండియా పోటీపడేలా అడుగులు వేయించారని.

# ఎసిబి వలలో తహశీల్దార్, సర్వేయర్

## పాసుబుక్కులో జెండర్ మార్పుకు లంచం డిమాండ్

### రూ.50 వేలు తీసుకొని మరో లక్ష డిమాండ్తో పట్టుబడ్డ అధికారులు

**ఆమనగల్లు, ఆగస్టు19, ప్రభాతవార్త:** ఆమనగల్లు తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. గంటల తరబడిగా చేపట్టిన సోదా, విచారణలో అధికారులు తహశీల్దార్ చింతకింది లలిత, సర్వేయర్ కోటరవిలు అవినీతికి పాల్పడినట్లు రుజువు కావడంతో ఏసిబి అధికారులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు.బాధితుని ఫిర్యాదు మేరకు తెలంగాణ ఏసిబి రేంజ్ సిటి2 యూనిట్ అధికారులు ఆమనగల్లు తహశీల్దార్ కార్యాలయంపై దాడులు చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన దాడులు మధ్యాహ్నం 4గంటల వరకు కొనసాగించారు. ఏసిబి అధికారి తెలిపిన వివరాల ప్రకారం భూమిపాసుపుస్తకంలో జెండర్ సవరణ కొరకు రెండు వారాల క్రితం ఒకవ్యక్తి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారని, అందుకు గాను తహశీల్దార్ సిహెచ్ లలిత రూ.50 వేలు లంచం డిమాండ్ చేయడంతో సదరు వ్యక్తి ధరణి ఆపరేటర్ ద్వారా ముట్టజెప్పినట్లు తెలిపారు. అట్టి పని పూర్తి కాకపోవడంతో బాధితుడు తిరిగి వారంరోజుల తరువాత కార్యాలయానికి వచ్చి జెండర్ మార్పు గురించి మరోసారి తహశీల్దార్ను అడిగినట్లు ఏసిబి అధికారి తెలిపారు. దీంతో తహశీల్దార్ మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని సదరు వ్యక్తికి సూచించారన్నారు. బాధితుడు మీసేవలో ప్రయత్నించగా సర్వర్ సమస్య వస్తుందన్న విషయాన్ని తహశీల్దార్కు వివరించాడు. దీంతో



మీసేవతోపాటు జెండర్ ప్రక్రియ కూడా మేమే చేస్తామని చెప్పి తహశీల్దార్ లలిత, సర్వేయర్ కోటరవిలు కలిసి మరో లక్ష రూపాయాలు అదనంగా డిమాండ్ చేశారన్నారు. దీంతో బాధితుడు రెండు వారాల క్రితం ఏసిబి సిటి2 యూనిట్ అవినీతి నిరోధకశాఖ అధికారులను ఆశ్రయించిన్నట్లు ఏసిబి అధికారి వివరించారు. దీంతో కేసు నమోదు చేసుకుని దాడులు చేసినట్లు ఆయన తెలిపారు.

విచారణలో తహశీల్దార్ లలిత 50వేలు లంచం తీసుకున్నట్లు, మరో లక్ష అదనంగా డిమాండ్ చేసినట్లు నిర్ధారించుకుని ఇరువురిని అరెస్టు చేసినట్లు ఏసిబి అధికారి వెల్లడించారు.

## సింక్‌ఫీల్డ్ కప్ విజేతగా ప్రజ్ఞానంద



**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్, సింక్‌ఫీల్డ్ కప్-2025 విజేతగా భారత్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రమేష్‌బాబు నిలిచాడు, ఈ విజయం ప్రజ్ఞానందను ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 3వ స్థానానికి చేర్చింది. అంతేకాకుండా ప్రత్యక్ష రేటింగ్‌లో అమెరికన్ గ్రాండ్ మాస్టర్ ఫాబియానో కరువానాను కూడా అధిగమించాడు. మిస్సోరీలోని సెయింట్ లూయిస్‌లో మంగళవారం సింక్‌ఫీల్డ్ కప్ ప్రారంభ రౌండ్‌లో ప్రజ్ఞానంద ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజును ఓడించాడు. తెల్లటి పావులతో ఆడుతున్న ప్రజ్ఞానంద, గుకేష్‌పై ఆధిపత్యాన్ని సంపాదించి అతడిని ఓడించాడు. ఈ నేపథ్యంలో 36 కదలికలలో ప్రపంచ ఛాంపియన్ పదవి నుంచి రాజీనామా చేయవలసి వచ్చింది. ఆట ప్రారంభంలో గుకేష్ స్వల్ప పొరపాటు చేసి, అభివృద్ధిలో వెనుకబడ్డాడు. ప్రజ్ఞానంద ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. గుకేష్ పోరాటాన్ని ప్రదర్శించినప్పటికీ, సింక్‌ఫీల్డ్ కప్‌లో తన కెరీర్‌లో తొలి విజయం కోసం ప్రజ్ఞానంద ఆధిక్యాన్ని కోల్పోకుండా చూసుకున్నాడు. ఈ విజయం మూడు సంవత్సరాలలో క్లాసికల్ చెస్‌లో గుకేష్‌పై ప్రజ్ఞానంద సాధించిన తొలి విజయాన్ని కూడా సూచిస్తుంది. అతను చివరిసారిగా 2022లో గుకేష్‌ను ఓడించాడు. అంతేకాకుండా, ఈ విజయం ప్రజ్ఞానందను లైవ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ముందుకు తీసుకెళ్లింది. అతను ఇప్పుడు 2784 లైవ్ రేటింగ్‌తో ప్రపంచంలో 3వ స్థానంలో ఉన్నాడు, 2783.2తో మూడవ స్థానంలో ఉన్న ఫాబియానో కరువానాను అధిగమించాడు.

### ఆసియా కప్ కోసం టీమిండియా

## కెప్టెన్‌గా సూర్య

### గిల్‌కు వైస్, బుమ్రా, సంజుకు చోటు



**న్యూఢిల్లీ:** ఆసియా కప్ కోసం ఖరారు చేసిన 15 మంది సభ్యులతో కూడిన జట్టులో శుభ్‌మాన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా, సంజు సామ్సన్‌లు ఎంపికయ్యారు. మంగళవారం మధ్యాహ్నం ప్రకటించిన ఈ జట్టుకు సూర్యకుమార్ యాదవ్ నాయకత్వం వహిస్తారు మరియు గిల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ లను నియమించబడిన స్పిన్నర్లుగా ప్రకటించారు. పేస్ అటాక్‌లో ముగ్గురు స్పెషలిస్ట్‌లు మాత్రమే ఉన్నారు. బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్-సీమ్-బౌలింగ్ ఎంపిక కాగా, హార్దిక్, శివమ్ చోటు దక్కించుకున్నారు. ఆసియా కప్ కోసం ఖరారు చేసిన టీమిండియా పూర్తి జట్టులో సూర్యకుమారన యాదవ్ (కెప్టెన్), శుభమన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), హర్షిత్ సింగ్ రాణా ఉండగా, ఐదు స్టాండ్ బైలుకు సంబంధించి ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ ఉన్నారు.

## వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్‌కు ప్లేస్ నిల్

### ఆల్‌రౌండర్లలో దక్కని స్థానం.. అఫ్గానిస్థాన్ ప్లేయర్లదే హవా



**న్యూఢిల్లీ:** ఐసీసీ వన్డే ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో ఆసియా ఆటగాళ్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ క్రికెట్‌లో ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌ను నిర్ణయించే ఐసీసీ తాజాగా వన్డే ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఈసారి ర్యాంకింగ్స్‌లో ఆసియా క్రికెటర్లు ఆధిపత్యం చెలాయించారు. ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్ ఆటగాళ్ళ అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించారు. అయితే, ఈ ర్యాంకింగ్స్‌లో ఆశ్చర్యపరిచే విషయం ఏమిటంటే టాప్5లో ఒక్క భారత ఆటగాడికి కూడా చోటు దక్కలేదు.

ముఖ్యంగా, అఫ్గానిస్తాన్ క్రికెటర్లు అద్భుతమైన ప్రదర్శనతో టాప్ 2 స్థానాలను కైవసం చేసుకున్నారు. జింబాబ్వే, బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌కు చెందిన స్టార్ ఆటగాళ్లు కూడా టాప్ 5లో చోటు దక్కించుకున్నారు. ఈ తాజా ర్యాంకింగ్స్‌లో టాప్5లో అఫ్ఘనిస్తాన్ యువ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 296 రేటింగ్‌తో మొదటి స్థానంలో నిలిచాడు. 2025లో లాహోర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో అతను అద్భుత ప్రదర్శన చేసి, తన కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ సాధించాడు. అలాగే సీనియర్ ప్లేయర్, అఫ్ఘనిస్తాన్ మాజీ కెప్టెన్ మహ్మద్ నబీ 292 రేటింగ్‌తో రెండో స్థానంలో ఉన్నారు. నబీ చాలా కాలంగా అఫ్ఘన్ జట్టుకు వెన్నెముకగా నిలిచారు.

2017లో గ్రేటర్ నోయిడాలో ఐర్లాండ్‌పై అతను తన కెరీర్ బెస్ట్ 350 రేటింగ్ సాధించారు. ఇక జింబాబ్వే స్టార్ ఆల్ రౌండర్ సికిందర్ రజా 290 రేటింగ్ పాయింట్‌లతో మూడో స్థానంలో ఉన్నారు. అతను తన జట్టు కోసం బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ నిలకడగా రాణిస్తున్నాడు. 2024లో పాకిస్తాన్‌పై అతను 299 రేటింగ్ సాధించారు. బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ మెహదీ హసన్ మిరాజ్ 249 రేటింగ్‌తో నాలుగో స్థానంలో ఉన్నారు. 2022లో మీర్‌పూర్‌లో భారత్‌పై అతను కెరీర్ బెస్ట్ 295 రేటింగ్ సాధించారు. టాప్ 5లో న్యూజిలాండ్ స్థానం సంపాదించింది. న్యూజిలాండ్ ఆల్ రౌండర్ మైఖేల్ బ్రేస్‌వెల్ 246 రేటింగ్ పాయింట్‌లతో ఐదో స్థానంలో ఉన్నారు. 2025లో బే ఓవల్‌లో పాకిస్తాన్‌పై అతను తన కెరీర్ బెస్ట్ రేటింగ్ నమోదు చేశారు.





### యూరప్ స్మాష్‌లో..

## శ్రీజ, ఠక్కర్ సంచలన విజయం

### 3-2 తేడాతో మనికా ఓటమి

**న్యూఢిల్లీ:** యూరోప్ స్మాష్‌లో తెలంగాణ ప్లేయర్ అకుల శ్రీజ మానికా బాత్రాను ఓడించగా, పురుషుల విభాగంలో మానవ్ ఠక్కర్ ప్రపంచ 23వ ర్యాంక్‌ను ఓడించాడు. స్వీడన్‌లో జరిగిన డబ్ల్యూటీటీ యూరప్ స్మాష్‌లో నిర్వహించిన అఖిల భారత మహిళల సింగిల్స్ పోరులో శ్రీజ అకుల మణికా బాత్రాపై విజయం సాధించింది. ప్రపంచంలోనే అత్యధిక ర్యాంక్ పొందిన భారత మహిళల సింగిల్స్ ప్యాడ్లర్ అయిన అకుల, 2025 సీజన్‌లో పేలవమైన ఫామ్‌తో మరింతగా విస్తరించిన అనుభవజ్ఞురాలైన బాత్రాపై 3-2 తేడాతో సంచలన విజయం సాధించి తన సత్తా చాటింది. తొలి గేమ్‌ను 5-11 తేడాతో ఓడించిన అకులకు అంతగా మంచి ఆరంభం లభించలేదు, కానీ ఆ తర్వాతి రెండు గేమ్‌లను 11-9, 15-13 తేడాతో గెలిచింది.

బాత్రా పుష్‌ఓవర్ ద్వారా నాల్గవ గేమ్‌ను 12-10 తేడాతో ఆధిక్యం సాధించినా, ఐదవ గేమ్‌లో అకుల 11-8 తేడాతో గెలిచి, 45 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించింది. ఇక పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో మానవ్ ఠక్కర్ జపాన్‌కు చెందిన ప్రపంచ 23వ ర్యాంకర్ హిరోటో షినోజుకాపై సంచలన విజయం సాధించాడు. భారత పురుషుల సింగిల్స్ ప్యాడ్లర్‌లో అత్యున్నత ర్యాంక్ పొందిన థక్కర్, షినోజుకాపై ఆధిపత్యం సంపాదించాడు.

భారత ఆటగాడు కేవలం 30 నిమిషాలకు పైగా జరిగిన ఈ పోటీలో 12-10, 11-5, 5-11, 11-8 తేడాతో గెలిచి రెండవ రౌండ్‌లోకి అడుగుపెట్టాడు. పురుషుల డబుల్స్ భారత్ జోడీ థక్కర్ మనుష్ షా, మిక్స్‌డ్ డబుల్స్ జత షాదియా చిటాలే మొదటి రౌండ్ బైలు పొందారు.

### షూటింగ్ ఛాంపియన్‌షిప్..

## కపిల్‌కు స్వర్ణం

### మనుకు డబుల్ కాంస్య పతకాలు







**న్యూఢిల్లీ:** 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్‌లో భారత్ ఖాతాలో తొలి స్వర్ణం నమోదైంది. ఎయిల్ పిస్టల్ విభాగంలో కపిల్ బైన్సా స్వర్ణ పతకం, వ్యక్తిగత విభాగంలో డబుల్ మెడలిస్ట్ మను భాకర్ ఒక కాంస్య పతకాన్ని సాధించారు. అంతేకాకుండా జట్టు విభాగంలో ఒలింపిక్ మను భాకర్, సురుచి సింగ్, పాలక్ గులియాతో కూడిన భారత్ బృందం కాంస్య మరో పతకం సాధించింది. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో మంగళవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పురుషుల జూనియర్ ఫైనల్‌లో భారత్ షూటర్ కపిల్ బైన్స్లా 243.0 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. కపిల్ క్వాలిఫికేషన్‌లో 579 పాయింట్లు సాధించి 4వ స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో బ్లాక్‌ల వెలుపల అత్యంత వేగంగా ఆడిన ఆటగాడు ఇల్ఖోంబెక్‌ను కపిల్ 15వ షాట్ తర్వాత మొదటిసారి దాటాడు. 20వ షాట్ తర్వాత ఉజ్బెక్ చివరి రెండు షాట్‌లకు కపిల్ కంటే ముందున్నాడు. అయితే ఆ తర్వాత కపిల్ 10.8 మరియు 10.6తో ముగించగా, ఇల్ఖోంబెక్ తన 23వ రేసులో 10.4తో దూసుకెళ్లి 9.4తో ముగించి కపిల్‌కు టైటిల్‌ను అందించాడు. కాగా రెండవ రోజు రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత మను భాకర్ రెండు కాంస్య పతకాలతో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. 23 ఏళ్ల మను 219.7 పాయింట్లు సాధించింది. మను భాకర్, సురుచి ఫోగట్ మరియు పాలక్ గులియాలతో కూడిన భారత త్రయం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ జట్టు విభాగంలో 1730 స్కోరుతో కాంస్యం గెలుచుకుంది. వ్యక్తిగతంగా అర్హత రౌండ్‌లో, మను చివరి షాట్‌లలో పరిపూర్ణ 100 పరుగులు సాధించి, 583 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచింది. ఫైనల్లో మను మొదటి ఐదు షాట్ల తర్వాత 50.3 పాయింట్లతో ఐదవ స్థానంలో నిలిచింది. తదుపరి క్రమంగా పాయింట్లను పెంచుకునే యత్నం చేయడంతో పదకొండవ షాట్‌లో బలమైన 10.5 స్కోరుతో ఆమె రెండవ స్థానానికి ఎగబాకింది.

# వాణిజ్యం





### నాల్గో రోజూ

## లాభాల్లో సూచీలు

### రూ.25 వేలకు చేరువలో నిఫ్టీ

**హైదరాబాద్,ఆగస్టు19, ప్రభాతవార్త:** జీఎస్టీ విషయంలో కేంద్రం తలపెట్టిన సంస్కరణలు, రష్యా ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చల్లో పురోగతి కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ సూచీలను ముందుండి నడిపించాయి. ఇతర ఆటోమొబైల్ షేర్లు కూడా రాణించడం సూచీలకు కలిసొచ్చింది. గడిచిన నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1400 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 25 వేల స్థాయికి చేరువైంది. సెన్సెక్స్ ఉదయం 81,319.11 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,273.75) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కొనసాగిన సూచీ.. ఇంట్రాడేలో 81,755.88 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 370.64 పాయింట్ల వద్ద 81,644.39 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 103.70 పాయింట్ల లాభంతో 24,980.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.95గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, రిలయన్స్, ఎటెర్నెల్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బజాజ్ ఫినసర్వ్, పవర్గ్రిడ్ కార్పొరేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్సీఎల్ టెక్నాలజీస్, బీఈఎల్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.81 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3343 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఆసికా మార్కెట్లు చాలావరకు నష్టాల్లో ముగియగా ఐరోపా మార్కెట్లు లాభాలతో ట్రేడింగ్ ఆరంభించాయి.

# అమెజాన్‌లో కొలువుల జాతర

### పండుగ సీజన్‌లో 1.50 లక్షల జాబ్స్

### భర్తీకి 400కుపైగా నగరాల్లో రిక్రూట్‌మెంట్!

### వరంగల్, గుంటూరు, రాజమండ్రి తదితర నగరాల్లోనూ ఉద్యోగ అవకాశాలు





**హైదరాబాద్,ఆగస్టు 19, ప్రభాతవార్త:** పండుగ సీజన్‌లో ఏకంగా 1.50 లక్షల మందికిపైగా ఉద్యోగులను భర్తీ చేసేందుకు ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ రెడీ అవుతోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం లాంటి పెద్ద నగరాలతో పాటు వరంగల్, గుంటూరు, రాజమండ్రి లాంటి చిన్న నగరాల్లోనూ జాబ్ రిక్రూట్‌మెంట్లు చేయబోతోంది. పండుగల సీజన్ వస్తోంది. ఆగస్టు 26న వినాయక చవితి, సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు నవరాత్రులు, అక్టోబరు 2న దసరా, అక్టోబరు 21న దీపావళి పండుగలు ఉన్నాయి. ఏటా ఈ ఫెస్టివల్ సీజన్‌లో అమెజాన్‌కు ఆర్డర్లు వెల్లువెత్తుతుంటాయి. వాటిని కస్టమర్లకు సకాలంలో డెలివరీ చేయడానికి అమెజాన్‌కు అదనపు మానవ వనరులు అవసరం. అందుకోసమే ఏటా పండుగల సీజన్‌లో ఉద్యోగాలను భర్తీ చేస్తుంటుంది. ఈ ఉద్యోగాల్లో భర్తీ అయ్యేవారు అమెజాన్‌కు చెందిన ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, సార్టేషన్ హబ్‌లు, డెలివరీ స్టేషన్లలో వివిధ విధులను నిర్వర్తిస్తారు. అమెజాన్ ఏటా పండుగల సీజన్‌లో ఉద్యోగాలను భర్తీ చేస్తుంటుంది. అయితే మునుపటి కంటే అత్యధికంగా ఈదఫా 1.50 లక్షల మందికిపైగా యువతకు ఉద్యోగాలను ఇవ్వబోతోంది. ఇప్పటివరకు అమెజాన్ నిర్వహించిన అతిపెద్ద సీజనల్ ఉద్యోగ నియామక డ్రైవ్ ఇదేనని అంటున్నారు. ఈసారి దేశంలోని చిన్న నగరాలు, పట్టణాలను కూడా ఈ డ్రైవ్‌లో భాగం చేశారు. దీనివల్ల దాదాపు 400కుపైగా నగరాల్లోని యువతకు ఉద్యోగ అవకాశాలు లభించబోతున్నాయి. వారంతా తమతమ ఇళ్లకు సమీపంలోనే ఉంటూ, అమెజాన్‌లో ఉద్యోగాలు చేసుకోవచ్చు. అమెజాన్‌కు చెందిన ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, సార్టేషన్ హబ్‌లు, డెలివరీ స్టేషన్లలో ఉండే ఖాళీలను అమెజాన్ భర్తీ చేయబోతోంది. ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ల ద్వారా ఆర్డర్ల స్వీకరణ, నిల్వ, ప్యాకింగ్, పంపిణీ వంటి పనులన్నీ జరుగుతాయి. అమెజాన్ ఆర్డర్ల ప్యాకేజ్‌లు నేరుగా సార్టేషన్ హబ్‌లకు చేరుకుంటాయి. వాటిని అక్కడ వివిధ ఏరియాల వారీగా వేరు చేస్తారు. అనంతరం వాటిని కస్టమర్ అడ్రస్‌కు డెలివరీ చేస్తారు. ఇక డెలివరీ స్టేషన్లలో అమెజాన్ ఆర్డర్ల ప్యాకేజ్‌లను పంపిణీ కోసం సరిగ్గా, సవ్యంగా సిద్ధం చేస్తారు. అమెజాన్‌లో అసోసియేట్‌లుగా ఉద్యోగాలు పొందేవారు కస్టమర్ల ఆర్డర్లను స్వీకరించడం, ప్యాకింగ్, సార్టింగ్, లాస్ట్ మైల్ డెలివరీ వంటి పనులు చేయాల్సి ఉంటుంది. అమెజాన్ ఇచ్చేవి సీజనల్ ఉద్యోగాలే అయినప్పటికీ, కొందరు పండుగ సీజన్ తర్వాత కూడా కంటిన్యూ అవుతుంటారు. ఇంకొందరు ఏటా పండుగల సీజన్‌లలో అమెజాన్ కోసం సేవలు అందిస్తుంటారు. లాజిస్టిక్స్, ఈ కామర్స్‌లో అనుభవం పొందాలని భావించే యువతకు ఈ ఉద్యోగాలు మంచి అవకాశం. అమెజాన్‌లో ఉద్యోగాలు పొందే వారికి నెలవారీ వేతనంతో పాటు మరిన్ని సౌకర్యాలు, ప్రయోజనాలు లభిస్తాయి. ఆఫీసుల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాష్‌రూమ్‌లతో పాటు గోదాంలలో విశ్రాంతి గదులు ఉంటాయి. పెద్ద అమెజాన్ కేంద్రాలలో ఏసీ టిఫిన్ సెంటర్లు కూడా ఉంటాయి. ఉద్యోగులకు వైద్యసాయం అందించేందుకు శిక్షణ పొందిన నర్సులతో యామాకేర్ ప్రథమ చికిత్స కేంద్రాలను నిర్వహిస్తారు. మెరుగైన వైద్యం అవసరమైతే ఉద్యోగులను ఇతర ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారు. తీవ్రమైన ఎండలు, వర్షాలు ఉన్నప్పుడు, అందుకు అనుగుణంగా ఉద్యోగాల డ్యూటీ టైంలను సర్దుబాటు చేస్తారు. అమెజాన్ ఉద్యోగులు ముందస్తు చెల్లింపు కార్యక్రమంతో ప్రయోజనాన్ని పొందొచ్చు. ఇందులో భాగంగా వారు శాలరీ పడే తేదీ కంటే ముందే వేతనంలో 80 శాతం భాగాన్ని తీసుకోవచ్చు. ఈ ఫీచర్ వారికి అత్యవసరాల్లో చేదోడుగా నిలుస్తుంది. అమెజాన్ అసోసియేట్‌లకు ప్రతినెలా రెండు వీక్లీ ఆఫ్‌లు, వార్షిక సెలవులు, అనారోగ్య సెలవులు లభిస్తాయి. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), గ్రాట్యుటీ, ఈఎస్ఐసీ బీమా కవరేజ్ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు సైతం ఉద్యోగులు పొందొచ్చు. మొత్తం మీద ఈ ఉద్యోగం వల్ల ఆర్థిక స్థిరత్వం, సామాజిక భద్రత లభిస్తాయి. అమెజాన్ ఈ సంవత్సరంలో ఇప్పటివరకు వేలాది మంది భారతీయ మహిళలకు అసోసియేట్‌లుగా ఉద్యోగాలు ఇచ్చింది. అమెజాన్ ఉద్యోగుల్లో దాదాపు 2,000 మందికిపైగా దివ్యాంగులు సైతం ఉన్నారు. అన్ని వర్గాలకు ఉద్యోగాల భర్తీలో అమెజాన్ ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణాన్ని కల్పిస్తోంది.





## చాట్ జిపిటి గో రూ.399కే

**హైదరాబాద్,ఆగస్టు19, ప్రభాతవార్త:** భారత్లో లో చాట్ జీపీటీ గో పేరుతో ఓపెన్ ఏఐ కొత్త సేవలను ప్రకటించింది. రూ.399కే ఈ ప్లాన్ అందుబాటులో ఉండనున్నట్లు తెలిపింది. మెసేజ్‌లు, ఇమేజ్ జనరేషన్, ఫైల్ అప్లోడ్ల సంఖ్యను భారీగా అనుమతించనుంది. ఇండిక్ లాంగ్వేజీ సపోర్టుతోపాటు యూపీఐతోనూ చెల్లింపులు చేసే సౌలభ్యాన్ని తీసుకొచ్చినట్లు తెలిపింది. ఉచిత ప్లాన్‌తో పోలిస్తే జీపీటీ గో లో మెసేజ్ లిమిట్, ఇమేజ్ జనరేషన్, ఫైల్ లేదా ఇమేజ్ అప్లోడ్లు 10 రెట్లు ఎక్కువగా ఉండనున్నాయి. మెమొరీ కూడా ఉచిత ప్లాన్లో పోలిస్తే రెండింతలు ఎక్కువగా ఉండనుంది. భారత్‌లో ఓపెన్ ఏఐ టూల్స్‌కు భారీగా పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ఈ అధునాతన కృత్రిమ మేధ టూల్స్‌ను అందుబాటులో ధరల్లో అందించేందుకు చాటీజీపీటీ గో పేరుతో కొత్త ప్లాన్లను ప్రవేశపెడుతున్నాం" అని తాజా ప్రకటనలో వెల్లడించింది. ఇదివరకే అందుబాటులో ఉన్న రూ.1999 చాట్ పీటీ ప్లస్ ప్లాను అదనంగా ఇది ఉండనుంది. దీంతోపాటు నిపుణులు. సంస్థల కోసం ఇప్పటికే ప్రో ప్లాన్‌కు రూ.19,900తో అడ్వాన్స్డ్ ఫీచర్లను అందిస్తోన్న విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని చాటే జీపీటీ వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ నిక్ టర్లీ పేర్కొంటూ. భారత్‌లో లెర్నింగ్, వర్క్, క్రియేటివిటీ, ప్రాబ్లమ్‌సాల్వింగ్ కోసం నిత్యం లక్షలాది మంది యూజర్లు చాటిజీపీటీని ఎలా ఉపయోగిస్తున్నారనే విషయం నుంచి ఓపెన్ ఏఐ ప్రేరణ పొందుతోందన్నారు. ఈ నేపథ్యంలో యుపిఐ ద్వారా ఈ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చాట్‌జిపిటీ లోగోను ప్రవేశపెడుతున్నామన్నారు. ధరలు కూడా భారత్ కరెన్సీలోనే కనిపించనున్నాయని ఆయన ఇతర దేశాలకు విస్తరించే ముందు భారత్‌లో వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఓపెన్ ఏఐ అత్యంత ఆడ్వాన్స్‌డు ఏఐ మోడల్ చాట్‌జిపిటీ 5ను ఇటీవల పరిచయం చేసింది. ఈ సందర్భంగా ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్టమన్ మాట్లాడుతూ చాట్‌జిపిటిని మార్కెట్‌లలో రెండో స్థానంలో ఉన్న భారత్ త్వరలోనే అతిపెద్ద మార్కెట్‌గా అవతరించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు నిపుణులు ,డెవలపర్లు క్రియేటర్లు, సంస్థలకు చెందిన లక్షలాది మంది యూజర్లతో వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఓపెన్ ఏఐ ఇప్పటివరనకు తయారు చేసిన అత్యంత శక్తివంతమైన మేడల్‌గా దీన్ని పేర్కొంది.

## 1జిబి ప్లాన్‌కు మంగళం!





**హైదరాబాద్,ఆగస్టు19, ప్రభాతవార్త:** ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్టెల్ కూడా వినియోగదారులకు షాకిచ్చింది. ఎంట్రీలెవల్ ప్రీపెయిడ్ ప్లాన్ రూ.249కు మంగళం పాడేసింది. బుధవారం (ఆగస్టు 20) నుంచి ఈ ప్రీపెయిడ్ ప్లాన్ యూజర్లకు అందుబాటులో ఉండదు.

1జీబీ డేటా ప్లాన్ను జియో తొలగించిన కొన్ని గంటల్లోనే ఎయిర్టెల్ నుంచి ఈ నిర్ణయం వెలువడింది. వొడాఫోన్ ఐడియా నుంచి ఇదే తరహా నిర్ణయం వెలువడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 24 రోజులకు 1 జీబీ డేటా, అపరిమిత కాల్స్తో ప్రస్తుతం ఎయిర్టెల్ ఈ ప్యాక్ అందిస్తోంది. ఇకపై ప్రతి యూజర్ కనీస రీఛార్జి రూ.319 చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్యాక్ నెలరోజుల వ్యాలిడిటీతో వస్తోంది.

ప్రస్తుతం వొడాఫోన్ ఐడియా రూ.299కు 1జీబీ/డే ప్లాన్ను అందిస్తోంది. తొలుత జియో..: 28 రోజులకు రోజుకు 1 జీబీ డేటా అందించే ప్లాన్ ను జియో నిలిపివేసింది. ఇకపై రోజుకు 15 జీబీ ప్లాన్లే ఆప్షన్గా అందుబాటులో ఉంటాయి. ఇప్పటికే ఈ మార్పు అమల్లోకి వచ్చింది. జియో వెబ్సైట్లో 1జీబీ ఎంట్రీ లెవల్ ప్లాన్ కనుమరుగైంది. ప్రస్తుతం 28 రోజులకు రూ.299తో 1.5 జీబీ/డే, రూ.349తో 2 జీబీ/డే ప్లాన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. తిళిశిగీ పెంచుకునేందుకే ఎంట్రీ లెవల్ ప్లాన్లు సవరించడం వల్ల యూజర్లు కనీసం రోజుకు 1.5జీబీ అందించే ప్లాన్కు మారాల్సి ఉంటుంది. దీంతో యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయాలు (తిళిశిగీ) ఆ మేర పెరగనున్నాయి. జియో యూజర్లలో 20 25 శాతం మంది 1జీబీ ప్లాన్ వాడే వాళ్లుంటారని అంచనా ఎయిర్టెల్ యూజర్లలో 1820 శాతం మంది ఎంట్రీ లెవల్ ప్లాన్ యూజర్లు ఉంటారు. ఈ ప్లాన్లు తొలగింపు వల్ల ఆయా టెలికాం సంస్థల ఆదాయాలు 47 శాతం, సగటు ఆదాయం రూ.1013 మేర పెరుగుతుందని బ్రోకరేజీ సంస్థలు అంచనా.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14